

గిద్దలూరులో సంజీవని అనాథ ఆశ్రమాన్ని నడుపుతున్న ఆటో డ్రైవర్ రాజశేఖర్

ఆపద్బాంధవుడు

- ఆదర్శంగా నిలుస్తున్న ఆటోవాలా
- పేదరికాన్ని లెక్కచేయకుండా ఆశ్రమం ఏర్పాటు
- వచ్చే ఆదాయంలో దానికి కొంత మొత్తం కేటాయింపు
- దాతల సహకారంతో మరికొంత సేకరించి నిర్వహణ

7



ఉద్యోగాలు సాధించిన వారితో ఎమ్మెల్యే దామచర్ల

6

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

షార్ప్ ఇండియా సహకారంతో ఎమ్మెల్యే దామచర్ల నేతృత్వంలో ఒంగోలులో బుధవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 1,262 మందికి సుమారు 30 కంపెనీలలో ఉద్యోగాలు లభించాయి.

భారీ నష్టం

5,020.96 హెక్టార్లు.. 7,468 మంది రైతులు

- గత నెలలో వర్షాలకు దెబ్బతిన్న పంటల లెక్క తేల్చిన అధికారులు
- రూ.7.12 కోట్ల పరిహారం కోరుతూ ప్రభుత్వానికి కలెక్టర్ అన్సారియా నివేదిక

ఒంగోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాలపై అధికారులు లెక్క తేల్చారు. వ్యవసాయశాఖ పరిధిలో మొత్తం ఆరు రకాల పంటలు 5,020.96 హెక్టార్లలో దెబ్బతిన్నాయని, 7,468మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించారు. గతనెల 10 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసిన విషయం విదితమే. అత్యధిక ప్రాంతాల్లో భారీగా పడ్డాయి. చాలా మండలాల్లో 15 నుంచి



మొలకెత్తిన సజ్జ కంకి (ఫైల్)



వర్షాలకు కుళ్లిన పత్తి కాయలు (ఫైల్)

23 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలా తెరపిలేకుండా వర్షాలు కురవడంతో పంటలకు అపార నష్టం వాటిల్లుతుందని అందరూ భావించారు. అయితే వర్షాలు కురిసే సమయానికి ఖరీఫ్ పంటలు అధిక శాతం పూత, కాయ దశలో ఉన్నాయి. కోతకు వచ్చిన సజ్జ పంట, అలాగే కాయలు కుళ్లి కొంత మేర పత్తికి నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా వర్షాలు కురిసే సమయానికి మినుము, అలసంద, కంది ఇతరత్రా పంటలు వేసి నెల, నెలన్నర లోపుగా ఉన్నాయి. అలా మొక్క లేదా మొలకదశలో ఉన్న ఆ పంటలకు కూడా కొంత నష్టం వాటిల్లింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూత దశ నుంచి జరిగే నష్టాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. అలా గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం కొంత పరిమితంగానే తేలింది.

రూ.7.12 కోట్లు పరిహారం ఇవ్వాలి

గతనెల 27 వరకు రైతు, పంట వారీ నష్టాలను వ్యవసాయ, రెవెన్యూ క్షేత్ర స్థాయి అధికారులు సర్వే చేసి

మిగతా 6వ పేజీలో



ఐదేళ్లలో ఊడ్చేశారు!

గత పాలకుల నిర్వాకం

కార్పొరేషన్ ఖజానా ఖాళీ



- పన్నులే ఆదుకోవాల్సిన పరిస్థితి
- నగరపాలక సంస్థపై బకాయిల బండ
- రూ.100 కోట్ల వరకు చెల్లించాల్సిన పరిస్థితి
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

అభివృద్ధి జరగాలంటే నిధులు అవసరం. అయితే గత పాలకుల నిర్వాకంతో నేడు ఒంగోలు నగరపాలక సంస్థలో ఆర్థిక సంక్షోభం నెలకొంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు లేకపోగా, పన్నుల రూపంలో వసూలైన వాటిని కూడా కరిగించేశారు. దీంతో కార్పొరేషన్‌పై బకాయిల భారం పడింది. అభివృద్ధి పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. కార్యాలయ నిర్వహణకు నిధుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు నిన్న మొన్నటి వరకూ ఆర్‌ఐలుగా ఉన్నవారు, అలాగే సచివాలయ సెక్రటరీలు సైతం పన్నులు పూర్తిస్థాయిలో వసూలు చేయలేదు. పైనుంచి నిధులు కేటాయించకపోవడంతో కార్పొరేషన్ ఖజానా అడుగంటింది. దీంతో నెలనెలా నిర్వహణ ఖర్చు అధికారుల్లో ఆందోళన కలిగిస్తోంది.

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగర పాలక సంస్థ ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది. గత వైసీపీ ప్రభుత్వ పెద్దల నిర్వాకంతో నిర్వహణ ఖర్చులకు కూడా ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఐదేళ్లుగా పట్టణాల ప్రగతిని పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను విడుదల చేయలేదు. దీంతో ప్రజలు పన్నుల రూపంలో చెల్లించే నిధులే ఆధారమయ్యాయి. అవి కూడా పూర్తిస్థాయిలో వసూలు చేయకపోవడంతో కార్పొరేషన్‌లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ప్రస్తుతం కార్పొరేషన్ ఖాజానాలో రూ.3.5 కోట్లు మాత్రమే కనిపిస్తున్నాయి. పన్నులు, ఇతరత్రా రూ.39 కోట్లు రావాల్సి ఉంది. ఇక చెల్లించాల్సిన బకాయిలు రూ.100 కోట్ల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పనులను వదిలేశారు

వాస్తవానికి ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నిధుల (జనరల్ ఫండ్)తో రోడ్లు, కాలువలు, భవనాల నిర్మాణం, ప్రహరీలు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్యం మెరుగు, తాగునీటి సరఫరా, కొత్తగా పైపులైనులు, పాతవాటికి మరమ్మతులు, మరుగుదొడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి తదితర పనులు చేయాల్సి ఉంది. అయితే అభివృద్ధి పనులను వదిలేసి, అత్యవసర పనులైన పారిశుధ్యం, తాగునీటి సరఫరాకే పరిమితమయ్యారు. దీంతో ఉన్న నిధులు కరిగిపోయాయి. ప్రస్తుతం ఖజానాలో రూ.3.5 కోట్లు మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అందులో రూ.2.5 కోట్లు గత

మిగతా 6వ పేజీలో

డీసీసీబీలో విచారణ ప్రారంభం

- రంగంలోకి దిగిన త్రిసభ్య కమిటీ
- పలు ఫైళ్ల పరిశీలన
- ఆరా తీసిన జేసీ
- ఇన్‌చార్జి సీఈవోగా రాఘవయ్యకు బాధ్యతలు

ఒంగోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో అవినీతి, అక్రమాలపై ప్రాథమిక విచారణ ప్రారంభమైంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇందుకోసం నియమించిన ముగ్గురు అధికారుల కమిటీ బుధవారం సాయంత్రం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విచారణ చేపట్టింది. బ్యాంకులో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ స్థాయిలో కదలిక వచ్చిన నేపథ్యంలో ప్రాథమికంగా ముగ్గురు సభ్యుల కమిటీని విచారణకు నియమించారు. అది సజావుగా సాగేందుకు సీఈవో కోటిరెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరిన నేపథ్యంలో కొంత ఆలస్యంగా అయినా తదనుగుణ చర్యలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఉన్నతాధికారుల



ఫైళ్లను పరిశీలించిన కమిటీ

ఆదేశాలతో ఇప్పటివరకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి మంగళవారం రాత్రి ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజీనామా లేఖను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణకు అందజేశారు. దీంతో ప్రస్తుతం బ్యాంకు జనరల్ మేనేజర్ (జీఎం)గా ఉన్న కుంభా రాఘవయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ముగ్గురు అధికారులతో విచారణ

కలెక్టర్ తన లేఖలో కోరిన సెక్షన్ 51 విచారణ వైపు ప్రభుత్వం మొగ్గుచూపినట్లు సమాచారం. అందుకు వీలుగా ప్రభుత్వానికి గతంలో అందిన ఫిర్యాదులతోపాటు తాజాగా మరికొన్ని ఆర్థికపరమైన అవకతవకలు కూడా కలెక్టర్ దృష్టికి రావడంతో వాటన్నింటినీ పరిశీలించాలని సూచించారు. తదనుగుణంగా లోకేశ్వరరావు నేతృత్వంలోని ముగ్గురు కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం డీసీసీబీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పలు ఫైళ్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణ బుధవారం మధ్యాహ్నం బ్యాంకుకు వెళ్లి ఒకరిద్దరు కీలక అధికారులను పిలిచి గతంలో బ్యాంకులో జరిగిన బంగారు రుణాల అక్రమాలు, అప్పట్లో జరిగిన అవకతవకలు, విచారణలు, తదనంతర చర్యలు, ఇతరత్రా అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం.

మిగతా 6వ పేజీలో

రౌడీషీటర్ వీరంగం

- మద్యం మత్తులో ఒక కుటుంబంపై దాడి
- ముగ్గురికి గాయాలు
- శానంపూడిలో ఘటన

6



రౌడీషీటర్ దాడిలో గాయపడిన కొండలరావు

మహిళా సాధికారతకు కృషి చేయాలి : కలెక్టర్

7

ఇం'ధనం' లేక.. నిలిపివేత!

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్న 108 వాహనాలు మూగబోతున్నాయి. నిత్యం ఎక్కడ ఏప్రమాదం జరిగినా సత్వరమే చేరుకునే వాటికి ఇంధనం (డీజిల్) లేని పరిస్థితి నెలకొంది. ఆ వాహనాలకు అవసరమైన మేరకు డీజిల్ లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయోనని పైలెట్లు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా 108కు డీజిల్ ఫుల్‌ట్యాంకు చేయించుకొని అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగినట్లు ఫోన్ వచ్చిందంటే ఏసమయంలోనైనా సరే అక్కడకు ఆగమేఘాలపై వెళ్లాలి. అటువంటి వాహనాల నిర్వహణ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా అరబిందో సంస్థకు 108 వాహనాల నిర్వహణ కాంట్రాక్టు అప్పగించింది. ప్రస్తుతం కూడా ఆ సంస్థనే చూస్తోంది. అందులో భాగంగా మన జిల్లాలో 40 వాహనాలు నడుస్తున్నాయి. వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత

మిగతా 6వ పేజీలో



- కదలని 108 వాహనాలు
- డీజిల్‌కు నిధులు అందని పరిస్థితి
- అప్పుపై పోసేందుకు పెట్రోలు బంకుల యజమానులు ససేమిరా
- ప్రభుత్వం నుంచి సంస్థకు రాని బకాయిలు
- వాహనాలు బంద్



పడమరవీరాయపాలెం వద్ద అక్రమంగా వెలికితీసిన తెల్లరాయి

తెల్లరాయి అక్రమ క్వారీయింగ్

- ప్రభుత్వ భూముల్లో అనధికారిక తవ్వకాలు
- పడమరవీరాయపాలెం వద్ద అడ్డగోలు వ్యవహారం
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు
- లారీ, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

7



పాత సింగరాయకొండ వద్ద ఉన్న జీవీఆర్ కంపెనీ

జీవీఆర్ కంపెనీపై ఐటీ దాడులు

- ఉదయం నుంచి రాత్రి వరకూ విస్తృత తనిఖీలు
- రికార్డులన్నీ క్షుణ్ణంగా పరిశీలన
- ముఖ్యమైన కొన్నింటిని స్వాధీనం చేసుకున్న అధికారులు

మెయిన్‌లో..


జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు


కంపెనీ, ఇంటర్వ్యూ కౌంటర్ వివరాలను పరిశీలిస్తున్న అభ్యర్థులు


ఇంటర్వ్యూకు హాజరై సంతకాలు చేస్తున్న అభ్యర్థులు

1,262 మందికి ఉద్యోగాలు

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): షార్ప్ ఇండియా సహకారంతో దామచర్ల నేతృత్వంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. స్థానిక ఏ1 ఫంక్షన్ హాలు ఏర్పాటు చేసిన మేళాకు యువతీ, యువకులు, నిరుద్యోగులు భారీగా తరలివచ్చారు. సుమారు 3,650 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 1,262 మందికి సుమారు 30 కంపెనీలలో ఉద్యోగాలు కల్పించినట్లు ఎమ్మెల్యే దామచర్ల తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు భారీ స్థాయిలో అభ్యర్థులు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యోగాలు రానివారు నిరుత్సాహపడవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మునిసిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగర అధ్యక్షుడు కొరారి నాగేశ్వరరావు, దామచర్ల అనీషాలక్ష్మి, ఆయా కంపెనీల ప్రతినిధులు, షార్ప్ ఇండియా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పైన పటారం.. లోన లొటారం!

● పీహెచ్‌సీ మరమ్మతుల తీరిదీ.. ● గత ప్రభుత్వంలో రూ.40 లక్షలు మంజూరైనా నాసిరకం పనులే ● శ్లాబ్‌కు నెర్రెలు... కొద్ది వర్షానికే లోపలికి నీరు

తాళ్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలన మొత్తం మసిపూసి మారేడు కాయ చేసినట్లు సాగింది. పీహెచ్‌సీ భవన మరమ్మతుల పనుల్లో నాణ్యత చూపలేదు. అందుకు తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన మరమ్మతు పనులే నిలువుటద్దం. భవనం చూస్తే రంగు.. రంగులతో బయటకు అందంగా కన్పిస్తుందే తప్ప లోనికి వెళితే అసలు సంగతి అర్థమవుతుంది. ఈ పీహెచ్‌సీకి రూ.40 లక్షలతో మరమ్మతులు చేయించారు. పనులు నాశిరకంగా జరగటంతో భవనం శిథిలావస్థలో ఉంది. చిన్నపాటి వర్షానికే ఆసుపత్రి గదుల శ్లాబ్ గుండా వర్షపు నీరు దిగుతూ గోడలు చెమ్మబారుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కంటాక్టర్ గదుల మరమ్మతులు చేస్తున్నామంటూ పై భాగాన, లోపలివైపు, బాత్‌రూమ్‌లను పగలగొట్టారు. 2021 జనవరిలో ప్రారంభమైన పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో నిత్యం పీహెచ్‌సీకి వచ్చే రోగులకు, ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యసేవలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మరమ్మత్తుల పేరిట అన్ని వసతులూ ఉన్న భవనాన్ని పగులగొట్టి పనులను నాణ్యత లేకుండా పూర్తి చేయటం వల్ల ఇబ్బందులు తప్పటం లేదు. గతంలో ఉన్న గదులను ధ్వంసం చేసి పాలిష్ రాళ్ల వేశారు. పైభాగనున్న శ్లాబ్‌ను చిట్లగొట్టకుండా దానిపైనే వేసి చేతులు దులుపుకోవటంతో ఆసుపత్రి వర్షపు నీటికి కురుస్తోంది. ఆసుపత్రిలోనికి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన ముఖ ద్వారాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉంటోంది. పీహెచ్‌సీ ముందు గేటు వద్ద గడప భాగాన్ని గుంతగా వదిలి అటు, ఇటు పాలిష్ రాళ్ల వేశారు. ఆపరేషన్ థియేటర్‌లోకి శ్లాబ్ గోడల నుంచి వర్షపు నీరు లోనికి దిగుతోంది. ఓపీ గదిలోని గోడ వర్షపు నీటికి అపరిశుభ్రంగా మారింది. ఆసుపత్రిలో మందులు భద్రపరిచే గది, వ్యాక్సిన్ నిల్వ ఉంచే గది, వైద్యురాలి గది చిన్న పాటి వర్షం నీటికి గోడలు చెమ్మబారుతూ కనిపిస్తున్నాయి. దీనివల్ల గోడలు పాచిపట్టి పోతున్నాయి. దీంతో వైద్యశాలలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది, ఆసుపత్రి వేళ్లే రోగులకు ఇబ్బందిగా మారింది. ఆసుపత్రి ఆవరణలో మరమ్మతుల కోసం తోలిన కంకర్, సిమెంటు ఇటుకలు చెట్లు మొలిచి ఆరోగ్యకేంద్రం కాస్తా అనారోగ్య కేంద్రంగా దర్శనమిస్తోంది. వైద్య శాఖ సిబ్బంది సమావేశాల కోసం మంజూరైన భవనం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. గత వైసీపీ పాలనలో హెచ్‌సీలోని అవస్థల గురించి అనేకమార్లు అప్పటి పాలకులు, కలెక్టర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్‌ల దృష్టికి తీసుక వెళ్లినా పీహెచ్‌సీకి అసంపూర్తిగా ఉన్న పనులు చేయించలేకపోయారు. పనులు పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్ పత్తా లేకుండా పోయాడు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని చెబుతున్నందున నాలుగేళ్లుగా అసంపూర్తిగా ఉన్న తాళ్లూరు పీహెచ్‌సీ భవనానికి మరమ్మతులు పూర్తి చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


వర్షపు నీటితో పాచిపట్టిన ఆసుపత్రి గోడలు


గేటు వద్ద గుంత పూడ్చకుండా వదిలేసిన దృశ్యం

ఇలా అరెస్ట్ చేశారు..

అలా వదిలేశారు..

అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తికి స్టేషన్ బెయిల్ ఇచ్చిన పోలీసులు

మార్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై ఎక్స్ వేదికగా అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ కార్యకర్త కల్లి నాగిరెడ్డిని మంగళవారం రాత్రి పోలీసులు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. సోషల్ మీడియా వేదికగా రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిపై అనుచిత పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదుల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అరెస్టుల పరంపర కొనసాగుతోంది. అందులో భాగంగా గత నెల 7వ తేదీన పోస్టులు సీఎం, డిప్యూటీ సీఎంలు విజయవాడ వరద సహాయంలో రూ.534 కోట్లు లూటీ చేశారని నాగిరెడ్డి అనే వ్యక్తి ఎక్స్ వేదికగా పోస్టు చేశాడు. మార్కాపురానికి చెందిన యశ్వంత్ అనే యువకుడి ఫిర్యాదు మేరకు మార్కాపురం టౌన్ పోలీసు స్టేషన్‌లో 21వ తేదీన కేసు నమోదైంది. సుమారు రెండు వారాల తర్వాత ఈ నెల 5వ తేదీ ఉదయం తాడేపల్లిలో నాగిరెడ్డిని అరెస్ట్ చేసి మార్కాపురం తరలించారు. కానీ టౌన్ పోలీసులు రాత్రి 12.00 గంటల తర్వాత బీఎన్ఎస్ఎస్ 35 (3) మేరకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపేశారు. ఈ విషయమై పట్టణ ఎస్సై సైదుబాబును వివరణ కోరగా జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాగిరెడ్డికి స్టేషన్ బెయిల్ ఇచ్చినట్లు తెలిపారు.

జాయింట్ కలెక్టర్ తీరుపై న్యాయవాదుల అసంతృప్తి

రేపు విధుల బహిష్కరణ

ఒంగోలు క్రైం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్ న్యాయవాదుల పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై ఒంగోలు బార్ అసోషియేషన్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈమేరకు బుధవారం స్థానిక బార్ అసోషియేషన్ హాలులో అధ్యక్షుడు నాగిశెట్టి మోహన్‌దాస్ అధ్యక్షతన సమావేశమై పలు తీర్మానాలు చేశారు. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ కోర్టుకు వెళ్లినప్పుడు సీనియర్ న్యాయవాదులైన ఆలపాటి వివేకానంద, డి.వినోద్‌కుమార్‌లను అవమానకరంగా మాట్లాడారని బార్ అసోషియోషన్‌కు ఫిర్యాదు రావడంతో అసోషియేషన్ సమావేశమై శుక్రవారం కోర్టు విధులు బహిష్కరించి జాయింట్ కలెక్టర్ తీరు పట్ల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానించింది. సమావేశంలో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి ఏల్చూరి సురేంద్రబాబు, పలువురు న్యాయవాదుల పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఊడ్చేశారు!

(5వ పేజీ తరువాయి)

కొన్ని నెలలుగా నీటి సరఫరా ట్యాంకర్ల బిల్లులకు చెల్లించాల్సి ఉంది. మరోవైపు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15 కోట్లు ఉన్నప్పటికీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగాం (నాక్) కింద చేపట్టిన పనులకు ఖర్చుచేయాల్సి ఉంది. గత కొన్నేళ్లుగా రెవెన్యూ సెక్షన్‌లో నెలకొన్న అలసత్వంతో ఆస్తి, తాగునీటి పన్నుల రూపంలో రూ.20 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయి.

ఆదాయం కన్నా.. అప్పులే అధికం

ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం కంటే అప్పులే అధికంగా కనిపిస్తున్నాయి. పైపులైను లేని శివారు కాలనీలకు తాగునీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్ల బిల్లులు రూ.2.5 కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై నేటికీ ఒక్క పైసా కూడా చెల్లించకపోవడంతో ట్యాంకర్ల నిర్వహణ భారంగా మారిందంటూ కాంట్రాక్టర్లు వాపోతున్నారు. మరోవైపు గత ఐదేళ్లలో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు రూ.50 కోట్ల వరకు బకాయిలు ఉండగా, వాటిని చెల్లించకపోవడంతో కొత్తగా పనులు చేపట్టేందుకు వారు ఆసక్తి చూపడం లేదు. మరోవైపు ప్రతిపాదించిన టెండర్లు పొంది పనులు ప్రారంభించని పనులు సైతం రూ.80 కోట్లకుపైన ఉన్నాయి. విద్యుత్ బిల్లులు బకాయిలు రూ.10 కోట్లు, మార్కెటింగ్ శాఖకు ఇవ్వాల్సినవి రూ.5కోట్లు, అమృత్ రుణం తీసుకున్న వాటికి వడ్డీ కింద రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉంది.

బకాయిలపై తర్జనభర్జన

నెలనెలా ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, వాటర్ వర్క్స్, పార్కుల్లో పనిచేస్తున్న వారికి వేతనాలు చెల్లించాల్సి ఉంది. ఇంతవరకు కార్పొరేషన్ నుంచి చెల్లించాల్సిన బాకీలు కనిపిస్తుండగా, రావాల్సిన ఆదాయం మాత్రం అందులో సగం కూడా కనిపించడం లేదు. పన్నులు, కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల అద్దెలు, ఇతరత్రా కలిపి రూ.20 కోట్లు రావాల్సి ఉంది. మరోవైపు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఐదు నెలలుగా రూ.9 కోట్లు, అలాగే, బీపీఎస్ స్కీమ్ ద్వారా చెల్లించిన సొమ్ముకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు వరకు రావాల్సి ఉంది. మరోవైపు తమ బకాయిలు త్వరితగతిన చెల్లించాలని కాంట్రాక్టర్లు వత్తిడి చేస్తున్నారు. దీంతో కార్పొరేషన్ అధికారులు రావాల్సిన ఆదాయం, చెల్లించాల్సిన బకాయిలపై తర్జనభర్జన పడుతున్నారు.

పన్నుల వసూళ్ల బాధ్యత పాత ఆర్ఐలదే

అవినీతికి నిలయంగా మారిన రెవెన్యూ విభాగాన్ని ప్రక్షాళన చేస్తూ మునిసిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు పనిచేసిన వారిని పూర్తిగా పక్కనపెట్టి కొత్త వారిని ఆర్ఐలుగా నియమించారు. అయితే ఇప్పటివరకూ పనిచేసిన ఆర్ఐలు వారి వార్డులలో ఉన్న పన్నుల బకాయిల వసూళ్ల బాధ్యత వారిదేనంటూ ఉత్వర్వులు జారీ చేశారు. సీట్లు మారినా వసూలు చేయాల్సిందేనని ఆదేశించారు. షాపింగ్ కాంప్లెక్స్‌ల బకాయిల బాధ్యత పాత ఆర్ఐలకు అప్పగించారు. నివాసాలు, ప్రైవేటు షాపులు, నీటి పన్నులు వసూళ్ల బాధ్యతను సచివాలయ సెక్రటరీలకు ఇచ్చారు. వారికి రోజువారీ కలెక్షన్ టార్గెట్లు నిర్ణయించడంతోపాటు ఏరోజుకారోజు నివేదికలు అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. వచ్చే మార్చి నాటికి దాదాపు నూరుశాతం పన్నులు వసూలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. ఇదిలా ఉంచితే నూతన ఆర్ఐలు వారికి కేటాయించిన డివిజన్లలో పన్నులు వసూలు చేయడంతోపాటు ఇంకా వేయని వాటిని గుర్తించాలన్నారు.

కూటమిపై కోటి ఆశలు..

కార్పొరేషన్ ఆర్థికంగా బలపడాలన్నా, చేపట్టిన పనులు ముందుకు సాగాలన్నా కూటమి ప్రభుత్వంపై కార్పొరేషన్ యంత్రాంగం కోటి ఆశలు పెట్టుకుంది. ఒకవైపు పన్నుల రూపంలో తమకు రావాల్సిన సొమ్ము వసూళ్లపై దృష్టిసారిస్తూ, మరోవైపు చేపట్టిన పలు అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం వైపు నుంచి సహకారం కూడా అవసరం ఉందని కోరుతున్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించడంతోపాటు, సమస్యల పరిష్కారం, అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరినట్లు సమాచారం. మొత్తంగా కార్పొరేషన్‌ను ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి అవసరమైన మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు.

ఖర్చు తగ్గించి ఆదాయమార్గాల పెంపునకు చర్యలు

ఆర్థిక లోటును అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం ఉన్న బకాయిల చెల్లింపు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.500 కోట్లు అవసరం. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు, డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం. వాటితోపాటు ఖర్చులను తగ్గించి, కార్పొరేషన్ ఆస్తులను వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా దృష్టి సారించాం. ఖాళీ స్థలాలను లీజు పద్ధతిన కేటాయించడంతోపాటు, అవసరమైన చోట షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తాం. దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న ఆస్తి, నీటి పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. వాటిని కూడా పూర్తిస్థాయిలో వసూలు చేసి, బకాయిలు చెల్లింపునకు చర్యలు చేపడతాం. ప్రభుత్వ భవనాల పన్నులు కూడా ఎక్కువ మొత్తంలో పెండింగ్ ఉంది. ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతున్నాం.

\- డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, నగర కమిషనర్

రౌడీషీటర్ వీరంగం

● మద్యం మత్తులో ఒక కుటుంబంపై దాడి
● ముగ్గురికి గాయాలు ● శానంపూడిలో ఘటన

సింగరాయకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. దుకాణం ఎదురుగా ఆయన నిలిపిన మోటార్ బైక్‌ను పక్కకు తీయమన్నందుకు ఒక కుటుంబంపై దాడికి తెగబడ్డాడు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని శానంపూడి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని ఆంజనేయనగర్‌కు చెందిన బండి నవీన్ రౌడీషీటర్. ఆయన శానంపూడిలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. అక్కడ స్నేహితులతో కలిసి పూటుగా మద్యం సేవించాడు. అనంతరం దగ్గరల్లో ఉన్న కిరాణా దుకాణం వద్దకు వెళ్లాడు. దుకాణం ఎదురుగా మోటారు బైక్‌ను నిలిపి మద్యం మత్తులో చిందులు తొక్కడం ప్రారంభించాడు. దుకాణం నిర్వాహకురాలు వాసేపల్లి ధనమ్మ అక్కడ నుంచి పక్కకు పోవాలని చెప్పింది. దీంతో ఆగ్రహించిన నవీన్ అక్కడ ఉన్న కర్ర తీసుకొని ఆమెపై దాడికి దిగాడు. పక్కనే ఉన్న ధనమ్మ కుమారుడు నవీన్‌ను వారించేందుకు వెళ్లగా ఆయనపై నాపరాయితో దాడి చేశాడు. ఆ సమయంలో అడ్డు వచ్చిన కొండలరావు భార్యని కూడా అదేరాయితో కొట్టాడు. స్థానికులు అతికష్టం మీద రౌడీషీటర్‌ను పక్కకు తీశారు. వెంటనే క్షతగాత్రులను కందుకూరు ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా శానంపూడికి వెళ్లి రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

అక్షర వెలుగులు నింపే ఉల్లాస్

నాగులుప్పలపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళల జీవితాల్లో అక్షర వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఉమ్మడి ప్రకాశం జిల్లా వయోజన విద్య పర్యవేక్షకుడు టి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా గ్రూపు స్వచ్ఛంద బోధకులకు ఉల్లాస్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఏపీవో నరేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చదువులేని మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. డ్వాక్రా గ్రూపుల్లోని అక్షరాస్యులైన మహిళలు నిరక్షరాస్య మహిళలకు చదువు చెప్పేందుకు ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్వచ్ఛంద బోధకులుగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. మండల పరిధిలో గుర్తించిన 970 మంది నిరక్షరాస్య మహిళలకు మొదటి విడతగా ఎంపిక చేసిన వారిని అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. ఎంఈవో టి.రవి మాట్లాడుతూ అక్షర వెలుగు వాచకంలోని ఎనిమిది అంశాల గురించి వివరించారు.

ప్రభుత్వ పథకాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో చిరంజీవి

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, అభివృద్ధి పథకాలను పరిగణలోకి తీసుకొని గ్రామాల్లో రూపొందించే ప్రణాళికలు ప్రాధాన్యత క్రమంలో ఉండాలని జడ్పీ సీఈవో చిరంజీవి ఆదేశించారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బుధవారం ఎంపీడీవోలు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ల శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ ప్రణాళికల ద్వారానే గ్రామాల్లో అభివృద్ధి చేసేందుకు దోహదపడుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో వెంకటనాయుడు, డిప్యూటీ సీఈవో బాలమ్మ, కనిగిరి డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మవరం చేపల చెరువుకు

వేలం పాట

రూ.15.60 లక్షలకు దక్కించుకున్న వెంకట నారాయణరెడ్డి

డిపాజిట్‌దారులు లేక ఆగిపోయిన ఈదర చెరువు పాట

ముండ్లమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈదర పంచాయతీ పరిధిలోని కొమ్మవరం చేపల చెరువులో మూడేళ్లపాటు చేపలు పెంచుకునేందుకు బుధవారం ఈదర పంచాయతీ కార్యాలయంలో వేలం పాట నిర్వహించారు. ఐదుగురు పాల్గొనగా ఈదర గ్రామానికి చెందిన బాయిరెడ్డి వెంకట నారాయణరెడ్డి రూ.15.60 లక్షలకు పాట పాడి చెరువు లీజును దక్కించుకున్నారు. ఈదర చెరువుకు వేలం పాట నిర్వహించాల్సి ఉండగా వేలం డిపాజిట్‌లు కట్టడానికి ఎవరూ ముందుకు రాకపోవటంతో వారం రోజుల పాటు వాయిదా వేశారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు చింతలపాలెం విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు చింతలపాలెం విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 2న జిల్లాలోని గొట్లగట్టు హైస్కూల్‌లో అండర్ 14, 17 బాలబాలికలకు జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలు జరిగాయి. జిల్లాస్థాయి రగ్బీ పోటీల్లో చింతలపాలెం హైస్కూల్ విద్యార్థులు ఎం అక్షర, ఎం కీర్తి, ఎం లక్ష్మీప్రసన్న, కే నిత్యశ్రీ, కేవీ హిమజ లు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 9, 10 తేదీల్లో కడప జిల్లాలోని కమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు హెచ్ఎం రామశర్మ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కే శ్రీదేవి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఇం'ధనం'లేక నిలిపివేత

(5వ పేజీ తరువాయి)

ఆ సంస్థపై ఉంటుంది. జిల్లాలో బుధవారం 10 వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలుతోపాటు కురిచేడు, పలు ఇతర మండలాల్లో వాహనాలు ఆగిపోయాయి. కేవలం 30 వాహనాలు మాత్రమే రన్నింగ్‌లో ఉండగా వాటిలోనూ డీజిల్ అయిపోతే అవి పక్కనపెట్టే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదన్న కారణంతో 108 వాహనాలకు అవసరమైన డీజిల్, ఇతర మెయిటినెన్స్‌కు సంస్థ డబ్బులు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఒక రోజు ఒక ప్రాంత వాహనాలకు డీజిల్ కొట్టించి నడుపుతున్నట్లు సమాచారం.

డీజిల్ వినియోగంపై సంస్థ ఆంక్షలు

సంస్థ రోజువారీ డీజిల్ కోసం కొంత నగదును నిర్ణయించి ఇస్తున్నట్లు సమాచారం. కొన్నిసార్లు 108 వాహనం ఎక్కువ తిరగాల్సి రావడంతో ఆ డీజల్ ఒక్క రోజుకే సరిపోతుంది. గతంలో రోజువారీ కాకుండా ఆ వాహనానికి ఉన్న ట్యాంకును ఫుల్ చేయించుకునే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రోజువారీ ఒక్కో వాహనానికి ఐదారు వందలకు మాత్రమే డీజిల్ కొట్టిస్తున్నట్లు సమాచారం. ఆ వినియోగంపై కూడా ఆంక్షలు పెడుతుండటంతో డ్రైవర్లు (పైలెట్) దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గతంలో డీజిల్ బంకుల్లో ఆ వాహనాలకు అప్పునకు పోసేవారు. నెలవారీ బిల్లులు చెల్లించేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ఏరోజుకారోజు పోయించుకోవాల్సి వస్తోంది. దీంతో వాహనాలు ఎప్పుడు నిలిచిపోతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

డీసీసీబీలో విచారణ ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కోరారు. సాధారణంగా అలాంటి నివేదిక జిల్లా సహకారశాఖ అధికారులు ఇస్తారు. అయితే బ్యాంకు సంబంధించిన వ్యవహారంలో ఇక్కడి సహకారశాఖ అధికారులు తనను తప్పుదోవ పట్టించారన్న ఆగ్రహంతో కలెక్టర్ ఉన్నారు. మరోసారి ప్రాథమిక విచారణ బాధ్యతను వారికి ఇస్తే ప్రమాదంగా భావించి ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించారు. రెవెన్యూలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారైన లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్ (ఎల్‌డీఎం) సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు.

భారీ నష్టం

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. ఈనెల 2 వరకు రైతు సేవా కేంద్రాలలో ఆ జాబితాలను ఉంచారు. పెద్దగా అభ్యంతరాలు, ఫిర్యాదులు రాలేదు. దీంతో వ్యవసాయ అధికారులు మూడు రోజుల క్రితం పంటల వారీ, రైతువారీ నష్టాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు ఇవ్వాల్సిన పరిహారం వివరాలను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె భారీవర్షాలతో 7,468 మంది రైతులకు చెందిన 5,020.96 హెక్టార్లలోని ఆరు రకాల పంటలకు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించారు. సంబంధిత రైతులకు పరిహారంగా రూ.7.12కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. కాగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం నిధులు విడుదల చేసినప్పుడు నేరుగా వారివారి ఖాతాల్లో ఆ మొత్తాలు జమ అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పంట నష్ట వివరాలు

పంట పేరు	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు	అంచనా (రూలక్షల్లో)
వరి	7.20	10	1.22
సజ్జ	1583.47	2558	135.44
జొన్న	3.18	3	0.27
పొగాకు	58.51	48	5.80
పత్తి	3338.49	4825	567.54
కొర్ర	20.20	24	1.72
మొత్తం	5020.96	7468	712.04(లక్షలు)

ఆపద్బాంధవుడు

ఆదర్శంగా నిలుస్తున్న ఆటోవాలా

- పేదరికాన్ని లెక్కచేయకుండా ఆశ్రమం ఏర్పాటు
- వచ్చే ఆదాయంలో కొంత భాగం ఆశ్రమానికి..
- దాతల సహకారంతో మరికొంత సేకరించి నిర్వహణ

లక్షలు, కోట్లు సంపాదించిన వారు దేవాలయాలకు, ఆశ్రమాలకు అంతో ఇంతో సహాయం చేస్తుంటారు. మరీ ఎక్కువ సంపాదన ఉన్నవారు ట్రస్టు ఏర్పాటు చేసి సహాయం అందిస్తుంటారు. కానీ భార్య, ముగ్గురు పిల్లలుండి, సొంత ఇల్లు లేక.. బతికేందుకు స్థిరమైన సంపాదన లేక అవస్థలు పడుతున్న నిరుపేద ఆయన. ఆటో నడుపుకుంటూ వచ్చిన ఆదాయంతో బతుకీడుస్తూ దాతల అండతో అనాథాశ్రమం ఏర్పాటు చేసి వృద్ధులకూ, అనాథలకూ ఆపద్బాంధవుడిగా నిలిచిన ఆ ఆటోవాలా స్ఫూర్తిపై ప్రత్యేక కథనం..

గిద్దలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం, కడప జిల్లాల సరిహద్దుల్లోని అక్కలరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓబులాపురం రాజశేఖర్ నిరుపేద కుటుంబంలో పుట్టారు. అల్లినగరం హాస్టల్‌లో ఉండి 10వ తరగతి వరకు చదివి బతుకుదెరువు కోసం బెంగుళూరు వెళ్లి పని చేశారు. అక్కడ పని దొరక్క భార్య, ముగ్గురు పిల్లలతో గిద్దలూరుకు తిరిగి వచ్చారు. రాజశేఖర్.. ఫైనాన్స్‌లో ఆటో తీసుకుని నడుపుకునేవారు. చిన్నతనంలో తన కుటుంబసభ్యులు ఒక్కొక్కరోజు అన్నం కూడా దొరక్క పస్తులున్న సందర్భాలనూ, ఆరోగ్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరిగిన సందర్భాలనూ గుర్తు చేసుకుని ఆటో నడుపుతూ వచ్చిన ఆదాయంతో పేదలకు ఏదో ఒక సాయం చేయాలని తలిచారు. తనకు వచ్చిన ఆలోచనతో ఒక చిన్నపాటి అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేశారు. దానికి సంజీవని అని పేరు పెట్టారు. మూడేళ్ల క్రితం ముగ్గురితో ప్రారంభమైన సంజీవనీ ఆశ్రమంలో ప్రస్తుతం 12 మంది వృద్ధులు, 12 మంది చిన్నారులు ఆశ్రయం పొందుతున్నారు.


ఆటో నడుపుతున్న రాజశేఖర్

దాతలే ఆధారం

తొలుత తక్కువ మంది వృద్ధులు ఉండడంతో ఆటో ద్వారా రోజూ సంపాదించే ఐదారు వందల్లో కొంత కుటుంబానికీ, మరి కొంత ఆశ్రమంలోని వృద్ధులకూ భోజన సదుపాయాలు కల్పించేవారు. అయితే రోజురోజుకూ ఆశ్రమంలో చేరే వృద్ధులు, పిల్లల సంఖ్య పెరగడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. రాజశేఖర్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని చూసిన పలువురు దాతలు అప్పుడప్పుడు వృద్ధులకు భోజన సౌకర్యాలు, నిత్యావసర వస్తువులు అందించేవారు. నెలకు ప్రస్తుతం రూ.50 వేలు వరకు అనాథాశ్రమానికి వెచ్చించాల్సి ఉండగా ఆశ్రమంలో ఉన్న ముగ్గురు వృద్ధులకు వచ్చే పింఛన్, నెలకు రెగ్యులర్‌గా దాతల నుంచి వచ్చే రూ.4వేల సరిపోవడం లేదు. తనకు తోడుగా ఇంకెవరైనా సహకరిస్తే ఆశ్రమాన్ని మెరుగ్గా నిర్వహించడానికి అవకాశం ఉంటుందని వృద్ధాశ్రమం నిర్వాహకుడు రాజశేఖర్ తెలిపారు. తను ఆటో తోలడం ద్వారా వచ్చే ఆదాయంలో కొంత వెచ్చిస్తున్నప్పటికీ నిర్వహణ కష్టంగా ఉందని పేర్కొన్నారు.

పిల్లలకూ ఆదరణ



తొలుత వృద్ధుల కోసమే ఆశ్రమాన్ని ఏర్పాటు చేయగా వయస్సు పైబడిన వృద్ధులు ఆశ్రమంలో ఉంటూ వారిలోవారే చిన్న విషయాలకు ఘర్షణ పడుతుండడం, సాయంత్రానికల్లా తిరిగి అందరూ కలిసి పిచ్చాపాటి మాట్లాడుకుంటుండడం రాజశేఖర్ గమనించారు. ఆశ్రమంలో చిన్నపిల్లలు కూడా ఉంటే వృద్ధులు వారిని చూసుకుంటూ సంతోష పడతారన్న భావనతో తల్లిదండ్రులు లేని చిన్నారులను చేరదీసి ఆశ్రమంలో ఉంచారు. దీంతో ఆ చిన్నారులు ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం వృద్ధులు చెప్పే కబుర్లతో, ఆటలతో ఆనందంగా గడుపుతున్నారని రాజశేఖర్ తెలిపారు.

గర్భిణులకు ఆటో సేవ

వృద్ధుల కోసం ఏకంగా అనాథాశ్రమాన్నే ఏర్పాటు చేసిన రాజశేఖర్ తన ఆటోలో ఆసుపత్రికి వెళ్లే గర్భిణులను ఉచితంగానే తీసుకు వెళుతుంటారు. రోడ్డుపై గర్భిణీ నడుచుకుంటూ వెళుతుంటే వెంటనే ఆపి ఆసుపత్రికి అయితే ఉచితంగానే చేర్చేవారు.

పలువురి తోడ్పాటు

పీఆర్‌కాలనీలో రవిచంద్రారెడ్డి అనే దాత తన షెడ్‌ను అద్దె లేకుండా మూడేళ్లపాటు ఉచితంగానే ఆశ్రమం కోసం ఇచ్చారు. కొన్ని రేకులు వేసి షెడ్‌ను పెంచుకుని అందులోనే తన భార్యాబిడ్డలతో జీవనం సాగిస్తూ అక్కడే అనాథాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్‌గా పనిచేసే రమణ వారానికి ఒక పర్యాయం ఆశ్రమానికి వచ్చి వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు ఉచితంగానే నిర్వహిస్తున్నారు. పక్కనే ప్రభుత్వ ఆసుపత్రి ఉండడంతో మందులకు ఇబ్బంది లేకుండా ఉన్నప్పటికీ ఆసుపత్రిలో పనిచేసే నర్సు మాధురి పిలిచిన వెంటనే వచ్చి వృద్ధులకు ఆరోగ్య సేవలు అందిస్తూ ఉంటుందని రాజశేఖర్ తెలిపారు.


ఆశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులు


రాజశేఖర్ సేవలకు వివిధ సంస్థలు ఇచ్చిన మెమెంటోలు



అన్నీ సమకూర్చారు...

ఈమె గిద్దలూరు పట్టణానికి చెందిన 80 ఏళ్ల రాములమ్మ. మూడేళ్లుగా అనాథాశ్రమంలోనే ఉంటున్నారు. భర్త చనిపోగా పిల్లలు లేకపోవడంతో తెలిసినవారు అనాథాశ్రమంలో చేర్చారు. ఆహారానికి ఎలాంటి ఇబ్బందీ లేదని, ఏ చిన్న అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే చూపిస్తారని, కాలం చక్కగా గడిచి పోతోందని రాములమ్మ పేర్కొన్నారు.

ఒకప్పుడు ఒక్కపూటే భోజనం దొరికేది..

ఈమె గిద్దలూరుకు చెందిన షేక్ హుస్సేనమ్మ భర్త చనిపోయారు. పిల్లలు పెళ్లి చేసుకుని ఉపాధి కోసం వలస వెళ్లారు. పని చేసుకునే శక్తిలేక 6 నెలలపాటు రోజుకు ఒకపూట మాత్రమే భోజనం చేస్తూ ఆకలి చంపుకునేది. తెలిసినవారు చెప్పగా మూడేళ్ల క్రితం ఈ ఆశ్రమానికి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు మూడు పూటలా తింటున్నానని, సొంత ఇంట్లో ఉన్నట్టే ఉందని హుస్సేనమ్మ కంటతడి పెడుతూ చెప్పారు.



తెల్లరాయి అక్రమ క్వారీయింగ్

- ప్రభుత్వ భూముల్లో అనధికారిక తవ్వకాలు
- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు

కురిచేడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కురిచేడు మండలం పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలోని 8వ సర్వే నంబరులో తెల్లరాయి అక్రమ క్వారీయింగ్ చేస్తున్నారు. పెద్దపెద్ద ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేపడుతున్నారు. ఈ విషయం బయటకు పొక్కడంతో రెవెన్యూ అధికారులు బుధవారం ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని పడమర వీరాయపాలెం గ్రామ సర్వేనంబరు 8లో 517 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో కొంత భాగాన్ని కొందరు ఆక్రమించుకుని సాగు చేస్తుండగా ఇటీవల తెల్లరాయి తీసేందుకు ఒక బృందం నడుం బిగించింది. నాలుగు రోజుల నుంచి తెల్లరాయినపి వెలికి తీస్తున్నారు. ఈ భూమిని ఆనుకుని అటవీ శాఖకు చెందిన కొండ ఉండటంతో అందులోనూ తెల్లరాయిని తీయడానికి ప్రయత్నాలు చేశారు. పెద్ద మొత్తంలో తెల్లరాయిని వెలికి తీసి ఉంచారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ కార్యాలయం ఆర్‌ఐ నాగరాజు పడమర వీరాయపాలెం వీఆర్వోతో కలిసి వెళ్లి క్వారీయింగ్‌ను అడ్డుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను లారీతో సహా స్వాధీనం చేసుకున్నారు. లారీని ఆపి యజమానులు వెళ్లిపోయారు. దీంతో లారీని, ఎక్సవేటర్‌తో సహా పోలీస్‌స్టేషన్‌కు అప్పగించలేకపోయారు. లారీ వద్ద గ్రామ తలారిని ఉంచనున్నట్లు ఆర్‌ఐ నాగరాజు తెలిపారు. అక్రమ మైనింగ్ ఆపేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.


కురిచేడులో అక్రమంగా క్వారీయింగ్ జరిగిన ప్రాంతమిదే..



ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

మహిళా సాధికారతకు కృషి చేయాలి

కలెక్టర్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాలు ఇతోధికంగా కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో బుధవారం స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ యాప్ నిర్వహణపై వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను స్వయంసహాయక సంఘాల సభ్యులు సద్వినియోగంచేసుకొని ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయాలన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని కోరారు. ప్రతి బాలిక కచ్చితంగా చదువుకునేలా సభ్యులు కృషి చేయడంతో పాటు సామాజిక మార్పుకు పాటుపడాలని సూచించారు. జిల్లాలో బంగారు బాల్యం కార్యక్రమం ద్వారా 18ఏళ్లలోపు వయసు గల పిల్లలు, బాలికలపై దృష్టి సారించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు ప్రత్యేక క్యాంపెయిన్‌లు చేపడుతున్నట్లు వివరించారు. ఇందులో ప్రతి సభ్యురాలు భాగస్వామ్యం కావాలని కోరారు. స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఒక కొత్త యాప్‌ను తెచ్చిందని, దీనిద్వారా సభ్యుల ఆర్థిక, సామాజిక పరమైన సమగ్ర డేటాను నమోదు చేస్తామని పేర్కొన్నారు. శిక్షణలో సభ్యులు ఆయా అంశాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని సమగ్ర డేటా నమోదుకు కృషి చేయాలన్నారు. ఈ యాప్ జనవరిలో అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ రవికుమార్, ఏవో వినీల్, టెక్నికల్ సిబ్బంది ఫణికుమారి, సంతోష్‌కుమార్, జయకుమార్, కల్పన పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అన్సారియా

ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ముందస్తు ప్రణాళికలు

జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులు రబీ సీజన్‌లో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు ప్రణాళికలను రూపొందించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం మార్కెటింగ్, పౌరసరఫరాలు, వ్యవసాయ, ట్రాన్స్‌పోర్టు, కోఆపరేటివ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. 2024-25 రబీ సీజన్‌లో వ్యవసాయశాఖ అంచనాల ప్రకారం 59,547 మెట్రిక్ టన్నుల ధాన్యం, 61,583 మెట్రిక్ టన్నుల కంది పంట ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు జిల్లాలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.


అంజయ్య రోడ్డులో కాలువ దాటి నిర్మాణం



కోర్టు సెంటర్‌లో కాలువ దాటి నిర్మాణం

అడ్డగోలుగా ఆక్రమణలు..!

- మురుగునీరు పారుదలకు ఆటంకం
- పట్టించుకోని టౌన్ ప్లానింగ్ విభాగం

ఒంగోలు, కార్పొరేషన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతుండగా, మరికొన్నిచోట్ల స్థానిక షాపు యజమానులే ఫుట్‌పాత్‌లను, సైడు కాలువ అమ్మకాలకు చిరువ్యాపారులకు అద్దెకు కేటాయిస్తూ వేలకు వేలు దండుకుంటున్నారు. కొంతరు అక్రమార్జనే ధ్యేయంగా కార్పొరేషన్ స్థలం కనిపిస్తే కబ్జాలకు పాల్పడుతున్నారు. ఫుట్‌పాత్‌లను సైతం వదలకుండా అడ్డగోలుగా ఆక్రమించినా, కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. కాసుల మత్తులో జోగాడుతున్న యంత్రాంగానికి ఆక్రమణల పర్వం ఆదాయ వనరుగా మారింది. దీంతో అనేక ప్రాంతాల్లో స్థలాలు, ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతానికి గురౌతున్నాయి. ఒంగోలులో వందల సంఖ్యలో ప్రభుత్వ రహదారులు, ఖాళీ స్థలాల్లో శాశ్వతంగా ఆక్రమణకు గురవుతున్నాయనడానికి ఈ దృశ్యాలే నిదర్శనం. వివిధ వ్యాపారాల నిమిత్తం మరెన్నో తాత్కాలిక ఆక్రమణలు ఉన్నాయి. తొలుత వ్యాపారం కోసం కొంతమేర జాగా ఏర్పాటు చేసుకోవడం, ఆ తర్వాతశాశ్వత కట్టడాలు నిర్మించడం పరిపాటిగా మారుతోంది. కార్పొరేషన్ కాంప్లెక్స్‌ల్లో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. షాపులు దక్కించుకున్నవారు వ్యాపారాలు చేయకుండా, వందల్లో కార్పొరేషన్‌కు చెల్లిస్తూ, వేలల్లో ఇతరుల నుంచి అద్దె వసూలు చేయడం గమనార్హం.


కర్నూలు రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణ


కొత్తకూరగాయాల మార్కెట్ సెంటర్‌లో రోడ్డుపై స్థలంలో వ్యాపారాలు


కొత్తపట్నం రోడ్డులో కాలువ దాటి నిర్మాణం


కర్నూలు రోడ్డులో మార్జిన్ ఆక్రమించి...

రోడ్ల పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

సంతనూతలపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మైనంపాడు గ్రామంలో రూ.25లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లకు బుధవారం టీడీపీ నాయకులు శంకుస్థాపన చేశారు. తమ గ్రామానికి సీసీ రోడ్లు మంజూరు చేయడంపై ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌కు గ్రామ నాయకులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల ఆంజనేయులు, మాదాల రాంబాబు, మన్నం వెంకట్రావు, మాదాల హనుమంతరావు, ఆళ్ల అవినాష్, ఉప్పలపాటి ప్రభాకర్, ఆకుల బ్రహ్మయ్య, టి.శ్రీను, ఎ.బ్రహ్మయ్య, పి.రాము, నాయబ్‌రసూల్, పి.శ్రీను, ఎ.నాగరాజు, కోటయ్య, ఖాజ, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

24న బౌద్ధ ధర్మ దీక్షా ఉత్సవం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

సంతనూతలపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు బస్టాండ్‌లో బుధవారం 68వ బౌద్ధ ధర్మ దీక్షా ఉత్సవ కరపత్రాన్ని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు వై.హరిబాబు, ఉపాధ్యక్షులు కేకే.బోధి ఆవిష్కరించారు. సెంట్రల్ కమిటీ మెంబర్ ఎడ్లూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత అంబేడ్కర్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించి అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈనెల 24న ఒంగోలులోని అంబేడ్కర్‌భవనంలో 68వ బౌద్ధ ధర్మ దీక్షా ఉత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎడ్లూరి మహేష్‌నాగ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మద్దిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య జిల్లా కోఆర్డినేటర్ కృష్ణప్రసాద్ తెలిపారు. బుధవారం బసవన్నపాలెం హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది విధుల పట్ల అలసత్వం వీడి ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సలహాలు ఇవ్వాల్సిన బాధ్యత డాక్టర్లపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌సీ.నాగరాజు, జి.జెస్సి, రోజ్‌పాల్, అఖిల, మాధురి, లత, ఏఎన్‌ఎం మాధవి, ఆశవర్కర్లు పద్మ, శిరీష పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న ఏవో పావని

సంతనూతలపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఏవో కోరారు. మండలంలోని ఎండ్లూరు, మైనంపాడు, గుర్వారెడ్డిపాలెం గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పొగాకు పంటలకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన శనగ, కంది, మినుము, పెసర, అలసంద, సజ్జ, మొక్కజొన్న, కొర్రపంటలను సాగు చేయాలని, తక్కువ పెట్టుబడితో అధికలాభం పొందవచ్చని తెలిపారు. పొగాకు మార్కెట్ ధరలు స్థిరంగా లేకపోవడం, సాగుఖర్చులు, అధిక కూలీల ధరలు, కౌలు ధరలు వల్ల రైతులు నష్టపోయే ప్రమాదముందన్నారు. అందువల్ల పొగాకు సాగు విస్తీర్ణం తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



మేఘనకు బహుమతిని అందిస్తున్న ఎంఈవో

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న శీలం మేఘన ఇటీవల రాష్ట్ర స్థాయిలో జరిగిన అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఎంఈవో టి.కిషోర్ విచ్చేసి ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయస్థాయిలో జరిగే పోటీల్లో మొదటి స్థానం సాధించేందుకు సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ లిల్లి, ప్రధానోపాధ్యాయురాలు జయషీల, కె.నక్షత్రం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉప విద్యాధికారి బాధ్యతల స్వీకరణ



చంద్రమౌళీశ్వరరావును సత్కరిస్తున్న హెచ్‌ఎంలు

ఒంగోలు విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు ఎంఈవో-1గా పనిచేస్తున్న ఎ.చంద్రమౌళీశ్వరరావు బుధవారం ఒంగోలులో ఉప విద్యాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు టీఎల్.కాంతారావు, వై.వెంకట్రావు, జీఎస్ఆర్.సాయి, రామచంద్రారెడ్డి, బీఏ.శ్రీనివాసరావు కలిసి అభినందనలు తెలిపారు. అలాగే ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎ.అమ్మయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆంజనేయులు, ఐఫియా కౌన్సిలర్ పీవీ.సుబ్బారావులు శుభాకాంక్షలు చెప్పారు.

పేస్‌లో అవగాహన సదస్సు



మాట్లాడుతున్న గోపీభాస్కర్

ఒంగోలు విద్య, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్నోవేషన్ ఆన్ డేటా ప్రాసెసింగ్ యూజింగ్ ఐటీఎల్ టూల్స్ అనే అంశంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నైలోని క్యాప్‌జెమిని సీనియర్ మేనేజర్ పి.గోపీభాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఐటీఎల్ టూల్స్ ఉపయోగాలు, వాటి వల్ల వచ్చే ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, సుబ్బారావు, వీరాంజనేయులు, రూప అక్కేష్, ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకునే వారేరీ..

కబాడీపాలెంలో వేధిస్తున్న సమస్యలు • పగిలిపోయిన సీసీరోడ్లు • పూడిపోయిన మురుగు కాలువలు • ఇబ్బందిపడుతున్న స్థానికులు



కాలువలో పేరుకున్న మురుగు



పగిలిపోయిన సీసీరోడ్డు



పూడిపోయిన మురుగు కాలువ

ఒంగోలు కార్పొరేషన్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరలోని 13వ డివిజన్‌లో కబాడీపాలెంలో సమస్యలు పలకరిస్తే పలుకుతున్నాయి. గత పదేళ్ళుగా అక్కడ అభివృద్ధి ఊసే కనిపించడం లేదు. ఎప్పుడో 2012లో వేసిన రోడ్లే నేటికి ఉండగా, 2014 తర్వాత కబాడీపాలెంలో కాలువలు నిర్మించారు. అయితే అవి కూడా పూర్తి స్థాయిలో కట్టకపోవడంతో అక్కడ మురుగు సమస్య వేధిస్తుండగా, దోమల సమస్య మరింత అధికంగా కనిపిస్తున్నది. మరోవైపు ఆ కాలనీలో వీధుల్లో ప్రయాణించాలంటే ఫీట్లు వేయాల్సిందే. గడిచిన పది సంవత్సరాలలో కొత్త రోడ్లు వేయకపోగా ఉన్న రోడ్లు పగిలిపోయి అధ్వానంగా మారాయి. కనీసం ప్యాచ్‌వర్క్‌లు కూడా వేయకపోవడంతో స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు పట్టించుకుని కనీస అభివృద్ధి పనులు చేపట్టాలని, అలాగే మురుగు కాలువల్లో చెత్తను తొలగించాలని, రోడ్లుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. మరోవైపు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అర్ధరాత్రి తాగునీటి సరఫరా విధానం లేకుండా పగటి వేళ సరఫరా చేయాలని ఆదేశించారు. అయితే నేటికీ ఆ కాలనీలో అర్ధరాత్రి 1గంటలకు తాగునీరు సరఫరా చేయడంతో అక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలి

• ఎమ్మెల్యే దామచర్ల



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

కొత్తపట్నం(ఒంగోలునగరం) నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఇచ్చిన వినతులపై తక్షణమే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపట్నంలోని నల్లూరిగార్డెన్స్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ ప్రజల అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు తమ భూములను ఆన్‌లైన్ చేసేలా చూడాలని కోరారు. పాదర్తి, కె.పల్లెపాలెం, కొత్తపట్నం తదితర గ్రామాల నుంచి రెవెన్యూ సంబంధిత సమస్యలపై అర్జీలు అందజేశారు. ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డీకే భూములను అధికారులు ఆన్‌లైన్ చేయటం లేదని తెలిపారు. ఆన్‌లైన్ రికార్డు లేకపోవటంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కె.పల్లెపాలెం మత్స్యకారులు తమ గ్రామానికి ఉత్తరం వైపున ఉన్న భూములను తాము పడవలు నిలుపుకునేందుకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ మధుసూదనరావు, ఒంగోలు టూ టౌన్ సీఐ శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షులు ద్వారబాకుల శ్రీనివాసరెడ్డి, జిల్లా నాయకురాలు నాళం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయంత్‌బాబు పుట్టినరోజు

• శుభాకాంక్షలు తెలిపిన శ్రేణులు



నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జయంత్‌బాబు

మద్దిపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా మల్లవరంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జయంత్‌బాబు తన కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని గోపూజ చేశారు. అనంతరం మద్దిపాడు సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో అభిమానులు, నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మండవ రంగారావు, జయంత్‌బాబుకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా మద్దిపాడు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, మండవ గోవిందరాజులు, క్లస్టర్ ఇన్‌చార్జి మండవ గోపీచంద్, దేవబత్తిన ప్రసాద్, రాష్ట్ర నాయకులు అడకా స్వాములు, నారిపెద్ది వరహాలచౌదరి, అబ్బూరి శేషగిరిరావు, మండవ లక్ష్మీనారాయణ, మారెళ్ల సురేంద్రబాబు, చింతల శ్రీనివాసరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయంత్‌బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రంకు రోడ్డుకు మరమ్మతులు

మంత్రి స్వామి ఆదేశాలతో గుంతలు పూడ్చివేత • హర్షం వ్యక్తంచేస్తున్న ప్రజలు



పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న గుంతలను పూడ్చుతున్న కార్మికులు

సింగరాయకొండ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండలోని ప్రధానమైన ట్రంకు రోడ్డుపై ఏర్పడిన గుంతల పూడ్చివేత పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఈ రహదారి దుస్థితిపై గత నెల 27న 'వామ్మో.. ట్రంకు రోడ్డు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. ఈనేపథ్యంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వారు బుధవారం నుంచి పనులు ప్రారంభించారు. గుంతల్లో కంకరపోసి తారుతో పూడ్చివేస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో పనులను పూర్తి చేసి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని అర్‌అండ్‌బీ ఏఈ దాసరి మాధవరావు తెలిపారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చదనంపై వేటు

• వందేళ్ల నాటి చెట్ల కొమ్మలు నరికివేత



తొలగించిన చెట్ల కొమ్మలు

ఒంగోలులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గల వందేళ్ల నాటి చెట్టు కొమ్మలను నరికివేశారు. కార్యాలయానికి వచ్చే సర్వీసు కరెంటు తీగలకు కొమ్మలు అడ్డుగా రావడంతో వాటిని తొలగించినట్లు బుధవారం స్థానిక అధికారులు తెలిపారు. అయితే కార్యాలయం ఎదుట ప్రజలకు ఎంతో నీడను ఇచ్చే వృక్షాలను నరికి వేయటం తగదని పలువురు అధికారుల తీరును విమర్శిస్తున్నారు. - ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

టంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దళిత రైట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ అధ్యక్షతన పోలీస్ శాఖలోని సీఐడీ విభాగం ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తహసీల్దార్ మాట్లాడుతూ 1989లో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు అమలులోకి వచ్చిందన్నారు. 2018లో ఈ చట్టంలో చిన్నచిన్న సవరణలు చేశారన్నారు. సీఐడీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు అట్రాసిటీ చట్టం గురించి వివరించారు. సీఐ హజరత్తయ్య మాట్లాడుతూ దళితులపై దాడులు, అత్యాచారాలు జరిగితే తప్పకుండా అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థులకు పరీక్ష పెట్టి అభినవబుద్ధకు ప్రథమ, గంగాధర్‌కు ద్వితీయ, లాస్యకు తృతీయ, బి.వి.కృష్ణ, బి.వెంటకృష్ణ, వైష్ణవిలకు కన్సొలేషన్ బహుమతులు లభించాయి. కార్యక్రమంలో ఏవో బ్రహ్మయ్య, ఎంఈవో బాలాజీ, ఎస్సై నాగమల్లేశ్వరరావు, దానయ్య, కేవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పంటల మార్పిడి అవసరం

కొండపి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఒకే పొలంలో ఏటా ఒకే రకమైన పంటను కాకుండా మార్పిడి చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.విజయ్‌కుమార్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పెదకండ్లగుంట, జాళ్లపాలెం గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను ఏవో విజయకుమార్, తన సిబ్బందితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా కంది పంటను పరిశీలించారు. పురుగు నివారణకు తొలిదశలో వేప గింజల కషాయం పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ మహేష్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న ఆంజనేయులు

కొండపి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం పోరాటం చేస్తున్నదని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పూనాటి ఆంజనేయులు అన్నారు. కొండపిలో బుధవారం నిర్వహించిన మండల మహాసభలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలకు వ్యతిరేకంగా ఈనెల 8నుంచి 14 వరకూ నిర్వహిస్తున్న పోరులో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముప్పరాజు చినబ్రహ్మయ్య, అంగలకుర్తి విశ్రాంతిల అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యుడు గంటెనపల్లి శ్రీనివాసులు, కంకణాల రమాదేవి, ఆపార్టీ మండల కార్యదర్శి కేజీ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరంలో జనసురక్ష ప్రచారం

సంతనూతలపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): రుద్రవరం గ్రామంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్ర కౌన్సిలర్లు బుధవారం జనసురక్ష ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంల మైనంపాడు కెనరాబ్యాంకు సిబ్బంది టి.నాగేంద్రబాబు తదతరులు పాల్గొన్నారు.

14నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



సభ్యత్వం అందజేస్తున్న ఆదిలక్ష్మి

ఒంగోలు(కల్చరల్), నవంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి కోరారు. బుధవారం ఒంగోలులోని హెచ్‌సీఎం పాఠశాలలో విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించారు. విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య తన సొంత నగదుతో 35మంది విద్యార్థులకు సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, సెలవు రోజుల్లో వచ్చి వివిధ రకాల పుస్తకాలను చదవటం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చన్నారు. పేరయ్య మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి పుస్తక పఠనం అలవాటు చేసుకున్నానని, ప్రభుత్వ ఉద్యోగం పొందటంలో అది ఎంతో ఉపయోగపడిందని చెప్పారు. ప్రతి విద్యార్థి పుస్తకాలను చదివే అలవాటుచేసుకోవాలని ఆయన కోరారు. లైబ్రేరియన్ కాళహస్తి సంపూర్ణ మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆచార్య రంగా జయంతి వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆచార్య రంగా కిసాన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం పదిన్నర గంటలకు స్థానిక రంగా భవన్‌లో ఆచార్య రంగా 124వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ప్రధానకార్యదర్శి చుంచు శేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9.15 గంటలకు స్థానిక వ్యవసాయమార్కెట్ కమిటీ ఎదురుగా ఉన్న రంగా కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం రంగాభవన్‌లో జరిగే వేడుకల్లో విద్యుత్‌శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్.విజయకుమార్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం ముఖ్యఅతిథిలుగా హాజరవుతారని పేర్కొన్నారు. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని సత్కరిస్తామన్నారు. రైతులు, రైతు సంఘాల నాయకులు, రంగా అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్రీడాకారులకు డీఈవో అభినందన

ఒంగోలు విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ హాకీ పోటీలకు ఎంపికైన మైనంపాడు విద్యార్థులను డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 3నుంచి మూడు రోజుల పాటు నెల్లూరు జిల్లాలో జరిగిన అండర్-17 రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహించిన మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు టి.శృతి, కె.చరణ్‌కుమార్‌లు ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక డీఈవో కార్యాలయంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారావు పాల్గొన్నారు.

అపహరణకు గురైన ట్రాక్టర్ గుర్తింపు

కామేపల్లి (జరుగుమల్లి), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామేపల్లి గ్రామంలో అపహరణకు గురైన ట్రాక్టర్‌ను పోలీసులు గుర్తించారు. దొంగలు దాన్ని బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో వదిలేసి వెళ్లారు. ఈమేరకు అక్కడి పోలీసుల నుంచి జరుగుమల్లి స్టేషన్‌కు సమాచారం అందింది. తనిఖీల కారణంగా దొంగలు అక్కడ వదిలి వెళ్లారా? మరేమైన ఇతర కారణాలు ఉన్నాయా? అన్నది అక్కడి పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొండపి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని మద్దులూరు రోడ్డులో మద్యం అక్రమంగా విక్రయిస్తున్న చలువాది కోటేశ్వరరావును పోలీసులు మంగళవారం రాత్రి అరెస్టు చేశారు. అతని వద్ద 15 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.

వెల్లటూరులో.. పొన్నలూరు మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన బక్కముంతల యానాది వద్ద అక్రమంగా ఉన్న ఎనిమిది మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్సై అనూక్ తెలిపారు.

8 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు విద్య, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న 38 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి సంబంధించి ప్రాథమిక మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు డీఈవో కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 8వతేదీ వరకు తెలపవచ్చని ఆయన పేర్కొన్నారు.

30న ఇంటర్వ్యూలు

ఒంగోలు విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వివిధ ఆర్టీసీ డిపోల్లో అప్రంటీస్ శిక్షణకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 13న ఇంటర్వ్యూలు జరుగుతాయని ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అభ్యర్థులకు నెల్లూరు జిల్లా కాకుటూరలోని ఆర్టీసీ జోన్‌లో సిబ్బంది శిక్షణ కళాశాలలో నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని , పూర్తి వివరాల కోసం 9203165456 సెల్‌నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నేతాజీ విద్యార్థికి జాతీయ అవార్డు

ఒంగోలు విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం రైలుపేటలోని నేతాజీ హైస్కూలులో పదో తరగతి చదువుతున్న టి.ఆకాంక్ష కూచిపూడి నృత్యంలో జాతీయ అవార్డు సాధించారు. హైదరాబాద్‌లో శ్రీలంబోధర కల్చరల్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతిని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక స్కూలులో ఆకాంక్షను కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ప్రిన్సిపాల్ అనుపమ, ఉపాధ్యాయులు అభినందించారు.

హెచ్‌ఎంకు సంతాపం

ఒంగోలు విద్య, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణలో ఒత్తిడికి తట్టుకోలేక ప్రాణాలు కోల్పోయిన హెచ్‌ఎంకు జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు బుధవారం ఓ ప్రకటనలో తమ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. శిక్షణ కార్యక్రమాలు ప్రధానోపాధ్యాయులకు జిల్లా స్థాయిలోనే నాన్‌రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాంతారావు, వై.వెంకట్రావు, కోశాధికారి జీఎస్ఆర్.సాయి కోరారు.

రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు



ఉత్సవ విగ్రహాల వద్ద పూజలు చేస్తున్న దామచర్ల పూర్ణచంద్రరావు

కొండపి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొండపిలోని శ్రీగంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయానికి రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పంచలోహ గణపతి ఉత్సవ విగ్రహాన్ని అందజేశారు. కొండపికి చెందిన నేతి రవికుమార్, పమిడిపాటి ప్రదీప్‌లు పంచలోహ అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను కానుకగా ఇచ్చారు. బుధవారం ఈ విగ్రహాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్య చౌదరి, దామా మురళి, బూదవాటి సోమయ్య దాతలు, అయ్యప్ప, శివ దీక్షదారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

3వేల రేషన్‌బియ్యం బస్తాలు సీజ్

ఎస్ఎన్‌పాడు రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన మాఫియా

పట్టుకున్న ఆర్డీవో, తహసీల్దార్



మిల్లులో ఉన్న రేషన్‌బియ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సంతనూతలపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని మద్దులూరు రోడ్డులో ఉన్న నాగరాజ ట్రేడర్స్ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 3వేల రేషన్ బియ్యం బస్తాలను ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ఆదిలక్ష్మి బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. రేషన్‌బియ్యం అక్రమంగా ఉంచారన్నా సమాచారంతో వారు తమ సిబ్బందితో రైస్‌మిల్లుపై దాడి చేశారు. అక్కడ బయట వాహనాల్లో లోడ్ చేసి ఉన్న రేషన్ బియ్యం బస్తాలను, అలాగే లోపల పెద్ద కుప్పలుగా పోసిన బియ్యాన్ని అధికారులు చూసి విస్తుపోయారు. వెంటనే జిల్లా సివిల్ సప్లయీస్ అధికారి పద్మశ్రీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. సీజ్ చేసిన రేషన్ బియ్యం బస్తాలను వారికి అప్పగించారు. వాటిని ఇక్కడ నుంచి తరలించేందుకు చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో తెలిపారు. నిందితులపై పూర్తి విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రఫి

ఫలించిన మున్సిపల్ కార్మికుల పోరాటం

విధులలోకి చేరనున్న కార్మికులు

మార్కాపురం వన్‌టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయం ఎదుట 22 రోజులుగా కార్మికులు చేస్తున్న దీక్షలు, పోరాటాలు బుధవారం ముగిశాయి. తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ వివిధ రూపాల్లో ఆందోళన చేశారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం గేటు వేసి ఆందోళన, కమిషనర్ చాంబర్ ముట్టడి, కౌన్సిల్ సమావేశం వద్ద బైఠాయించటంతో పాటు వివిధ రూపాల్లో కార్మికులు దీక్షలు చేశారు. కార్మికుల పోరాటాలతో దిగొచ్చిన ప్రభుత్వం తొలగించిన కార్మికులను 2 రోజుల్లో విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇవ్వటంతో దీక్షలు విరమించామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, డీకేఎం రఫీలు తెలిపారు.



కార్యాలయ ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాల సామాజికవర్గ నాయకులు

శ్మశానాన్ని కాపాడాలని వినతి

మార్కాపురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వంద సంవత్సరాల క్రితం మాలలకు కేటాయించిన శ్మశాన స్థలాన్ని కాపాడాలని మాల సామాజికవర్గ నాయకులు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏవో రవీంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ఏ ప్రభుత్వం మారినా స్థానిక పెద్దనాగులవరం రోడ్డులోని 12 ఎకరాల మాలల శ్మశాన భూములపై కబ్జాదారులు కన్నేస్తున్నారని తెలిపారు. గతంలో వైసీపీ నాయకులు ఇదే విధంగా శ్మశాన స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించారన్నారు. మాలలు పోరాడటంతో వెనుదిరిగారన్నారు. మళ్లీ ప్రస్తుతం కొందరు ఆస్థలంపై కన్నేసినందున కాపాడేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల సామాజికవర్గ నాయకులు నూతలపాటి రాజు, చెన్నయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎం సుందరావు

పంచారామాలకు బస్సులు

పొదిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం సందర్భంగా పొదిలి ఆర్టీసీ డిపో నుంచి ప్రతి ఆదివారం పంచారామాలకు బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం అందుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అమరారామం, సోమారామం, క్షీరారామం, ద్రాక్షారామం, కుమారరామంతో పాటు శబరిమల అయ్యప్పస్వామి సన్నిధికి కూడా బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కనుక ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

మార్కాపురం ఎమ్మెల్యే కందుల

పొదిలి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కంభాలపాడు గ్రామంలో బుధవారం విద్యుదీకరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యుత్ సమస్యలు లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా విద్యుత్ స్తంభాలు పాతవాటికి మరమ్మతులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆక్రమంలోనే కంభాలపాడు గ్రామంలో నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసేందుకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామాల అభివృద్ధి కూడా కూటమి పాలనలో శరవేగంగా జరుగుతుందన్నారు. ప్రభుత్వం వచ్చిన కొద్దిరోజుల్లోనే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నట్లు చెప్పారు. మండల నాయకులు గ్రామాల్లో అభివృద్ధి, పారిశుధ్యం, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి, పొదిలి, కొనకనమిట్ల మండల టీడీపీ మండలాధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, మోరబోయిన బాబురావు, మాజీ సర్పంచ్ కాటూరి చినబాబు, ఆవులూరి యలమంద, తదితరులు పాల్గొన్నారు.



కంభాలపాడులో విద్యుద్దీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందుల

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

కొనకనమిట్ల : రైతుల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యంగా పనిచేస్తున్నదని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో బుధవారం ఆర్‌డీఎస్ఎస్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ఎజెండా అని అందుకే గ్రామాల్లో ఆర్‌డీఎస్ఎస్ ద్వారా నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా రైతుల పొలాలకు, గ్రామాల్లో ఎటువంటి విద్యుత్‌కు అంతరాయం లేకుండా సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నట్లు సూచించారు. ప్రతి గ్రామం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనికోసం నిరంతరం కష్టపడి పనిచేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో విద్యుత్ అధికారులు, పలువురు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చౌటపల్లి గ్రామంలో శంకుస్థాపన చేస్తున్న కందుల నారాయణరెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మార్కాపురం వన్‌టౌన్ : శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. స్థానిక ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి 4 రాజగోపురాల నిర్మాణం, ఉపాలయాల నిర్మాణ పనుల గురించి ఎమ్మెల్యేకి వివరించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తి కావాలన్నారు.

ఎంబీబీఎస్‌లో దోర్నాల విద్యార్థులకు సీట్లు



నాగ ప్రణయ



జయంత్

పెద్దదోర్నాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):నీట్‌లో తమ ప్రతిభ కనబర్చిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్‌కు ఎంపికయ్యారు.మండలంలోని కడపరాజుపల్లె గ్రామానికి చెందిన పసుమర్తి జయంత్ నీట్‌లో 565 మార్కులు సాధించాడు. ఆ విద్యార్థికి గుంటూరు కాటూరి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు లభించింది. గంటవానిపల్లె గ్రామానికి చెందిన పార్శవు నాగ ప్రణయ నీట్‌లో 605 మార్కులు సాధించి విజయనగరం మహారాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు దక్కించుకుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు వారిని అభినందించారు.



ఎర్రగొండపాలెంలో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎర్రగొండపాలెం సర్పంచ్ ఆర్. అరుణాబాయి అన్నారు. బుధవారం ఎర్రగొండపాలెం పట్టణంలో పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ప్రధాన రోడ్డులోని మురుగు ప్రదేశాల్లో దోమల మందులను పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వద్దు.. ప్రత్యామ్నాయ పంటలే ముద్దు

వ్యవసాయాధికారి విజయభాస్కర్

గిద్దలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొగాకు బదులుగా ప్రత్యామ్నాయంగా అపరాలు, కూరగాయలు, పండ్లతోటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.విజయభాస్కర్ రెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని ముండ్లపాడు రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పొగాకు ఎక్కువగా సాగు చేయడం వలన ఆహార పంటల ఉత్పత్తి తగ్గిపోతున్నదని, అందువలన ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వాడడం వలన ఖర్చు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. ఉద్యాన శాఖాధికారిణి విష్ణుప్రియ మాట్లాడుతూ బిందు, తుంపర సేద్యం నీటి ఎద్దడి ఉన్నపుడు బాగా ఉపయోగ పడుతుందని, 90శాతం రాయితీపై బిందు సేద్య పరికరాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. గ్రామసభ అనంతరం కంది, పత్తి పంటలను అధికారులు పరిశీలించి చీడపీడలు, నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ శేషగిరి, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, గ్రామరెవెన్యూ అధికారి వెంకటరామయ్య, ఉద్యాన, వ్యవసాయ, వెటర్నరీ సహాయకులు కిరణ్మయి, రవిచంద్రుడు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

కంభం : రైతులు పొగాకు పంటకు బదులుగా కంది, మినుము, పెసర, శనగ వంటి అపరాల పంటలను చేసుకోవాలని కంభం మండల వ్యవసాయాధికారిణి స్వరూప తెలిపారు. బుధవారం మండలంలోని మదారుపల్లి, నర్సిరెడ్డిపల్లి గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో రైతులతో ఆమె మాట్లాడారు. శనగపంట వేసిన ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ యోజన బీమా పథకం ద్వారా ఇన్సూరెన్స్ కట్టుకోవాలని తెలిపారు.



ప్రసంగిస్తున్న వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి

నాణ్యమైన పొగనారును ఎంచుకోండి

పొదిలి : పొగాకు రైతులు నాట్లు వేసేటప్పుడు నాణ్యమైన నారును ఎంచుకోవాలని ఐటీసీ, జీపీఐ డెవలప్‌మెంట్ మేనేజర్లు జి. వెంకటేశ్వర్లు, సమీరుద్దీన్ తెలిపారు. బుధవారం మండలంలోని సలకనూతల గ్రామంలో వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పొగ నాట్లు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో హడావుడిగా నాణ్యత లేని నారును ఎంచుకోవద్దని సూచించారు. ఆరోగ్యవంతమైన నారును మాత్రమే నాటుగా వేయాలన్నారు. నారుమడిలో వైరస్ ఉన్నట్లు గుర్తిస్తే విచక్షణారహితంగా మందులు వాడకూడదన్నారు. చీడపీడల ఉధృతి దాటినప్పుడు అధికారుల సూచనల మేరకు మాత్రమే వాడాలన్నారు. రైతులు పైవిషయాలను దృష్టిలో ఉంచుకొని పొగాకుసాగు చేయాలన్నారు. పరిమితికి మించి పొగాకు సాగు చేయరాదని రైతులకు సూచించారు.



సలకనూతల గ్రామంలో పొగనారు మడులను పరిశీలిస్తున్న అధికారులు

మిరపలో ఎండు తెగులును నివారించుకోవాలి

● ఏవో జవహర్ లాల్ నాయక్

పెద్దదోర్నాల, నవంబరు 6(ఆంధ్రజ్యోతి):మిరపలో ఎండు తెగులును నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి, చిలకచెర్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఏవో ఆయా గ్రామాల్లో సాగు చేసిన మిరప పంటను పరిశీలించారు. ఎండుతెగులు ఆశించినట్లుగా గుర్తించామన్నారు. నివారణకు కెప్టాన్ లేదా హెక్సాకొనజోల్ 2గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. విత్తన మొక్క జొన్న సాగు చేసేవారు సంబంధిత కంపెనీ వారితో అగ్రిమెంటు చేసుకోవాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద రబీలో సాగు చేసిన పంటలకు బీమా చేసుకోవాలని సూచించారు. ఏఈవో చైతన్య కుమార్, వీఎస్ఏ హైమ్రక్‌బాబు పాల్గొన్నారు.



చింతగుంట్ల గ్రామంలో మిర్చిని పరిశీలిస్తున్న అధికారులు

మిరపలో సస్యరక్షణకు సూచనలు

మార్కాపురం రూరల్ : మండలంలోని రాయవరం, చింతగుంట్ల గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు సాగుచేస్తున్న మిరపలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం మండల ఉద్యాన శాఖ అధికారి రమేష్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన మిరపకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా ఎకరాకు 525 రూపాయలు చెల్లించి పంటకు బీమా పొందవచ్చని తెలిపారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న రాయితీ, తదితర పథకాల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రాయవరం, చింతగుంట్ల రైతు సేవా కేంద్రాల సిబ్బంది చింత వెంకటేశ్వర్లు, దుగ్గెంపూడి వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

వరిలో దిగుబడులపై రైతులకు అవగాహన

త్రిపురాంతకం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వరి సాగులో అధిక దిగుబడులు సాధించడంలో అనుసరించాల్సిన మెలకువలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా కార్యక్రమం పొలం పిలుస్తోందిని మేడపిలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో నీరజ మాట్లాడుతూ వరికి ఆకుచుట్టు పురుగు ఆశిస్తోందని, దాని నివారణకు పొలంలో నీరు తీసి, చేనుకు అడ్డంగా తాడును 2-3 సార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయన్నారు. 5 శాతం వేప గింజల కషాయం లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. అనంతరం రబీలో ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజనపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అగ్గి తెగులును నివారించుకోవాలి

పుల్లలచెరువు :ప్రస్తుతం సాగులో వున్న వరికి అగ్గి తెగులు సోకిందని, దానిని రైతులు నివారించుకోవాలని పుల్లలచెరువు మండల వ్యసాయయశాఖ అధికారి పి. నిర్మలా దేవి అన్నారు.బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని మానేపల్లిలో సాగులో ఉన్న వరిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అగ్గి తెగులు వలన దిగుబడి తగ్గుతుందని దాని నివారణకు ముందుగా ట్రైక్లోజోల్ 0.6 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీపీఏ శ్రీనివాస్, కొండా నాయక్‌రైతులు పాలొన్నారు.



మానేపల్లిలో వరిని పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి నిర్మలా దేవి

చిరు ధాన్యాల సాగును ప్రోత్సహించాలి

బేస్తవారపేట,నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతులు చిరు ధాన్యాల సాగుపై శ్రద్ధ చూపాలని గిద్దలూరు వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం బేస్తవారపేట మండలంలోని సింగసానిపల్లె గ్రామంలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయాధికారి జక్కం మెర్సీ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న బాలాజీ నాయక్ మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగు కోసం క్లస్టర్‌లో భాగంగా వేగవతి రకం రాగులు 50శాతం సబ్సీడీపై పంపిణీ చేస్తున్నామన్నారు.ఈ రకం అగ్గి తెగులు తట్టుకొని అధిక దిగుబడులు వస్తాయన్నారు.ఈకార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

గిద్దలూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సున్నీ అంజుమాన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ చైర్మన్‌గా దూదేకుల హజరత్, గౌరవ సలహాదారులుగా షేక్ జలీల్‌బాషా, సలహాదారులుగా కె.పెద్దఖాశిం, నియోజకవర్గ అధ్యక్షులుగా షేక్ నాయబ్‌రసూల్, పట్టణ కమిటీ అధ్యక్షులుగా దూదేకుల నాయబ్‌ఖాజా, ఉపాధ్యక్షులుగా షేక్ అహమ్మద్‌బాషా, కార్యదర్శిగా సయ్యద్ ఖాశింవలి, ఉప కార్యదర్శిగా షేక్ రియాజ్, కోశాధికారిగా పఠాన్ ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనారిటీలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చైర్మన్‌గా ఎన్నికైన దూదేకుల హజరత్ ఈసందర్భంగా పేర్కొన్నారు.

క్రైం సమాచారం

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



పొదిలి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పట్టణంలోని చెరువులో మహిళ దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాప్టిస్ట్‌పాలెంకు చెందిన సుశీల(45) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈమె భర్త ఇటీవల మృతి చెందాడు. ఒక అబ్బాయి, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇటీవల కాలంలో సుశీల వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు గంజి మీదపడి శరీరం కాలింది. అయితే వైద్యం చేయించుకున్నప్పటికి గాయాలు మానకపోవడంతో బాధపడుతూ ఉండేది. అయితే ఇద్దరు ఆడపిల్లకు పెళ్లిల్లు కావడంతో అత్తవారింట వద్ద ఉన్నారు. కుమారుడు బేల్దారి పనిచేస్తూ అందుబాటులో లేకపోవడం, అనారోగ్యంతో మానసికంగా కుంగిపోయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని స్థానికులు తెలిపారు. అదే సమయంలో చెరువులో ఆటోను శుభ్రం చేసుకుంటున్న వ్యక్తి చూసి స్థానికులకు తెలిపారు. వెంటనే 100 డయల్ చేసి సమాచారం అందించగానే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఈతగాళ్లతో సుశీల మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రెండు సెల్ ఫోన్ దుకాణాల్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

త్రిపురాంతకం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడపిలో రెండు సెల్‌ఫోన్ దుకాణాల్లో మంగళవారం రాత్రి దుండగులు చోరీ చేశారు. మేడపి మెట్టలో ఉన్న రెండు దుకాణాల్లో జరిగిన దొంగతనంలో కొన్ని ఇయర్ ఫోన్లు, విడి పరికరాలు చోరీకి గురయ్యాయి. పక్కనే ఉన్న మరో ఇంట్లో చోరీకి ప్రయత్నం జరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై శివబసవరాజు దుకాణాలను పరిశీలించి, క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చీతురేలు కత్వలో దూకి ఆత్మహత్య



మృతి చెందిన కాకర్ల వీరయ్య

బేస్తవారపేట,నవంబరు6(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట మండలంలోని చింతలపాలెం సమీపంలోని చీతురేలు కత్వలో బుధవారం సాయంత్రం ఒక వ్యక్తి మృతదేహం లభ్యం అయ్యింది. దీనిపై పోలీసులు విచారించగా మృతి చెందిన వ్యక్తి కంభం మండలం పోరుమామిళ్ల గ్రామానికి చెందిన కాకర్ల వీరయ్య(38)గా గుర్తించారు. బజాజ్ ఫైనాన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు.మృతునికి భార్య విజయలక్ష్మి,ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అక్రమ మద్యం పట్టివేత

బేస్తవారపేట,నవంబరు6(ఆంధ్రజ్యోతి): బేస్తవారపేట ఆర్‌కె.నగర్ జంక్షన్‌లో 23 మద్యం బాటిళ్లు, గలిజేరుగుళ్లలో 34 మద్యం బాటిళ్లు అక్రమంగా నిల్వఉంచడంతో ఎస్సై రవీంద్రారెడ్డి దాడులు చేసి వాటిని స్వాధీనం చేసుకొన్నారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం, అక్రమంగా మద్యం నిల్వ చేయడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ముఖాముఖి

త్వరలో భూ సమస్యలకు

పరిష్కారం

ఎం శ్రావణ్‌కుమార్, తహసీల్దార్, దర్శి



ప్రశ్న : ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

జవాబు : ప్రభుత్వ భూములు, స్థలాల ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తాం. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలకు గురికాకుండా రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తాం

ప్ర : అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు.

జ : దర్శి పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరిగినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. అధికారులతో సమన్వయం చేసుకొని అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం. అందుకోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.

ప్ర : 22ఏ జాబితాలో చేరిన భూముల సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారు?

జ : హక్కు ఉన్న భూములు 22ఏ జాబితాలో ఎలా చేరాయో తెలియదు. వాటిపై ఫైల్ తయారు చేశాం. కలెక్టర్ ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తారు.

ప్ర : జీరో ఖాతాలో ఎన్ని వేల ఎకరాలు చేరాయి?

జ : మండలంలో 4 వేల మంది రైతులకు చెందిన సుమారు 8 వేల ఎకరాల భూములు జీరో ఖాతాలో చేరాయి.

ప్ర : ఆ భూములను ఎప్పుడు క్రమబద్ధీకరిస్తారు?

జ : జీరో ఖాతాలో చేరిన భూములకు సంబంధించి రుణాలు తీసుకునేందుకు, విక్రయించుకునే అవకాశం లేదు. ఎప్పట్నుంచో ఉన్న ఈ సమస్యను పరిష్కరించేందుకు నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాం. త్వరలో ఆ సమస్య పరిష్కారమవుతుంది.

70 ఏళ్లనాటి చప్టా శిథిలం



రక్షణ దిమ్మెలు కూలిపోయి ప్రమాదభరితంగా మారిన చప్టా

దర్శి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): దర్శి-పొదిలిరోడ్డులోని కాటేరువాగుపై నిర్మించిన చప్టాకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు కూలి ప్రమాదభరితంగా మారింది. సుమారు 70 ఏళ్ల క్రితం ఈ చప్టాను నిర్మించారు. ప్రస్తుతం చప్టా శ్లాబు కూడా నెర్రలిచ్చి దెబ్బతింది. అసలే కాటేరు వాగు కుంచించుకుపోయింది. దానికి తోడు చప్టా వద్ద కూడా పూడిక పెరిగి నీటి పారుదలకు ఇబ్బందిగా మారింది. వాగు ఉధృతంగా ప్రవహించిన సమయాల్లో వరద రోడ్డుపైనా చేరుతుంటుంది. ఆ సమయంలో చప్టా శ్లాబు సరిగా లేకపోవడం, ప్రమాద హెచ్చరికలు తెలిపే రక్షణ గోడలు లేకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా కాటేరు వాగుపై పెద్ద బ్రిడ్జి నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నప్పటికీ కార్యరూపం దాల్చలేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలకులు రోడ్లు, చప్టాలు, వంతెనల అభివృద్ధి గురించి పట్టించుకోకపోవటంతో మరింత అధ్వానంగా మారాయి. ఇటీవల కూటమి ప్రభుత్వం వీటి మరమ్మతులకు నిధుల విడుదల చేసింది. ఇప్పుడైనా ఈ చప్టా మరమ్మతులకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్‌ను శుభ్రపరిచారు...

చెత్త తరలింపు మరిచారు



పోలీస్ స్టేషన్ వెనక వైపు ఉన్న చెత్తాచెదారం

తాళ్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌ను శుభ్రం చేస్తూ చెత్తాచెదారాన్ని స్టేషన్‌కు వెనుక వేసి 10 రోజులు కావస్తున్నా తొలగించలేదు. అటుగా పలు కార్యాలయాలకు వెళుతున్న ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులుపడుతున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు కొంతకాలంగా మరమ్మతులు చేస్తున్నారు. స్టేషన్ పరిసరాల చుట్టూ ఉన్న చెట్లను తొలగించి పరిసరాల్లోనే వేశారు. పోలీస్ స్టేషన్‌వెనుక వైపు తహసీల్దార్, వ్యవసాయ కార్యాలయాలున్నాయి. నిత్యం ఆ కార్యాలయాలకు ప్రజలు వివిధ పనుల మీద వస్తుంటారు. అధికారులు గ్రామాల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలని చెప్పే అధికారులు.. కార్యాలయాల వద్ద చెత్తా, చెదారం తొలగించకపోవటంపై పెదవి విరుస్తున్నారు.

దేవుని ఆస్తుల రక్షణకు అందరి సహకారం అవసరం

పామూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : దేవస్థాన ఆస్తుల పరిరక్షణకు ప్రజలు సహకారం అందించి చేయూత ఇవ్వాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. పామూరు నడిబొడ్డున ఉన్న శ్రీవల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన 11 సెంట్ల స్థలంలో నిర్మించిన దుకాణాలకు సక్రమంగా అద్దెలు చెల్లించకుండా ఇబ్బందులు పె డుతుండటంతో గత నెల 24న ఎండోమెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఆ షాపులను సీజ్ చేశారు. పామూరు టీడీపీ నాయకులతో కలిసి కనిగిరిలోని అమరావతి గ్రౌండ్‌లో బుధవారం ఎమ్మెల్యే ఉగ్రను వారు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ షాపులు లీజుకు ఇచ్చేందుకు అధికారులు



ఎమ్మెల్యే ఉగ్రను కలిసిన పామూరు దుకాణదారులు

ప్రకటన ఇచ్చి వాయిదా వేసిన విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వ్యాపారులు అడుగుకు రూ.60 చెల్లించేందుకు అంగీకరించారు. రెండేళ్లకు 10 శాతం అద్దె పెంచి నెలనెల బాడుగలు దేవస్థానానికి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఉగ్రను కలిసిన వారిలో పామూరు టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, షేక్ ఖాజార హంతుల్లా, యారవ శ్రీనివాసులు, వాసవీ మాత దేవస్థాన గౌరవ అధ్యక్షుడు వీ సత్యనారాయణ, పందిటి హరీష్, మెంటా నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ దళిత సమాజానికి అంగీకార యోగ్యం కాదు

వర్గీకరణ దళిత సమాజానికి ఏ మాత్రం అంగీకార యోగ్యం కాదని దళిత సంఘాల జేఏసీ నేతలు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డికి విన్నవించారు. స్థానిక అమరావతి ప్రాంగణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జేఏసీ నేతలు కలిశారు. ఈ కార్యక్రమంలో జేఏసి నేతలు మురహరి నరసయ్య, బాలనారాయణ, బాలబాదుల, రమణ, శ్రీనివాసులు, స్వర్ణ, శాంతరాజు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయటం ఆనందదాయకం



డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం విడుదల చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తీసుకోవటం ఆనందదాయకమని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో మంత్రి మండలి తీసుకున్న నిర్ణయం వలన లక్షలాది మంది కాంట్రాక్టర్లు, పనులు చేసిన నిర్వాహకులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. 2014 నుం చి 2019 వరకు చేసిన పనుల పెండింగ్ బిల్లులను వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత వైఖరితో నిలిపి వేసిందని తెలిపారు. కాంట్రాక్టర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో బిల్లులను నిలిపివేయటంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని వివరించారు. నీరు-చెట్టు కింద చేసిన పనుల బిల్లులకూ మోక్షం కలిగిందని తెలిపారు.

వైభవంగా నాగమయ్య తిరునాళ్ల



ప్రత్యేక పూజలు చేస్తున్న డాక్టర్ లలిత్‌సాగర్

దొనకొండ, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దన్నపాలెం చెరువుకట్ట మీద, బాదాపురం ఏటురాళ్ల గుట్టమీద, పెద్దన్నపాలెం బీటులోని అనంత పోలేరమ్మ దేవాలయంలో వెలసిన నాగమయ్య స్వామి దేవాలయాల్లో తిరునాళ్ల వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మూడు ప్రాంతాల్లో ఉదయం నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయాలను సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, నాయకులు వీరపనేని వెంకన్నచౌదరి, కామేపల్లి చెంచయ్య, శృంగారపు నాగసుబ్బారెడ్డి, కొమ్మతోటి సుబ్బారావు, సింగమనేని హనుమంతు, కుందుర్తి లక్ష్మణ్, దుగ్గింపూడి చెంచయ్య, యరగొర్ల బసవయ్య, పెమ్మసాని లక్ష్మీనారాయణ, విప్పర్ల లక్ష్మీరావు, పోతిపోగు చెన్నయ్య పాల్గొన్నారు.

జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలి

ముండ్లమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఏపీవో కే నాగరాజు చెప్పారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం జరిగింది.

ఎంపీడీవోగా రంగసుబ్బరాయుడు బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన రంగసుబ్బరాయుడు

సీఎస్‌పురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం మండల పరిషత్ ఎఫ్ఏసీ అభివృద్ధి అధికారిగా మంచికంటి రంగసుబ్బరాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హెచ్‌ఎంపాడు నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు. కార్యాలయ ఏవో ఖాదర్‌బి నుంచి రంగాసుబ్బరాయుడు బాధ్యతలు స్వీకరించారు.

చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

సీఎస్‌పురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బాలికలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సుమన్ చెప్పారు. స్థానిక కేజీబీవీ పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మా పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

పామూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యవసరాల వస్తువుల ధరల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని, వాటిని అదుపు చేయకపోతే ఆందోళన చేపడతామని సీపీఎం మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి హెచ్చరించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం గౌస్‌బాష అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. అల్లభక్ష్, ఎం రామయ్య, ఎస్‌కే ఖాదర్ బాష, కే శంకర్, వై వీర నారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామసభలతో భూసమస్యలకు పరిష్కారం

పామూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ గ్రామసభలతో భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఎంపీడీవో సురేష్ చెప్పారు. మండలంలోని కంభాలదిన్నె గ్రామంలో రెవెన్యూ గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ గ్రామ సభ లో మొత్తం 51 దరఖాస్తులు వ చ్చాయి. ఈ కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, కార్యదర్శి రాంప్రసాద్, టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, మన్నం రమణయ్య, గోళ్ల కొండయ్య నాయుడు గోళ్ల వీరబాబు, ఏలూరి నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడుసుమల్లి

ముద్దపాడులో...

పీసీపల్లి,నవంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముద్దపాడులో జరిగిన గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీ, వీఆర్వో బి.సుబ్బారావు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారు చేయాలి

పామూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా తయారుచేసి వడ్డించాలని ఎంపీడీవో సురేష్ చెప్పారు. మండలంలోని కంభాలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీవో బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల హాజరు పట్టిక రికార్డులను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కరుణకుమారి, ఇన్‌చార్జి హెచ్‌ఎం లక్ష్మీరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మన్నం రమణయ్య, మాజీ సర్పంచ్ గోళ్ల మాల్యాద్రినాయుడు పాల్గొన్నారు. కాగా హైస్కూల్ ఆవరణలో గ్రామ మాజీ సర్పంచ్ గోళ్ల మాల్యాద్రినాయుడు ఆర్థిక సహకారంతో నిర్మిస్తున్న భోజనశాలను ఎంపీడీవో పరిశీలించారు. అనంతరం గ్రామంలోని వాటర్‌ట్యాంకును ప్రాథమిక పాఠశాలను గ్రామ సచివాలయాన్ని సందర్శించారు.



భోజనాన్ని వడ్డిస్తున్న ఎంపీడీవో సురేష్

ప్రతి వ్యక్తికీ చదువు నేర్పించాలి

తాళ్లూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతివ్యక్తికి చదువునేర్పించాల్సిన బాధ్యత.. చదువుకున్న వారందరిపై ఉందని ఎంఈవో సుబ్బయ్య చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వయోజన విద్యాశాఖ, డీఆర్‌డీఏ ద్వారా ఉల్లాస్ అనే కార్యక్రమంపై వలంటీర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం బుధవారం జరిగింది. ఎంపీడీవో కె.సుందరరామయ్య మాట్లాడుతూ పొదుపు గ్రూపు మహిళలకు సంతకం ఒక్కటే కాదని, చదవండం కూడా నేర్పించాలన్నారు. వెలుగు ఏపీఎం దేవరాజ్ మాట్లాడుతూ మొదటి విడతగా నిరక్షరాస్యులైన 660 మందికి చదువు నేర్పించే కార్యక్రమం చేపట్టామన్నారు. బెల్లంకొండవారిపాలెం, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, రామభద్రాపురం, మల్కాపురం గ్రామాల్లో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వయోజనవిద్య సూపర్‌వైజర్ ఎన్ వెంకటరెడ్డి, అంగనవాడీ సూపర్‌వైజర్ జ్యోతి వెలుగు సీసీలు మోహన్, సుచీంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నాసర్

కళాశాలల్లోనూ భోజన పథకం అమలు చేయాలి

దర్శి, నవంబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తక్షణమే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాసన్ డిమాండ్ చేశారు. స్థానిక పొట్టి శ్రీరాములు కళాశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయి ఏఐఎస్ఎఫ్ 16వ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోకాలంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పీ పెద్దిరాజు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కరుణానిధి, సీపీఐ దర్శి నియోజకవర్గ కార్యదర్శి ఎం రమేష్‌బాబు, నాయకులు కె. హనుమంతరావు, కె. బాలయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ధ్యేయం



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వరగాని పౌలు

ముండ్లమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ మాజీ సభ్యుడు వరగాని పౌలు చెప్పారు. మండలంలోని పసుపుగల్లులో ఉపాధి హామీ పథకం నిధులు రూ.5 లక్షలతో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మించేందుకు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూరి పిచ్చిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షులు పొందుగుల శ్రీనివాసరెడ్డి, చింతల రాజారెడ్డి, కాట్రాజు వెంకట సుబ్బయ్య, పందుగుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

పామూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వాల నమోదు చేయించుకున్న కార్తకర్తల కుటుంబానికి భరోసా కలుగుతుందని టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు ఉప్పలపాటి హరిబాబు తెలిపారు. పట్టణంలోని 281 వ బూత్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభించారు. ఎన్ సాంబయ్య, బూత్ ఇన్‌చార్జి బండ్ల నారాయణ, కటకం శివప్రసాద్, వెంకటస్వామి పాల్గొన్నారు.

'వందశాతం అక్షరాస్యతే ఉల్లాస్ లక్ష్యం'



మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకరశర్మ

పీసీపల్లి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : వంద శాతం అక్షరాస్యతే ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశ్యమని ఎంపీడీవో ప్రభాకరశర్మ చెప్పారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం వెలుగు-డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటరీ బోధనా సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఇచ్చారు. ఎంఈవో శ్రీనివాసులు, వయోజన విద్యా పర్యవేక్షకులు వెంకటేశ్వరరెడ్డి, ఎంఈవోలు సంజీవిని, ఏపీఎం సత్యానందం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమతి, సీసీలు శశిరేఖ, బాస్కర్‌రెడ్డి, గీత పాల్గొన్నారు.

వరి పైరులో ఎరువులను జాగ్రత్తగా వాడాలి

కనిగిరి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వరి పైరులో మొదటి దఫా ఎరువులను జాగ్రత్తగా వాడాలని వ్యవసాయ శాఖ ఏవో జ్యోత్స్నాదేవి చెప్పారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుడిపాడు, తాళ్లూరు గ్రామాల్లో బుధవారం వరి, కంది పైరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ సత్యప్రసాద్, ఏఎంసీ లక్ష్మీ, టీఏఏలు జీవీ సుబ్బారావు, యోగేశ్వరి, వెటర్నరీ సిబ్బంది, కృష్ణకిరీటి, వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపు

ముండ్లమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజలందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింప చేస్తామని ఎంపీడీవో ఆర్ జనార్ధన్ చెప్పారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ అనే కార్యక్రమంపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం హనుమంతరావు, సీసీలు కోటేశ్వరరావు, రత్న కుమారి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పార్థసారథి

అక్రమంగా అమ్ముతున్న మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం సీసాలతో సీఐ శ్రీనివాసరావు

ముండ్లమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకరాపురంలో ఒక బెల్టు షాపులో అక్రమంగా మద్యం అమ్ముతున్న బుధవారం సాయంత్రం దర్శి ఎక్సైజ్ సీఐ కే శ్రీనివాసరావుకు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో వెళ్లి బెల్టు షాపుపై దాడి చేయగా 15 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు చెప్పారు. నిర్వాహకుడు ఎడ్లూరి మనోజ్ కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది శ్రీనివాసులు, ఎన్ శ్రీనివాసరావు, పీ నాగరాజు, కాశం పీర ఉన్నారు.

ఐదు బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

ముండ్లమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేముల పంచాయతీ పరిధిలోని కమ్మవారిపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదుబస్తాల రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన వరగాని అబ్రహం ఇంటి వరండాలో 5 బస్తాల రేషన్ బియ్యం ఉన్నట్టు కొందరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు వచ్చి బియ్యాన్ని స్వాధీనం చేసుకొని విచారించగా ఎండీయూ వాహన ఆపరేటర్ అంబటి కోటిరెడ్డి, హెల్పర్ ఎదురూరి మల్లికార్జునరెడ్డిలు వాహనంలో వచ్చి బియ్యం వేసి పోయారని అబ్రహం డీటీ లక్ష్మీప్రసన్నకు, ఆర్ఐ ఎంవీఎస్ఆర్ మూర్తికి ఫిర్యాదు చేశారు. పట్టుబడిన 5 బస్తాల బియ్యాన్ని వీఆర్వో ఎం పెద్దన్నకు అప్పగించారు.

రాహుల్ లాంటి వారు కనిగిరి యువతకు ఆదర్శం

ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఐఏఎస్ అధికారి రాహుల్ కనిగిరి ప్రాంత యువతకు ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. బుధవారం స్థానిక ప్రైవేటు కల్యాణమండపంలో ఐఏఎస్ అధికారి వంగేపురం రాహుల్ కుమార్ అభినందన సభలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కనిగిరి ప్రాంతంలోని యువత ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి ర్యాంకులు సాధించి కనిగిరి ప్రాంతానికే గర్వకారణంగా నిలవటం ఎంతో శుభపరిణామమన్నారు. అకుంఠిత దీక్ష పట్టుదలే రాహుల్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఉన్నత స్థాయికి ఎదిగిన ఈ ప్రాంతం వారు కనిగిరి అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన వ్యక్తి తన సోదరి కుమారుడు ఉన్నతస్థాయికి చేరుకుని అటు కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి పేరు తెచ్చేలా ఎదగటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకాన్ని ప్రారంభించిన కరస్పాండెంట్

సీఎస్‌పురం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో 4వ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల జాతీయ సేవా పథకం కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ కదిరి పార్థసారథి బుధవారం ప్రారంభించారు. ఉద్యాన కళాశాల డీన్ డాక్టర్ వీరన్నగౌడ్, ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవిద్యా, ఉప సర్పంచ్ తీనకం బాబురావు, షేక్ బజాజ్‌బుజ్జి, మునగాల నారాయణరెడ్డి, మూరం కాశిరెడ్డి, వెంకటాద్రి పాల్గొన్నారు.







సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

అమరావతికి నిరంతరాయంగా వెలుగులు

- అండర్ గ్రౌండ్ కేబుల్.. నాణ్యమైన విద్యుత్ సరఫరా
- తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో నిర్మాణం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ.. ఐదు నెలల్లో పూర్తిచేసిన కూటమి ప్రభుత్వం
- నేడు 400/220 కే.వీ.సబ్ స్టేషన్‌ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తుళ్లూరు, గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో నిరంతరాయంగా.. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా 400/220 కేవీ సబ్ స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 20 ఎకరాల్లో రూ.505 కోట్లతో స్విచ్చింగ్ స్టేషన్ నిర్మాణ పనులను ప్రారంభించింది. అయితే ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దీనిని ఐదేళ్లుగా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి పనులను పట్టాలెక్కించే క్రమంలో ఈ సబ్‌స్టేషన్ పనులను తిరిగి చేపట్టింది. ఐదు నెలల్లో పనులు పూర్తి చేశారు. ఈ క్రమంలో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఈ సబ్‌స్టేషన్‌తో రాజధాని అమరావతిలో నిర్మాణం జరిగే సచివాలయం హైకోర్టు, అసెంబ్లీ, రాజ్ భవన్, సీఎం క్యాంప్ కార్యాలయం, ప్రస్తుతం ఉన్న వెలగపూడి సచివాలయం, అసెంబ్లీ హైకోర్టు భవనాలకు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుంది. సబ్‌స్టేషన్ నుంచి రాజధాని ప్రాంతంలో ఎక్కడా స్తంభాలు లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. కొండపల్లి థర్మల్ పవర్ స్టేషన్ నుంచి తాళ్లాయపాలెం స్విచ్చింగ్ విద్యుత్ సబ్ స్టేషన్‌కు నిరంతరం కరెంట్ సరఫరా అవుతుంది. దీంతో రాజధాని ప్రాంతంలో 24 గంటలు నాణ్యమైన కరెంట్ సరఫరా అవుతుతుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మరో ఆరు సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలతో పాటు 15 సబ్ స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన, కొత్త విద్యుత్ లైన్లను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో తాళ్లాయపాలెంలో అధికారులు భారీగా ఏర్పాట్లుచేశారు. ఏర్పాట్లను బుధవారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తీ చేకూరి తదితరులు పరిశీలించారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలోనే ముఖ్యమంత్రి ప్రసంగించేందుకు వేదికను ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి రాజధాని ప్రాంతవాసులు భారీగా హాజరై జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీంబాష, గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు, ఎంపీడీవో శిల్ప, తహసీల్దారు సుజాత, నాయకులు పుట్టి రామచంద్రరావు, ధనేకుల సుబ్బారావు, లంకా సుధాకరరావు, కొండెపాటి బుజ్జి, శ్రీహరి, సుబ్రహ్మణ్యం, వాకచర్ల వీరాంజనేయులు, బెజవాడ నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.



సీఎం ప్రారంభించే విద్యుత్ సబ్ స్టేషన్ పైలాన్

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

జగన్ ప్రభుత్వం రాజధాని అమరావతిని నిర్వీర్యం చేసేలా తీసుకున్న నిర్ణయాలను కూటమి ప్రభుత్వం సవరిస్తూ వస్తోంది. సీఆర్‌డీఏ పరిధిని గత ప్రభుత్వం కుదించగా తాజాగా దానిని పూర్వస్థితికి తెచ్చారు. ఏపీసీఆర్‌డీఏ(ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజన్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిం ది. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో చర్చించి దీనికి ఆమోదముద్ర వేసింది. పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆరు మండలాలు, 92 గ్రామాలు, బాపట్ల జిల్లాలోని ఐదు మండలాల్లోని 62 గ్రామాలు తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి వచ్చాయి. దీంతో సీఆర్‌డీఏ విస్తీర్ణం తిరిగి 8352.69 చదరపు కిలోమీటర్లకు చేరింది. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం బిల్లు పెట్టి రాజముద్ర వేయనుంది. ఈ నిర్ణయంపై సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాలు, పట్టణాల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

- పరిధిని పునరుద్ధరించిన ప్రభుత్వం
- 8,352.69 చదరపు కిలోమీటర్లకు చేరిన విస్తీర్ణం
- గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ మంత్రివర్గం తీర్మానం
- మంత్రివర్గం నిర్ణయంపై పల్నాడు, బాపట్ల జిల్లావాసుల హర్షం

బాపట్ల, నరసరావుపేట, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతిని అత్యద్భుతంగా తీర్చిదిద్దేందుకు గత టీడీపీ ప్రభుత్వం కృషి చేయగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం దానిని పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నింది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏను తొలుత రద్దు చేసేందుకు ప్రయత్నించి అది వీలు కాకపోవడంతో పరిధిని కుదించింది. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చినా.. రాజధాని రైతులు పోరాడినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అమరావతిని పట్టాలెక్కిస్తోంది. ఇందులో భాగంగా సీఆర్‌డీఏ పరిధిని పునరుద్ధరిస్తూ బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలతో సీఆర్‌డీఏ పరిధిపై అస్పష్టత నెలకొనగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయం తీసుకుంది. 2014లో ఏదైతే ఏపీసీఆర్‌డీఏ చట్టాన్ని ఆమోదించారో దానినే పునరుద్ధరించేందుకు ఆమోదముద్ర వేసింది. దీంతో గుంటూరు జిల్లాలో తాడేపల్లి మండలం, అర్బన్ ఏరియా, మంగళగిరి మండలం అర్బన్ ఏరియా, తుళ్లూరు, దుగ్గిరాల, తెనాలి మండలం, అర్బన్, గుంటూరు మండలం, అర్బన్, చేబ్రోలు, మేడికొండూరు, పెదకాకాని, వట్టిచెరుకూరు, అమరావతి, కొల్లిపర, వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాలు సీఆర్‌డీఏలోకి వచ్చాయి. వీటితో పాటుగా భట్టిప్రోలు మండలంలోని శివనాగులపాలెం, భట్టిప్రోలు, అద్దేపల్లి, వెల్లటూరు, పొన్నూరు మండలంలో మునిపల్లె, మామిళ్లపల్లి, కొండముడి, ఉప్పరపాలెం, చింతలపూడి, వెల్లలూరు, ఆరేమండ, దండమూడి, పచ్చలతాడిపర్రు, మన్నవ, దొప్పలపూడి, జడవల్లి, నిడుబ్రోలు, జూపూడి, బ్రాహ్మణకోడూరు, వడ్డిముక్కల గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని కొండపాడు, యనమదల,

(మిగతా 6వ పేజీలో..)

దశ, దిశలేని బావుడా

కేవలం ఓ నామినేటెడ్ పోస్టు సృష్టించడం కోసమే ఆదరాబాదరాగా గత వైసీపీ ప్రభుత్వం బావుడా ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలను కూడా బావుడా పరిధిలోకి తెచ్చింది. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఉడా పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మూడు అటు, మూడు ఇటు ఉన్నాయి. ఇక సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న వేమూరు నియోజకవర్గాన్ని తీసుకొచ్చి బావుడాలో అయితే విలీనం చేసింది తప్ప అభివృద్ధి విషయంలో ఓ దశ, దిశ చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తమ ప్రాంతం సీఆర్‌డీఏలోకి వెళ్లగా అభివృద్ధిపై గంపెడాశలతో ఉండగా వారి ఆశలను కాలరాస్తు వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందనేది అక్కడి ప్రజల అభిప్రాయం.

తగ్గిన పూడా పరిధి

పల్నాడు జిల్లాలోని ఆరు మండలాలు, సత్తెనపల్లి మున్సిపాల్టీని సీఆర్‌డీఏలో విలీనం చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానంతో పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ(పూడా) పరిధిని తగ్గింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలతో పూడాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 మండలాలకు పూడా పరిధిని కుదించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, యడ్లపాడు మండలాలను పూడా నుంచి తొలగించి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకున్నారు. దీంతో పూడా రూపురేఖలు మారిపోయాయి. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాల్టీలు, గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకే పూడాకు పరిమితమైంది.

రీజెన్సీ సిరామిక్ ప్రారంభానికి సిద్ధం

- త్వరలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- పరిశ్రమను పరిశీలించిన ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు



వేమవరంలో రీజెన్సీ ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు తదితరులు

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రీజెన్సీ సిరామిక్ టైల్స్ పరిశ్రమ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. సీఎంవో నుంచి వచ్చిన ఆదేశాల మేరకు బుధవారం రీజెన్సీ సిరామిక్ పరిశ్రమను ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, పలు శాఖల అధికారులు పరిశీలించారు. యానాంలో మూతపడిన రీజెన్సీ పరిశ్రమను వేమవరంలో మూత పడి ఉన్న సెగ్నో సిరామిక్‌లో ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. రీజెన్సీ చైర్మన్ జీఎన్ నాయుడు దీనిని ముఖ్యమంత్రితో ప్రారంభింప చేసేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో అధికారులు హెలిప్యాడ్, పొల్యూషన్ తదితరాలను పరిశీలించారు. రీజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ సత్యేంద్ర ప్రసాద్, హెచ్‌ఆర్ మెహన్‌రావు, తహసీల్దార్ కవిత, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పర్మినెంట్ లైసెన్సు 74 దుకాణాలకే

- మద్యం ప్రొవిజనల్ లైసెన్సులకు నేటితో ముగియనున్న గడువు
- మరో వారం వ్యవధి ఇచ్చే ఆలోచనలో ప్రభుత్వం



బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న యజమానులకు ప్రభుత్వం ప్రొవిజనల్ లైసెన్సులు జారీ చేసిన సంగతి తెలిసిందే. తొలుత వీటి గడువు అక్టోబరు 31తో ముగుస్తుందని, నవంబరు 1 కల్లా మద్యం షాపుల యజమానులు పర్మినెంట్ లైసెన్సు పొందాలని ఎక్సైజ్ శాఖ ప్రకటించిన సంగతి తెలిసిందే. నిర్ణీత తేదీలోగా లైసెన్సుదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన కానరాకపోవడంతో నవంబరు 7 వరకు ప్రొవిజనల్ లైసెన్సుల గడువును ఎక్సైజ్‌శాఖ పొడిగించింది. జిల్లాలో ఉన్న 117 మద్యం షాపులకు బుధవారం సాయంత్రానికి 74 మద్యం షాపుల యజమానులు మాత్రమే పర్మినెంట్ లైసెన్సు పొందడానికి కావాల్సిన ప్రక్రియను పూర్తి చేశారు. గడువు గురువారంతో ముగియనుండగా ఒక్క రోజు వ్యవధిలో మిగిలిన 43 మద్యం షాపుల యజమానులు పర్మినెంట్ లైసెన్సు పొందడం సాధ్యం కాదనే అభిప్రాయాన్ని ఎక్సైజ్ శాఖ వెలిబుచ్చుతోంది. పర్మినెంట్ లైసెన్సులపై అంతంతమాత్రంగా స్పందన ఉండడంతో గడువును మరో వారం రోజులు పెంచే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఆదేశాలు గురువారం వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పర్మినెంట్ లైసెన్సు జారీ చేసే ముందు షాపుల లొకేషన్ విషయంలో క్షేత్రస్థాయిలో విజిట్ చేసిన పిమ్మటే ఎక్సైజ్‌శాఖ నిర్ణయం తీసుకోనున్నది. ఈ ప్రక్రియలో భాగంగా పది మద్యం షాపుల విషయంలో నిబంధనలను పాటించలేదని ఎక్సైజ్‌శాఖ అధికారుల దృష్టికి రాగా సవరించుకోవడానికి ఓ రోజు వ్యవధిని లైసెన్సుదారులకు ఇచ్చింది.

లొకేషన్ విషయంలో మల్లగుల్లాలు

ఇంకా 43 మద్యం షాపుల విషయంలో పర్మినెంట్ లైసెన్సు విషయంలో ఎలాంటి ముందడుగు పడకపోవడానికి లొకేషన్ విషయంలో సదరు యజమానులు తుది నిర్ణయానికి రాకపోవడమే కారణంగా తెలుస్తోంది. ఇంకా కొన్ని కీలక సెంటర్ల షాపుల విషయంలో సిండికేట్ పంచాయితీ నడుస్తూనే ఉండగా, రూరల్ పరిధిలో మద్యం షాపుల యజమానులు ఓ అవగాహనకు వచ్చి వ్యాపారం చేస్తున్నారు. యజమానులు ఏరియాల వారీగా సిండికేట్ అవడం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశం భవిష్యత్తులో అక్రమాలకు తెరతీయడానికేనని సమాచారం. ఎమ్మార్పీ ఉల్లంఘనలతో పాటు బెల్ట్ షాపుల విషయంలో కూడా సిండికేట్‌లో ఉన్న షాపుల యజమానులంతా ఒకే మాట మీద ఉండడంతో వారు చెప్పిందే ధరగా మందుబాబుల జేబులు గుల్ల చేసే అవకాశం ఉంది. తమ అక్రమాలకు అడ్డురాకుండా ఉండడానికి అధికారుల వద్దకు ఇప్పటికే రాయబారాలు సాగిస్తున్నారనేది సమాచారం

రైతుల కోసం మార్కెటింగ్

- చెక్‌పోస్టుల్లో అవకతవకలపై దృష్టి
- ఆంధ్రజ్యోతితో మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్‌బాబు

బాపట్ల, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ రైతుల కోసం ఉంది. మార్కెటింగ్ విభాగం ద్వారా అన్నదాతల ఉత్పత్తులకు సరైన ధర వచ్చే విధంగా ట్రేడ్ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పిస్తాం. చెక్‌పోస్టుల దగ్గర అవకతవకలపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపడతాం. అని మార్కెటింగ్ శాఖ బాపట్ల ఏడీ కె.రమేష్‌బాబు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రైతుల కోసం మార్కెటింగ్ శాఖ చేపడుతున్న పథకాలను బుధవారం ఆయన వివరించారు. మార్కెటింగ్ శాఖ తీసుకుంటున్న చర్యలపై వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.

రైతులు నిల్వకి ఇబ్బంది లేదు

రైతులు వారి పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి వీలుగా గోడౌన్లను అందుబాటులో ఉంచాం. గోదాములను ఇతర సంస్థల అవసరాల కోసం గత ప్రభుత్వ హయాంలో లీజుకు ఇవ్వడం జరిగింది. అవసరమనుకుంటే వాటిని కూడా రైతుల ప్రయోజనాలకే ఉపయోగిస్తాం.

రైతు బజార్ల ఏర్పాటు

ఏళ్ల తరబడి ప్రారంభానికి నోచుకోని బాపట్ల మార్కెట్ సెంటర్‌లోని రైతుబజారును ఇటీవలే అందుబాటులోకి తెచ్చాం. రేపల్లెలో రైతుబజార్ ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. సాధ్యమైనంత త్వరగా దీని నిర్మాణం పూర్తి చేస్తాం. రైతుబజార్లలో కూరగాయల ధరలు నియంత్రణలో ఉంచడానికి ఎస్టేట్ ఆఫీసర్‌ను నియమిస్తాం.

రూ.30 కోట్ల లక్ష్యం

ఈ ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ యార్డుల పరిధిలోని చెక్‌పోస్టులతో పాటు ఇతరత్రా ఆదాయ లక్ష్యం రూ.30 కోట్లుగా నిర్ణయించడం జరిగింది. వీటిలో ఇప్పటికే 38 శాతం చేరు కున్నాం. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.28 కోట్లు లక్ష్యంగా పెట్టుకుంటే రూ.26 కోట్ల వరకు చేరుకోగలిగాం.యార్డుల పరిధిలో రైతులకు కనీస సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపడు తున్నాం.



దరఖాస్తు చేసుకోవాలి

రైతుబజార్‌లో స్టాల్స్ కోసం ఇప్పటికే రైతులకు 59 వరకు దరఖాస్తులు ఇచ్చాం. వీరికి ఎటువంటి రుసుము లేకుండా కేటాయిస్తాం. డ్వాక్రా మహిళలతో పాటు ఇతర స్వయం సహాయక గ్రూపులు ఎవరైనా రైతుబజార్‌లో స్టాల్ కావాల్సి వస్తే జాయింట్ కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనలకు లోబడి అర్హులైన వారికి నిర్ణీత అద్దె ప్రాతిపదికన స్టాల్ కేటాయిస్తాం.

మరమ్మతులకు ప్రతిపాదనలు

జిల్లాలో ఉన్న గోడౌన్ల మరమ్మతులకు గతంలోనే ప్రతిపాదనలు పంపడం వాటిని ఆమోదించడం జరిగింది. పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అవి అంతటితోనే ఆగిపోయాయి. గోడౌన్‌ల మరమ్మతులపై దృష్టిపెట్టాలని ఇప్పటికే ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. అందుకు తగ్గట్టుగా ప్రతిపాదనలపై కసరత్తు చేస్తున్నాం. యార్డుల్లో ధాన్యం అరబోసుకోవడానికి రైతులకు కావాల్సిన సదుపాయాలను కూడా కల్పిస్తాం.

పత్తి కొనుగోళ్లకు రిజిస్ట్రేషన్లు

సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందుకోసం పర్చూరు, మార్టూరు యార్డు పరిధిలో జిన్నింగ్‌మిల్లులను ఎంపిక చేశాం. రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా ప్రారంభమైంది. రైతులు లూజ్ పత్తిని తీసుకురావాలి. లేదంటే గన్నీబ్యాగులలో మాత్రమే పత్తిని మిల్లులకు తరలించాలి.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ఏడాది ఇప్పటి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన ప్రభుత్వం వచ్చే ఏడాది ప్రతి మండలంలో కనీసం ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా ఆయా కళాశాలల్లో మెరుగైన శిక్షణ ఇవ్వడంతోపాటు జాతీయ స్థాయిలో పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడానికి కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల ఇంటర్ బోర్డు అధికారులతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమీక్షలో నూతన విద్యావిధానాలపై విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించారు.

- వచ్చే ఏడాది నుంచి మండలానికో జూనియర్ కళాశాల
- భారీ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక
- ఇంటర్ కళాశాలల్లో ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ
- ఈ ఏడాది ఇప్పటికే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ



గుంటూరు(విద్య)నవంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఇప్పటికే 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలల్లో ప్రస్తుతం 15వేలమందికిపైగా విద్యార్థిని విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. అంటే ఇంకా దాదాపు సగం మండలాల్లో ప్రభుత్వ లేదా ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు లేవు. ఈనేపథ్యంలో జూనియర్ కళాశాలలు లేని మండలాల్లో కొత్తగా కళాశాలలు ఏర్పాటుచేయాలని ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. ఇందుకు ప్రైవేటువిద్యాసంస్థల్ని ప్రోత్సహించి త్వరితగతిన అనుమతులు వచ్చేలా ఏర్పాట్లు చేస్తారు.

పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు జాతీయస్థాయిలో పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యేలా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. రాష్ట్రస్థాయిలో జరిగే ఎంసెట్‌తోపాటు, జాతీయ స్థాయిలో జరిగే నీట్, జేఈఈ మెయిన్స్‌అడ్వాన్స్‌పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అంతేకాకుండా

(మిగతా 8వ పేజీలో..)

హత్యాయత్నం కేసులో ఆరుగురికి శిక్ష

» వారిలో నలుగురికి ఐదేళ్లు, ఇద్దరికి రెండేళ్ల జైలు, జరిమానా

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో 2017 సంవత్సరంలో వ్యక్తిపై కత్తులతో, ఇనుపరాడ్డుతో దాడికి పాల్పడి హత్యాయత్నానికి ప్రయత్నించిన వారిలో ఆరుగురికి శిక్ష పడింది. వీరిలో నలుగురికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా, మరో ఇద్దరికి ఏడాది సాధారణ జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ చీరాల అసిస్టెంట్ స్టేషన్స్ కోర్టు న్యాయాధికారి సుధ తీర్పును వెల్లడించారు. స్థానిక థామస్‌పేటకు చెందిన బొనిగల శ్యామ్‌బాబు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా ముంతావారి సెంటర్‌లో వెనుక నుంచి వెంబడించిన జాన్‌పేటకు చెందిన జొన్నలగడ్డ ప్రభుదాస్, అశోక్ కుమార్, ఉప్పురమేష్, శ్రీనివాసనగర్‌కు చెందిన సాతినేని శివపార్వతి, దేవిశెట్టి మస్తాన్‌రావు, కొండెపి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన అరతోటి ప్రసాద్ కత్తులతో, ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈక్రమంలో అప్పటి సీఐ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. అయితే కేసు ప్రస్తుతం విచారణకు రావడంతో ప్రస్తుత సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సాక్షాదారులను కోర్టులో హాజరు పరచగా, పీపీ పద్మజ వాదనలు వినిపించారు. దీంతో బుధవారం తీర్పు వెలువడింది. నేరస్తులకు ఎప్పటికైనా శిక్షలు తప్పవని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. కీలకంగా వ్యవహరించిన సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

రైతును ఢీకొట్టిన వ్యాన్

ఘటనా స్థలంవద్దే మృతి

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొలం పనులకు వెళుతున్న రైతు పావులూరి హరిబాబు (60)ని వెనుక నుంచి మినీ వ్యాన్ ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం బల్లికురవలో జరిగింది. బల్లికురవ గ్రామానికి చెందిన రైతు పావులూరి హరిబాబు పొలం పనులకై చెన్నుపల్లి రోడ్డు వైపు వెళ్లి రోడ్డు దాటుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన మినీ వ్యాన్ ఢీకొట్టింది. రైతు మృతదేహాన్ని వ్యాన్ కొంత దూరం ఈడ్చుకు రావడంతో ఛిద్రమైంది. వినుకొండ నుంచి బల్లికురవ గొర్రెలను దించేందుకు వచ్చి తిరిగి వెళుతున్న ఈ వ్యాన్ వేగంగా రావడం వలనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్ డ్రైవర్ పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగి పోయారు. ఎస్ఐ జీవీ చౌదరి పరిశీలించి ప్రమాద వివరాలను సేకరించారు. హరిబాబు భార్య పద్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. హరిబాబుకు కుమారుడు ఉన్నాడు.

ఇం'ధనం' లేక నిలిపివేత

» కదలని 108లు

» జిల్లావ్యాప్తంగా నిలిచిన 10 వాహనాలు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రాణపాయ పరిస్థితులలో ఆపద్బాంధవుల్లా ఆదుకుంటున్న 108 వాహనాలు మూగపోతున్నాయి. నిత్యం ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా సత్వరమే చేరుకునే వాహనాలకు ఇంధనం (డీజిల్) లేని పరిస్థితి నెలకొంది. ఆ వాహనాలకు అవసరమైన మేరకు డీజిల్ లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయోనని పైలెట్లు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా 108కు డీజిల్ ఫుల్‌ట్యాంకు చేయించుకొని అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగినట్లు ఫోన్ వచ్చిందంటే ఏ సమయంలోనైనా సరే వెంటనే అక్కడకు ఆగమేఘాలపై వెళ్లాలి. అటువంటి వాహనాలకు తాజాగా నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా అరవిందో సంస్థ 108 వాహనాల నిర్వహణకు కాంట్రాక్టు అప్పగించింది. ప్రస్తుతం కూడా ఆ సంస్థనే చూస్తోంది. అందులో భాగంగా ప్రకాశం జిల్లాలో 40 వాహనాలు నడుస్తున్నాయి. వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఆ సంస్థపై ఉంటుంది.

పది వాహనాలు ఆగాయి

అయితే బుధవారం జిల్లాలో 10 వాహనాలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రమైన ఒంగోలుతోపాటు కురిచేడు, పలు ఇతర మండలాల్లో వాహనాలు ఆగిపోయాయి. కేవలం 30 వాహనాలు మాత్రమే రన్నింగ్‌లో ఉండగా వాటిలోనూ డీజిల్ అయిపోతే అవి పక్కనపెట్టే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదనే కారణంతో 108 వాహనాలకు అవసరమైన డీజిల్, ఇతర మెయిటినెన్స్‌కు సంస్థ డబ్బులు ఇవ్వని పరిస్థితి ఏర్పడింది. ఒక రోజు ఒక ప్రాంత వాహనాలకు డీజిల్ కొట్టించి నడుపుతున్నట్లు సమాచారం.

డిజిల్ వినియోగంపై సంస్థ ఆంక్షలు

సంస్థ రోజువారీ డీజిల్ కోసం ఎంతో కొంత నగదును ఇస్తున్నట్లు సమాచారం. ఒక్కొక్క రోజు 108 వాహనం ఎక్కువ తిరిగాల్సి రావడంతో ఆ డీజిల్ ఒక్క రోజుకే సరిపోతుంది. సాధారణంగా రోజువారీ కాకుండా ఆ వాహనానికి ఉన్న ట్యాంకును ఫుల్ చేయించుకుంటుంటారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రోజువారీ ఒక్కొక్క వాహనానికి ఐదారు వందలకు మాత్రమే డీజిల్ కొట్టిస్తున్నట్లు సమాచారం. ఆ వినియోగంపై కూడా ఆంక్షలు పెడుతుండటంతో డ్రైవర్లు(పైలెట్) ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గతంలో డీజిల్ బంకుల్లో ఆ వాహనాలకు అప్పునకు పోసేవారు. నెలవారీ బిల్లులు చెల్లింపు చేసేవారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ఏ రోజుకారోజు పోయించుకోవాల్సి రావడంతో వాహనాలు ఎప్పుడు నిలిచిపోతాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

భారీ నష్టం

» 5020.96 హెక్టార్లు, 7,468 మంది రైతులు

» గత నెలలో వర్షాలకు దెబ్బతిన్న పంటల లెక్కతేల్చిన అధికారులు

» రూ.7.12 కోట్లు పరిహారం కోరుతూ ప్రభుత్వానికి కలెక్టర్ నివేదిక

ఒంగోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టాలపై అధికారులు లెక్కతేల్చారు. వ్యవసాయశాఖ పరిధిలో మొత్తం ఆరు రకాల పంటలు 5,020.96 హెక్టార్లలో దెబ్బతిన్నాయని, 7,468మంది రైతులు నష్టపోయినట్లు నిర్ధారించారు. గతనెల 10 నుంచి 20తేదీ వరకు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసిన విషయం విదితమే. అత్యధిక ప్రాంతాల్లో భారీవర్షాలు పడగా చాలా మండలాల్లో 15 నుంచి 23 సెం.మీ వర్షపాతం ఆ సమయంలో నమోదైంది. అలా తెరపి లేకుండా వర్షాలు కురవడంతో పంటలకు అపారనష్టం జరుగుతుందని అందరూ భావించారు. అయితే వర్షాలు కురిసే సమయానికి ఖరీఫ్ పంటలు అధికశాతం పూత, కాయదశలో ఉన్నాయి. అయితే కోతకు వచ్చిన సజ్జపంట అలాగే కాయలు కుళ్లి కొంత మేర పత్తి పంటకు నష్టం జరిగింది. ఇదిలా ఉండగా వర్షాలు కురిసే సమయానికి మినుము, అలసంద, కంది ఇతర త్రా పంటలు వేసి నెల, నెలన్నర లోపుగా అధిక ప్రాంతాల్లో ఉన్నాయి. అలా మొక్క లేదా మొలకదశలో ఉన్న ఆ పంటలకు కూడా కొంత నష్టం జరిగినా ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూత దశ నుంచి జరిగే నష్టాన్నే పరిగణనలోకి తీసుకుంటారు. అలా గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం కొంత పరిమితంగానే తేలింది.

రూ.7.12 కోట్లు పరిహారం ఇవ్వాలి

గతనెల 27 వరకు రైతు వారీ, పంట వారీ నష్టాలను వ్యవసాయ, రెవెన్యూ క్షేత్ర స్థాయి అధికారులు సర్వే చేసి గుర్తించారు. ఈనెల 2 వరకు రైతు సేవా కేంద్రాలలో ఆ జాబితాలను ఉంచారు. పెద్దగా అభ్యంతరాలు, ఫిర్యాదులు వచ్చిన దాఖలాలు లేకపోగా వ్యవసాయ అధికారులు మూడు రోజుల క్రితం పంటల వారీ, రైతువారీ నష్టాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం వివరాలను కలెక్టర్‌కు అందజేశారు. వాటిని పరిశీలించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా భారీవర్షాలతో 7,468 మంది రైతులకు చెందిన 5,020.96 హెక్టార్లలోని ఆరు రకాల పంటలకు నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదించారు. సంబంధిత రైతులకు పరిహారంగా రూ.7.12కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని ఆ నివేదికలో పేర్కొన్నారు. కాగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం నిధులు విడుదల చేసినప్పుడు నేరుగా వారివారి ఖాతాల్లో ఆ మొత్తాలు జమ అవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. పంట నష్ట వివరాలు ఇలాఉన్నాయి

పంట పేరు	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు	అంచనా (రూ.లక్షల్లో)
వరి	7.20	10	1.22
సజ్జ	1583.47	2558	135.44
జొన్న	3.18	3	0.27
పొగాకు	58.51	48	5.80
పత్తి	3338.49	4825	567.54
కొర్ర	20.20	24	1.72
మొత్తం	5020.96	7468	712.04(లక్షలు)

ప్రభుత్వ భవనాలకు మోక్షం ఎప్పుడో?

» అసంపూర్తి పనులతో నిలిచిన కట్టడాలు

» ఏళ్ల తరబడి గ్రామాలలో ఇదే పరిస్థితి

» కొన్ని శిథిలావస్థకు

» నిధులు వృథా చేస్తున్నారని ప్రజల అసహనం



కొమ్మినేనివారిపాలెంలో అసంపూర్తిగా పనులు పూర్తి కాని విలేజీ హెల్త్ క్లినిక్ భవనం

బల్లికురవ. నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల వైసీపీ పాలనలో విచ్చలవిడిగా గ్రామాలలో ప్రభుత్వ భవనాలకు రూ.కోట్ల నిధులను మంజూరు చేశారు. కానీ ఎక్కడా నిర్మాణాలు మాత్రం పూర్తి కాలేదు. పలు గ్రామాలలో ఏళ్ల తరబడి అలానే అసంపూర్తి పనులతో ప్రభుత్వ భవనాలు నిర్మాణం పూర్తి కాకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయి. ప్రజా నిధులు పెద్ద ఎత్తున వృథా అవుతున్నాయని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాలలో గతంలో వైసీపీ హయాంలో పెత్తనం చేసిన కొందరు భవనాలను కొంత మేర నిర్మాణం చేపట్టి వచ్చిన వరకు బిల్లులు డ్రా చేసుకొని భవనాలను పూర్తి చేయకుండా వదిలేశారని ఇప్పుడు ఆ భవనాలను ఎవరు పూర్తి చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పట్లో అసంపూర్తి పనులతో ఉన్న భవనాల నిర్మాణాలు పూర్తయ్యే అవకాశాలు లేవని ప్రజలు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బేసు మట్టం వేసి మట్టి బిల్లులు వచ్చే వరకు పనులు చేపట్టి నిధులను కాజేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాలలో ఊరికి దూరంగా భవనాలను ఏర్పాటు చేయడం కూడా కొంత జాప్యం జరగడానికి కారణమని వారు అంటున్నారు.

బల్లికురవ మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాలకు గత వైసీపీ ప్రభుత్వం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణాలకు నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో గత మూడేళ్ల కాలం నుంచి గ్రామాలలో భవనాల నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. ఒక్కో సచివాలయ భవనానికి రూ.43లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.24లక్షలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ.20లక్షల చొప్పున నిధులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో వైసీపీ చోటా నేతలు ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భవనాలను నిర్మాణం చేపట్టారు. కొందరు బేసు మట్టం వేసి మట్టి బిల్లులు పొంది తదుపరి పనులను నిలిపివేవారు. కొందరు కప్పు వరకు వేసి అలానే వదిలి వేశారు. కొందరు పిల్లర్ల దశ వరకు పనులు చేపట్టి అయ్యుకడకు వచ్చిన వరకు బిల్లులను పొంది పను లు పూర్తి చేయకుండా వదిలి వేశారు. ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనాల నిధులు పక్క దారి పట్టాయని పలువురు విమర్శిస్తున్నారు. ఎన్నిసార్లు భవనాల అసంపూర్తి పనులు పూర్తి చేయాలని అధికారులు పనులు మెదలు పెట్టినా, వారితో చెప్పినా ఎవరు పట్టించుకోక పోవడం వలనే అన్ని గ్రామాలలో భవన నిర్మాణాలు పూర్తి కాకుండా ఉన్నాయి. బల్లికురవ మండలంలోని కొత్తూరులో రైతు భరోసా కేంద్రం, పిల్లర్ల దశలోనే ఉంది. అలానే ముక్తేశ్వరం అర్‌బీకే భవనం పిల్లర్ల దశలోనే శిథిలావస్థకు చేరింది. విలేజ్ హెల్త్ భవనం ప్లాస్టింగ్ వరకు వచ్చి ఉంది. వెలమవారిపాలెంలో సచివాలయం భవనం 80 శాతం పూర్తి కాగా ఆర్‌బీకే భవనం పిల్లర్ల దశలోనే ఉంది. కూకట్లపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు కప్పు దశలోనే ఉన్నాయి. కొణిదెనలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు 70శాతం పనులు పూర్తయి ఉన్నాయి. సోమవరప్పాడులో ఆర్‌బీకే స్లాబు వరకు రాగా విలేజ్ హెల్త్ క్లినిక్ పిల్లర్ల దశలోనే ఉంది. వల్లాపల్లిలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం స్లాబు పూర్తి అయి ఉంది. చెన్నుపల్లిలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు 80 శాతం పూర్తయి పనులు నిలిచి ఉన్నాయి. ఎస్‌ఎల్ గుడిపాడులో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు పిల్లర్ల దశలోనే పనులు నిలిచి ఉన్నాయి. బల్లికురవలో కోర్టు కేసులతో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు బేసు మట్టం దశలో పనులు నిలిచి ఉన్నాయి. అలానే మరి కొన్ని గ్రామాలలో అరకొర పనులు పూర్తి కాక పోవడంతో ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ప్రభుత్వ భవనాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు కూడా అసంపూర్తి భవనాలపై దృష్టి పెట్టలేదని వెంటనే అన్ని గ్రామాలలో పనులు నిలిచి ఉన్న ప్రభుత్వ భవనాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కొమ్మినేనివారిపాలెంలో కప్పు వేసి వదిలేసిన రైతు సేవా కేంద్రం



ముక్తేశ్వరంలో పిల్లర్ల దశలోనే నిలిచిన రైతు సేవా కేంద్రం



కొత్తూరులో పిల్లర్ల దశలోనే ఉన్న రైతు సేవా కేంద్రం

సీఆర్‌డీఏ.. పూర్వస్థితికి

• పరిధిని పునరుద్ధరించిన ప్రభుత్వం • 8,352.69 చదరపు కిలో మీటర్లకు చేరిన విస్తీర్ణం

• గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దుతూ మంత్రివర్గం తీర్మానం • నిర్ణయంపై పల్నాడు, బాపట్ల జిల్లావాసుల హర్షం

బాపట్ల, నరసరావుపేట, గుంటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈదులపా లెం, నడింపాలెం, ప్రత్తిపాడు, మల్లాయపా లెం, గొట్టిపాడు, కొండ జాగర్లమూడి, గనికెపూడి, పెదనందిపాడులో గోరిజవోలు గుం ట పాలెం, యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, ఉన్నవ, కొండవీడు, సొలస, వంకాయలపాడు, మైదవోలు, యడ్లపాడు, విశ్వనాధుని కండ్రిక, జాలాది, తిమ్మాపురం, కారుచోల, నాదెండ్ల మండలంలోని నాదెం డ్ల, ఫిరంగిపురం మండలంలోని హవుసు గణేష, రేపూడి, ఫిరంగిపురం, అమీనాబాద్, నుదురుపాడు, వేమవరం, బేతపూడి, తాళ్లూరు, యర్రగుంట్లపాడు, సిరంగిపా లెం, తక్కెళ్లపాడు, ముప్పాళ్ల మండలంలోని మాదల, సత్తెనపల్లి మండలంలోని పెదమక్కెన, కొమెరపూడి, లక్కరాజుగార్లపాడు, నందిగామ, కంటెపూడి, బీమవరం, కంకణాలపల్లె, గుడిపూడి, ఫణిదం, అబ్బూరు, పాకాలపాడు, రెంటపాళ్ల, గోరంట్ల, కట్టమూరు, భట్లూరు, వడ్డవల్లి, పెదకూరపాడు మండలంలోని అన్ని గ్రామాలు, అచ్చంపేట మండలంలోని కస్తల అగ్రహారం, కోనూరు, ఓర్వకల్లు, అంబడిపూడి, వేల్పూరు, చిగురుపాడు, మిట్టపాలెం, పెదపాలెం, చామర్రు, అచ్చంపేట, నీలేశ్వరపాలెం, తాళ్లచెరువు, చింతపల్లి, కోగంటివారిపాలెం, క్రోసూరు మండలంలోని అనంతవరం అగ్రహారం, క్రోసూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం, పారుపల్లి, పీసపాడు, అందుకూరు, బాలెమర్రు, ఉయ్యందన గ్రామాలు ఏపీసీఆర్‌డీలోకి వచ్చాయి.

సీఆర్‌డీఏ ప్రస్తానం..

2014లో ఏపీసీఆర్‌డీఏ ఏర్పడింది. గుంటూరు, ఏలూరు, ఎన్‌టీఆర్, కృష్ణ, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని గ్రామాలు, పట్టణాలతో దీని కూర్పు జరిగింది. అంతకుముందు ఉన్న వీజీటీఎం ఉడాని రద్దు చేసి పరిధిని పెంచి సీఆర్‌డీఏని అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో జోన్లను కూడా ఏర్పరిచింది. అవుటర్ రింగురోడ్డుని కూడా ఎలైన్‌మెంట్ చేసి నిర్మాణం చేపట్టే సమయంలో ఎన్నికలు జరిగి 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే జీఎన్ రావు కమిటీ అని ఏర్పాటు చేసి మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. అందుకు అనుగుణంగా 2020లో ఏపీసీఆర్‌డీఏ బిల్లుని రద్దు చేసింది. దీనిపై అమరావతి రాజధాని పరిరక్షణ సమితి రైతులు ఉద్యమించారు. హైకోర్టు, సుప్రీం కోర్టులో కేసులు వేసి పోరాడారు. ప్రభుత్వ నిర్ణయంపై హైకోర్టు స్టే విధించింది. అంతేకాకుండా ఏపీసీఆర్‌డీఏ చట్టం రద్దు చెల్లదని తీర్పు ఇచ్చింది. దాంతో వైసీపీ ప్రభుత్వం 2021లో సీఆర్‌డీఏ చట్టాన్ని పునరుద్ధరించింది. అయితే అప్పటి నుంచి ఎలాంటి అభివృద్ధి చర్యలు చేపట్టకపోగా మరోవైపు సుప్రీం కోర్టులో రివిజన్ పిటీషన్ దాఖలు చేసింది.

ఆ మండలాలకు మహర్దశే

కూటమి ప్రభుత్వంలో రాజధాని నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడంతో పాటు కేంద్రం నుంచి నిధులు కూడా పెద్ద ఎత్తున వస్తున్నాయి. దీంతో రాజధాని ప్రాంతంలో వివిధ పనులు చకాచకా జరుగుతున్న సంగతి తెలిసిందే. సీఆర్‌డీఏ పరిధిలో పలు ప్రాజెక్టులు భవిష్యత్తులో క్యూ కట్టనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో పలు గ్రామాలు సీఆర్‌డీఏలోకి వెళ్లాయి. దీంతో ఆయా గ్రామాల్లో కూడా ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయని అక్కడి ప్రజలు భావిస్తూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది

వేమూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలను తిరిగి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆనందాన్ని ఇచ్చింది. గత ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి కేవలం కక్షసాధింపే అజెండాగా తీసుకున్న తలాతోక లేని నిర్ణయాల వల్లే ఈ పరిస్థితి తలెత్తింది. ఆ చీకటి నిర్ణయాలను సరిదిద్దే దిశగానే తిరిగి సీఆర్‌డీఏ పరిధిని కూటమి ప్రభుత్వం విస్తరించింది.

\- నక్కా ఆనంద్‌బాబు, వేమూరు ఎమ్మెల్యే

తగ్గిన పూడా పరిధి

పల్నాడు జిల్లాలోని ఆరు మండలాలు, సత్తెనపల్లి మున్సిపాల్టీని సీఆర్‌డీఏలో విలీనం చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానంతో పల్నాడు అర్బన్ డవలప్‌మెంట్ అథార్టీ(పూడా) పరిధిని తగ్గింది. పల్నాడు జిల్లాలోని 28 మండలాలతో పూడాను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 22 మండలాలకు పూడా పరిధిని కుదించారు. సత్తెనపల్లి, పెదకూరపాడు, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, యడ్లపాడు మండలాలను పూడా నుంచి తొలగించి సీఆర్‌డీఏ పరిధిలోకి తీసుకున్నారు. దీంతో పూడా రూపురేఖలు మారిపోయాయి. నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల మునిసిపాలిటీలు, గురజాల, దాచేపల్లి నగర పంచాయతీలకే పూడాకు పరిమితమైంది.

దశ, దిశలేని బావుడా

కేవలం ఓ నామినేటెడ్ పోస్టు సృష్టించడం కోసమే ఆదరాబాదరాగా గత వైసీపీ ప్రభుత్వం బావుడా ఏర్పాటు చేసిందనే విమర్శలున్నాయి. బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాలతో పాటు ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదనందిపాడు, కాకుమాను మండలాలను కూడా బావుడా పరిధిలోకి తెచ్చింది. చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాలు ఒంగోలు కేంద్రంగా ఉన్న ఉడా పరిధిలో ఉన్నాయి. దీంతో జిల్లాలో ఉన్న ఆరు నియోజకవర్గాల్లో మూడు అటు, మూడు ఇటు ఉన్నాయి. ఇక సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న వేమూరు నియోజకవర్గాన్ని తీసుకొచ్చి బావుడాలో అయితే విలీనం చేసింది తప్ప అభివృద్ధి విషయంలో ఓ దశ, దిశ చూపడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. తమ ప్రాంతం సీఆర్‌డీఏలోకి వెళ్లగా అభివృద్ధిపై గంపెడాశలతో ఉండగా వారి ఆశలను కాలరాస్తు వైసీపీ ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందనేది అక్కడి ప్రజల అభిప్రాయం.

ఇంటర్ విద్యలో సమూల మార్పులు

● వచ్చే ఏడాది నుంచి మండలానికో జూనియర్ కళాశాల

● భారీ అడ్మిషన్లు పెంచడమే లక్ష్యంగా ప్రణాళిక

● ఇంటర్ కళాశాలల్లో ఎంసెట్, జేఈఈఈ, నీట్ పరీక్షలకు శిక్షణ

● ఈ ఏడాది ఇప్పటికే ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పంపిణీ

వృత్తి విద్యాకళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేకంగా బ్రిడ్జి కోర్సులో శిక్షణ ఇచ్చి ఎంసెట్, జేఈఈ , నీట్ పరీక్షలకు సిద్ధం చేసేలా ఏర్పాట్లు చేస్తారు. విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటిరియల్, పుస్తకాలు ఎన్‌సీఆర్‌టీ నుంచి సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటారు.

ఆర్థిక ఇబ్బందులతో శిక్షణకు దూరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధిక మంది పేద,బడుగు బలహీనవర్గాల విద్యార్థులే. వారికి పది స్థాయిలో మంచి మార్కులు వచ్చినా కార్పొరేట్/ప్రైవేటు కళాశాలల్లో చదివే స్తోమత లేక ప్రభుత్వ కళాశాల్ని ఆశ్రయిస్తున్నారు. ఇంటర్ స్థాయిలో కూడా మంచి మార్కులు సాధిస్తున్నా జాతీయ స్థాయి శిక్షణ తీసుకోలేక పోతున్నారు. ఇంటర్ పరీక్షలు ముగిసిన తరువాత ఎంసెట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ , నీట్ కోసం రూ. 10వేల నుంచి రూ. 20వేల వరకు ఫాస్ట్‌ట్రాక్ శిక్షణ కోసం వెచ్చించాల్సి వస్తోంది. ఇంత మొత్తం వెచ్చించలేక పేద విద్యార్థులు ఇటువంటి శిక్షణకు దూరమౌతున్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఇచ్చే శిక్షణ వారికి ఎంతో ఉపయోగ పడనుంది.

పోటీ పరీక్షలకు ఎంపిక ఇలా...

ఇంటర్ చదివే విద్యార్థులకు జాతీయ స్థాయి పోటీ పరీక్షలైన నీట్, జేఈఈ శిక్షణ కోసం ప్రత్యేక పోటీ పరీక్ష నిర్వహించనున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలోనే ఈ పరీక్ష నిర్వహించి విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ విద్యార్థులకు ప్రముఖ కార్పొరేట్ సంస్థ నారాయణ కళాశాల సహకారంతో శిక్షణ ఇవ్వనున్నారు. ఆ కళాశాలలు రూపొందించి మెటీరియల్‌తో పాటు అనేక మాక్ టెస్టులు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాలల్లోనే దశల వారీగా శిక్షణ ఇచ్చి పరీక్షలకు సన్నద్ధం చేస్తారు. ఇదిలా ఉంటే జాతీయస్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థుల్ని సిద్ధం చేసేందుకు అవసరమైన విధి విధానాలు ఇంకా రాలేదని, సంక్రాంతి సెలవుల తరువాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇంటర్ బోర్డు అధికారులు చెబుతున్నారు.

8 వరకు అభ్యంతరాల స్వీకరణ

ఒంగోలు విద్య, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా నిర్వహిస్తున్న 38 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి సంబంధించి ప్రాథమిక మెరిట్ జాబితా వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు డీఈవో కార్యాలయం, సమగ్ర శిక్ష కార్యాలయం నోటీసు బోర్డుల్లో ఉంచినట్లు పేర్కొన్నారు.



జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించిన డీవైఈవో రవీంద్ర భారతి, నిర్వాహకులు

రాష్ట్రస్థాయి అండర్-14 అథ్లెటిక్స్ విజేతలు

ఉంగుటూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం హైస్కూలులో బుధవారం 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అండర్-14, 17 అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. తాడేపల్లిగూడెం డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్ర భారతి పోటీలను ప్రారంభించారు. విజేతల వివరాలను పోటీల పరిశీలకుడు ప్రసాద రెడ్డి, ఆర్గనైజర్, హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు ప్రకటించారు. బాలికల విభాగం హైజంప్‌లో విశాఖ జిల్లాకు చెందిన బి.ఇషానా ప్రథమ స్థానం పొందగా భావన (తూర్పుగోదావరి) ద్వితీయస్థానం, కే.లక్ష్మీ ప్రియ (చిత్తూరు) తృతీయస్థానంలో నిలిచారు. లాంగ్ జంప్‌లో జి.కొండలలక్ష్మీ (తూర్పు గోదావరి) ప్రథమ, ఎం.రిషిత (కర్నూల్) ద్వితీయ, పి.మానస (శ్రీకాకుళం) తృతీయస్థానం పొందారు. షాట్‌పుట్‌లో ఎం.కరిష్మా (గుంటూరు)ప్రథమ, పి, రితిక (నెల్లూరు) ద్వితీయ, డి.లాస్య (చిత్తూరు) తృతీయ స్థానం పొందారు.బాలురు అండర్-14 విభాగం హైజంప్‌లో వి.రాఘవేంద్ర (విజయనగరం)ప్రథమ డి.రహీం (ప్రకాశం) ద్వితీయ, కే.రాఘవేంద్ర(వైస్సార్ కడప) తృతీయ స్థానం పొందారు. లాంగ్ జంప్‌లో ఎం.పెంచల్ బాబు (కడప) ప్రథమ, పి.రాజేష్ (విశాఖపట్నం) ద్వితీయ, డి.వెంకటేష్ (ప్రకాశం) తృతీయ స్థానం పొందారు. షాట్‌పుట్‌లో జి.చంద్రశేఖర నాయుడు (విశాఖపట్నం)ప్రథమ, బి.భరత్ చంద్ర (శ్రీకాకుళం) ద్వితీయ, వి.గణేష్ (శ్రీకాకుళం)తృతీయ స్థానం సాధించారు. డిస్కత్రోలో జి.చంద్రశేఖర నాయుడు (విశాఖ) ప్రథమ బి.వెంకటేష్ (కర్నూలు)ద్వితీయ, టి.విన్సెంట్ (ప్రకాశం) తృతీయ స్థానం పొందారు.

డీసీసీబీలో విచారణ ప్రారంభం

» పలు ఫైళ్లు పరిశీలించిన కలెక్టర్

» నియమించిన త్రిసభ్య కమిటీ

» రాఘవయ్యకు ఇన్‌చార్జీ సీఈవోగా బాధ్యతలు

ఒంగోలు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో అవినీతి, అక్రమాలపై ప్రాథమిక విచారణ ప్రారంభమైంది. ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇందుకోసం నియమించిన ముగ్గురు అధికారుల కమిటీ బుధవారం సాయంత్రం బ్యాంకు ప్రధాన కార్యాలయంలో విచారణ ప్రారంభించారు. బ్యాంకులో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వ స్థాయిలో కదలిక వచ్చిన నేపథ్యంలో ప్రాథమికంగా ముగ్గురు సభ్యుల కమిటీ విచారణ ప్రారంభించింది. బ్యాంకులో విచారణ సజావుగా సాగేందుకు సీఈవో కోటిరెడ్డిని బాధ్యతల నుంచి తప్పించారు. అలాగే అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ కోసం సెక్షన్ 51 విచారణ చేయించాలని ప్రభుత్వాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరిన నేపథ్యంలో కొంత ఆలస్యంగా అయినా తదనుగుణ చర్యలు జరుగుతున్నాయి. ఈక్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటివరకు సీఈవోగా ఉన్న కోటిరెడ్డి మంగళవారం రాత్రి ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. రాజీనామా లేఖను బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి అయిన జేసీ గోపాలకృష్ణకు అందజేశారు. దీంతో ప్రస్తుతం బ్యాంకు జనరల్ మేనేజర్ (జీఎం)గా ఉన్న కుంభా రాఘవయ్యకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ముగ్గురు అధికారులతో విచారణ

మరోవైపు కలెక్టర్ తన లేఖలో కోరిన సెక్షన్ 51 విచారణవైపు ప్రభుత్వం మొగ్గుచూపినట్లు సమాచారం. అందుకు వీలుగా ఉన్నతాధికారులు ప్రాథమిక నివేదిక ఇవ్వాలని కోరారు. సాధారణంగా అలాంటి నివేదికు జిల్లా సహకారశాఖ అధికారులు ఇస్తారు. అయితే బ్యాంకు సంబంధించిన వ్యవహారంలో ఇక్కడి సహకారశాఖ అధికారులు తనను తప్పుదోవ పట్టించారన్న ఆగ్రహంతో కలెక్టర్ ఉన్నారు. మరోసారి ప్రాథమిక విచారణ బాధ్యతను వారికి ఇస్తే ప్రమాదంగా భావించి ముగ్గురు అధికారులతో ప్రత్యేక కమిటీని నియమించారు. రెవెన్యూలో డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారైన లోకేశ్వరరావు నేతృత్వంలో జిల్లా ఆడిట్ అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్(ఎల్‌డీఎం) సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు.

ఫైళ్లను పరిశీలించిన కమిటీ

ప్రభుత్వానికి గతంలో అందిన ఫిర్యాదులతోపాటు తాజాగా మరికొన్ని ఆర్థికపరమైన అవకతవకలు కూడా కలెక్టర్ దృష్టికి రావడంతో వాటన్నింటిని పరిశీలించాలని సూచించారు. తదనుగుణంగా లోకేశ్వరరావు నేతృత్వంలోని ముగ్గురు కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం డీసీసీబీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పలు ఫైళ్లను పరిశీలించారు. ఇదిలా ఉండగా పర్సన్ ఇన్‌చార్జీ అయిన జేసీ గోపాలకృష్ణ బుధవారం మధ్యాహ్నం బ్యాంకుకు వెళ్లి ఒకరిద్దరు కీలక అధికారులను పిలిచి గతంలో బ్యాంకులో జరిగిన బంగారు రుణాల అక్రమాలు, అప్పట్లో జరిగిన అవకతవకలు, విచారణలు, తదనంతర చర్యలు ఇతరత్రా అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం.

ఆర్డీవో తనిఖీ

ఇంకొల్లు, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కొణికి రోడ్డులోని భూమిని పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిలిచిన పారిశుధ్య పనులు

» ఎక్కడి చెత్త అక్కడే

ఇంకొల్లు, నవంబరు 6, (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్మికులు రెండ్రోజులుగా విధులను నిలిపివేశారు. నాలుగు నెలలుగా జీతాలు అందకపోవడం తో పనులు నిలిపివేసినట్లు వారు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే అందజేయాలని అధికారులకు విన్నవించినట్లు చెప్పారు. పారిశుధ్య పనులు లేకపోవడంతో వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే కన్పిస్తోంది. అధికారులు స్పందించి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఏవోగా రామ్మోహన్ రెడ్డి

పర్చూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయాధికారిగా ఎస్.రామ్మోహన్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎండీఏ ఎస్.మోహనరావు తెలిపారు. గత ఏడాది ఎన్ఎఫ్ఎస్ఎం (జాతీయ ఆహార భద్రతా మిషన్) కింద సబ్సిడీ శనగల నిధులు దుర్వినియోగం అయిన నేపథ్యంలో ఏవోను బాధ్యులను చేస్తూ అధికారులు ఆయన్ని సస్పెండ్ చేశారు. తిరిగి ఆ నిధులను ఏవో చెల్లించిన నేపథ్యంలో పర్చూరు ఏవోగా కమిషనర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నియమించినట్లు ఏడీఏ తెలిపారు.

దొంగలు బాబోయ్.. దొంగలు

» గ్రామాల్లో వ్యవసాయ మోటార్‌లు, పట్టణాల్లో ఇళ్లల్లో చోరీలు
» తాళం వేసి ఉంటే అంతే
» ఇంట్లో మనుషులున్నా డోంట్ కేర్
» ఆర్టీసీ బస్టాండ్‌నూ వదలని వైనం
» గస్తీపై దృష్టి సారించని పోలీసులు



అద్దంకిలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో చోరీ జరిగిన బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో చెల్లాచెదరుగా ఉన్న వస్తువులు (ఫైల్)

అద్దంకి, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలు ఇటీవల వరకు విన్న మాట... ఇప్పుడు అలా కాదు.. ఇంటి లోపల తలుపు వేసుకొని నిద్రిస్తున్నా దొంగలు డోంట్ కేర్ అన్న విధంగా వ్యవహరిస్తూ చోరీలకు పాల్పడుతుండడం ప్రజలను బెంబేలెత్తిస్తోంది. ఇటీవల అద్దంకి ప్రాంతంలో దొంగతనాలు బాగా పెరిగాయి. పట్టణంలో తరచూ చోరీలు జరుగుతూనే ఉన్నాయి. ఇక చోరీకి యత్నాలు అయితే మరింత ఎక్కువగా జరుగుతున్నాయి. ఐదారు నెలల కిందట అద్దంకి పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీ రోడ్డులో ఓ బ్యాంక్ ఉద్యోగి కుటుంబం ఊరికి వెళ్లింది. యువకుడు ఒక్కడే వచ్చి చోరీకి పాల్పడ్డాడు. పెద్ద మొత్తంలో బంగారం అపహరణకు గురైంది. దొంగతనానికి వచ్చిన యువకుడి కదలికలు మొత్తం సమీపంలో ఉన్న పలు సీసీ కెమెరాలలో క్లియర్‌గా నమోదైంది. అయితే ఇంత వరకు అతీ గతీ లేదు. సదరు బ్యాంక్ ఉద్యోగి కలవని ప్రజా ప్రతినిధి, పోలీస్ అధికారి లేరు. అయితే ఇంత వరకు దొంగ దొరకలేదు. ఆ తరువాత పట్టణం నడిబొడ్డున మున్సిపల్ కార్యాలయం సమీపంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఇక కాకానిపాలెంలో రెండు ఇళ్లల్లో చోరీ జరగ్గా దొంగలు దొరికారు. నెలరోజుల కిందట ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల వెనుక వైపు 6 ఇళ్లల్లో నిద్రిస్తుండగానే చోరీకి ప్రయత్నాలు జరిగాయి. శ్రీనగర్, సాయినగర్‌లలో కూడా రెండు నెలల కిందట దొంగనాలు జరిగాయి. ఎల్‌ఈఎఫ్ నగర్‌లో తాళ్లూరు ఎంఈవో సుబ్బయ్య దంపతులు ఇంట్లో నిద్రిస్తుండగానే చోరీ జరిగింది. ఇక వేలమూరిపాడు రోడ్డులో ఆంజనేయస్వామి దేవాలయం హుండీ తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. అదే ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో బంగారం గొలుసును మోటార్‌సైకిల్‌పై వచ్చిన యువకుడు లాక్కొని వెళ్లాడు. ఇది మరవకముందే ఆర్టీసీ బస్టాండ్ బస్సు ఎక్కే మహిళ హ్యాండ్ బ్యాగ్‌లో బంగారం గొలుసును అపహరించారు. బస్టాండ్‌లో గతంలో పలు సార్లు చోరీలు జరిగాయి. బ్యాంక్‌ల నుంచి రైతులు నగదు డ్రా చేసి తీసుకు వెళ్లడాన్ని గుర్తించి అగంతకులు చోరీలకు పాల్పడుతున్నారు. ఇక గ్రామాలలోని పొలాలలో వ్యవసాయ మోటార్‌ల కేబుల్ వైర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పగులగొట్టి కాపర్ వైరు అపహరణ తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇక వెలుగులోకి రాని చిల్లర దొంగతనాలు ఎన్నో చెప్పలేం. ఒక వైపు దొంగతనాలను అరికట్టాల్సి ఉండగా, చోరీ సొత్తు రికవరీ కూడా పోలీస్‌లకు సవాల్‌గా మారింది. గతంలో కూడా ఇదే తరహావి జరగగా పగలు, రాత్రి సమయాలలో గస్తీ పెంచడం, బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా వంటి చర్యలతో కొంత మేర తగ్గాయి. అయితే మరలా పోలీస్ నిఘా తగ్గడంతో దొంగలు మరింత రెచ్చి పోతున్నారు. ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి రాత్రి సమయాలలో గస్తీ పెంచాలని, అదే సమయంలో పగలు సమయంలో బ్యాంక్‌లు, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద పోలీసులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సొత్తు రికవరీపై కూడా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని బాధితులు అభిప్రాయపడుతున్నారు.



ఎల్‌ఈఎఫ్ నగర్‌లో ఎంఈవో సుబ్బయ్య ఇంట్లో తెరిచి ఉన్న బీరువా (ఫైల్)



భద్రతావారోత్సవాలలో పాల్గొన్న తనిఖీ టీం, కార్మికులు

భద్రత పాటించే క్వారీలకు గుర్తింపు

బల్లికురవ, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : క్వారీలలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టిన వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తనిఖీ బృందాల కన్వీనర్ సత్యసుధీర్, శివనారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని వీర్ల కొండ వద్ద శ్రీశ్రీనివాస, సత్యకృష్ణ, లక్ష్మీ, నరసింహారావు గ్రానైట్ క్వారీలలో భద్రత వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తనిఖీ బృందాలు క్వారీలలో పనులు చేస్తున్న కార్మికులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రతి ఏటా భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్న క్వారీలకు బహుమతులను అందజేస్తారని వారు తెలిపారు. కార్మికులు పని చేసే ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో క్వారీల మేనేజర్లు, ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

రాయితీ శనగ విత్తనాల పంపిణీ



సబ్సిడీ శనగ విత్తన పంపిణీ చేస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : : సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ ప్రారంభించినట్లు ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. రబీలో సాగుచేసే శనగకు 25 శాతం సబ్సిడీపై విత్తనాలు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. జేజే రకం క్వింటా పూర్తి ఖరీదు రూ-9400, కాగా సబ్సిడీ పోను రూ.7050కు, కాక్-2 రకం రూ.12100, సబ్సిడీపోను రూ.9075 ఇస్తున్నట్లు తెలిపారు. రైతు సేవా కేంద్రాలలో ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్‌ను అందజేసి రైతులు విత్తనాలను పొందవచ్చని తెలిపారు. కోటపాడు రైతు సేవా కేంద్రంలో బుధవారం సబ్సిడీ శనగ విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఏవో ప్రారంభించారు.

బల్లికురవ : రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై శనగ విత్తనాలను అందజేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి కుమారి తెలిపారు. బుధవారం మండలంలోని కొణిదెన, రాజుపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. 25 శాతం సబ్సిడీపై జేజీ 11 రకం శనగ విత్తనాలను సబ్సిడీ పోను రైతులకు క్వింటా రూ.7050కి, కాక్ 2 రూ.9075కి వస్తుందన్నారు. అవసరమైనవారు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, మార్కెటింగ్ ప్రతినిధి సురేష్, ఎంపీఈవో గుణశేఖర్ పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు రగ్గుల పంపిణీ



వృద్ధులకు రగ్గులను అందజేస్తున్న చెంచులక్ష్మి

పంగులూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంగులూరులో నూర్‌బాషాల వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు రగ్గుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని క్విజ్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు నిడమానూరి నాగేశ్వరరావు సతీమణి చెంచులక్ష్మి, ఆమె సోదరుడు జడ్పీటీసీ మాజీ సభ్యుడు బాచిన చెంచుప్రసాద్, శేషకుమారి దంపతులతో కలసి బుధవారం పంగులూరుకు చెందిన 57 మంది నూర్‌బాషా మహిళలకు 30 వేల విలువ చేసే రగ్గులను పంపిణీ చేశారు. పంగులూరులోని వారి నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో నూర్‌బాషా ప్రతినిధులు నందవరపు రామాంజనేయులు, వీరాంజనేయులు, పోతుగంటి అజీషా, పీర్‌సాహెబ్, నూర్‌బాషా మహిళలు పాల్గొన్నారు

యుద్ధప్రాతిపదికన సిమెంట్ స్తంభాల ఏర్పాటు



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పర్చూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వందల మంది ప్రయాణికులు, ప్రజలతో రద్దీగా ఉండే పర్చూరు బొమ్మల సెంటర్ కూడలిలో హైటెన్షన్ విద్యుత్ వైర్లతో ఉన్న ఇనుప కరంట్ పోల్ కూలేందుకు సిద్ధం ఉంది. దీనికి తోడు వైర్లు సైతం వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతిలో వార్త వెలువడింది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఏడీఈ రమేష్, ఏఈ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం యుద్ధప్రాతిపతికన దెబ్బతిన్న ఇనుప స్తంభం స్థానంలో కొత్త సిమెంట్ పోల్‌ను ఏర్పాటు చేయడంతోపాటు తీగలను మార్చారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు ఉమ్మడి ప్రకాశంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

ముందస్తు సమాచారంతో జాగ్రత్త పడుతున్న స్కూళ్ల యాజమాన్యం

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి పర్యటన చేయనున్నారు. ఈమేరకు సంబంధిత విద్యాశాఖ కార్యాలయాలకు ముందస్తు సమాచారం అందింది. వాస్తవానికి ఆయన బుధవారమే ఉమ్మడి ప్రకాశంలోకి ప్రవేసించాల్సి ఉండగా, బాపట్ల డివిజన్ పరిధిలోనే మధ్యాహ్నం వరకు పర్యటన సాగింది. ఈక్రమంలో గురువారానికి పర్యటన మారింది. నేటి ఆయన పర్యటన అపహాస్యంగా మారిందనడంలో సందేహం లేదు. చైర్మన్ వస్తున్నారని, మధ్యాహ్న భోజనం, రైస్ నిల్వల రికార్డులను పరిశీలిస్తారని, జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అధికారుల నుంచి ఇప్పటికే సమాచారం చేరింది. పైగా నేడు చీరాల పరిధిలోని వాడరేవు జిల్లా పరిషత్ స్కూల్, పేరాల ఏఆర్ఎం స్కూల్, ఏపీ మోడల్ స్కూల్ పర్యటన ఉంటుందని పక్కా సమాచారాన్ని జిల్లా అధికారులు స్థానిక అధికారులకు చేర వేశారు. ఈక్రమంలో ఆస్కూళ్లతో పాటు ఇతర స్కూల్స్ వారు కూడా ఎందుకొచ్చిందిలే తంటా అంటూ ఇప్పటి వరకు ఒంటికి శ్రమ ఎరుగని కొందరు రాత్రికి రాత్రే పాఠశాల పరిస్థితులపై దృష్టిసారించి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చైర్మన్ పర్యటన ముగిశాక ఎప్పటిలాగే ఇష్టారీతిగా తమ వక్ర బుద్ధి చూపుతారని అందరూ చర్చించుకుంటున్నారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న తెలుగునాడు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించండి

మంత్రి సంధ్యారాణికి వినతి

అద్దంకిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర సచివాలయంలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర నాయకులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రధానంగా అంగన్‌వాడీలకు కనీస వేతనాన్ని అమలు చేయాలని, సెంటర్ల నిర్వహణ భారంగా ఉన్న 4 యాప్‌లను కలిపి ఒకే యాప్ చేయాలని, అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం వర్తింపజేయాలని, వీఆర్ఎస్ తీసుకోవాడానికి అవకాశం కల్పించాలని, ఉద్యోగ విరమణ తరువాత జీతంలో కొంత భాగం పెన్షన్‌గా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అసెంబ్లీ సమావేశాలల్లో ముఖ్యమంత్రి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ, కోశాధికారి కొడాలి హేమలత, ఉపాధ్యక్షురాలు రత్నశ్రీ, కాత్యాయని, సరిత, కోకిల, రాష్ట్ర మహిళ నాయకురాలు బొప్పన నీరజ ఉన్నారు.

విద్యార్థులకు భగవద్గీత పుస్తకాల పంపిణీ

అద్దంకిటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టీటీడీ కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మానవులందరికీ భగవద్గీత పుస్తకాలను హెచ్ఎం డోలా పద్మావతి, విద్వాన్ జ్యోతిచంద్రమౌళి చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. భగవద్గీత చదవడం ఎంతో ఉపయోగకరమని, తప్పు చేసిన వారు ఎవరైనా వారిని విభేదించాలని, ఎదురించాలని చెప్పేదే భగవద్గీత అన్నారు. 350 మంది విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆకుచుట్టు పురుగు నివారణకు చర్యలు



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో

పంగులూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సాగులో ఉన్న వరి పైరుకు ఆకుచుట్టు పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎ.ఓ. సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరికి ఆశించిన ఆకుచుట్టు పురుగు నివారణకు క్లోర్‌ఫైరిపాస్ 50 శాతం ఈసీ, సైపర్‌మైత్రిన్ 5శాతం ఈసీ కలిపి పంటపై పిచికారీ చేయాలన్నారు. అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించాలని, తెగుళ్ల నివారణకు కార్బోఫ్యూరాన్, ఫోరేట్ గుళికలను ఉపయోగించవద్దని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బత్తుల వెంకటరావు, నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు సిలాషి, అక్షరణి, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగుపై అప్రమత్తం

అద్దంకిటౌన్ : మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు కత్తెర పురుగుపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం అద్దంకిలోని దామావారిపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగం గా మొక్కజొన్నను పరిశీలించారు. కత్తెర పురుగు అక్కడక్కడా పంటను నష్ట చేసిందని, దీని నివారణకు ఇమామెక్టన్ బెంజోయేట్ 5శాతం, ఎస్‌జీ 0.5 ఎంఎల్, లేదా స్పైనోశాడ్ 45శాతం, ఎస్‌సీ 0.3 ఎంఎల్ లీటర్ నీటితో పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాలడుగు శేషారావు, ఏఈవో కోటేశ్వరరావు, దామా శ్రీనివాసరావు, వెంకటరావు, రైతులు పాల్గొన్నారు.

పంట బీమాతో ప్రయోజనం

ఇంకొల్లు : పంట బీమాతో రైతులకు ప్రయోజనమని వ్యవసాయాధికారి వేణుగోపాల్ సూచించారు. మండలంలోని గంగవరంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. విత్తనశుద్ధి చేసుకొని శనగలు ఎదపెట్టుకోవాలని సూచించారు. పత్తి, మిరప సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

పోటీలతో సృజనాత్మకత పెంపు

డీఈవో పురుషోత్తం

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు నిర్వహించే పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని డీఈవో ఎస్.పురుషోత్తం పేర్కొన్నారు. భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న కౌశల్ -2024 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభానేష్వణ పోటీల పోస్టర్‌ను డీఈవో ఆవిష్కరించారు. స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో నిర్వహించినకార్యక్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల 8,9,10 తరగతి విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్‌లో పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఏఎంవో మోజెస్, పూర్ణచంద్రరావు, మహ్మద్ సాధిక్, పవని భాను చంద్రమూర్తి, సంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అర్హ పత్రాన్ని అందిస్తున్న ప్రతినిధులు

జాబ్ మేళాలో 37 మందికి ఉద్యోగాలు

చీరాలటౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం ఎస్‌కేబీఎన్ఎం ఐటీఐ కలాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాలో 37మంది ఉద్యోగాలను సాధించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 68 మంది నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా, ప్రముఖ కంపెనీలైన అమర రాజా బ్యాటరీస్, రాయల్ మెరైన్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్, శ్రీరామ్ లైఫ్ ఇన్స్యూరెన్స్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. దీంతో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ప్రతినిధులు అర్హత పత్రాలను అదించారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ సత్తార్, జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్, హారిక, సౌగంధి, ఎం.హారిక, వినోద్, ఇతర కళాశాలల సిబ్బంది, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న ఏపీవో లక్ష్మీదేవి


చినగంజాం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పతకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఏపీఎం జె.లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని చింతగుంపల్లి, మోటుపల్లి, మున్నంవారిపాలెం, నీలాయపాలెం గ్రామాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనుల గుర్తింపునకు, వాటి అంచనాల కోసం బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కూలీలలో జాబ్ కార్డు లేని వారికి జా బ్ కార్డు అందజేస్తామని ఏపీవో తెలిపారు. గ్రామసభలలో గుర్తించిన పనులను చదివి వినించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు యార్లగడ్డ సత్యనారాయణ, వడ్లమూడి సాంబశివరావు, ఆయా గ్రామాల గ్రామ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కచ్చితంగా ప్రతి ఒక్క నిరుపేదకూ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషి చేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు గంజి పురుషోత్తం, ఆర్‌బి నాగకుమార్, అన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెం స్ట్రయిట్ కట్, స్వర్ణరోడ్డులోని యానాది కాలనీలో డీబీఆర్‌సీ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 15 రకాల నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా సంస్థ ప్రతినిధి భగవాన్‌దాస్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధార్, రేషన్ కార్డులను పొంది ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌వో వీరబాబు, సంజీవకుమార్, వెంకటేశ్వరరెడ్డి, బ్రహ్మయ్య, కాలనీ వాసులు పాల్గొన్నారు.



'సోమశిల'కు తగ్గిన వరద


అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. మంగళవారం 10,929 క్యూసెక్కులు వస్తుండగా బుధవారానికి 8,539 క్యూసెక్కులకు చేరింది. ఇక డ్యాంలో 69.856 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 2,100, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 700, దక్షిణ కాలువకు 400 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

● **కండలేరు నీటిమట్టం :** రాపూరు : కండలేరు డ్యాం నీటిమట్టం 48 టీఎంసీలకు చేరింది. ఇన్ ఫ్లో ఏమిలేకపోగా అవుట్ ఫ్లో 1,265 క్యూసెక్కులు ఉందని కండలేరు డ్యాం ఏఈఈ తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఊరూరా బెల్టు కిక్కు

బరితెగించి.. బెల్టు తీసి!

చైన్ లింకుల్లా మద్యం దుకాణాలు



వేలం వేసి మరీ...

అనంతసాగరం మండలంలో 3 లైసెన్స్ మద్యం షాపులు ఉండగా, వీటికి అనుబంధంగా బెల్టు షాపులు వెలిశాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ మద్యం పుష్కలంగా దొరుకుతోంది. పీకేపాడు, పాతదేవరాయపల్లి, ముస్తాపురం, పాతాళపల్లి తదితర గ్రామాల్లో బెల్టు నిర్వహణ కోసం వేలం పాట నిర్వహించినట్లు సమాచారం. త్వరగా తమ పెట్టుబడులు రాబట్టుకోవాలన్న ఉద్దేశంతో మద్యం షాపుల యజమానులు బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. రూ.50 వేల నుంచి లక్ష వరకు వసూలు చేసి మరీ విచ్చలవిడిగా మద్యం సరఫరా చేస్తున్నారు.

- అనంతసాగరం (ఆంధ్రజ్యోతి)

ఎమ్మార్పీ కంటే ఎక్కువే

మండల కేంద్రమైన వరికుంటపాడులో అధికారికంగా మద్యం దుకాణం లేదు. దీంతో ఇతర ప్రాంతానికి చెందిన దుకాణదారులు అక్కడ ఓ మనిషి ద్వారా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. కొంతమంది స్థానికంగా అమ్మకాలు జరుపుతుంటే, ఇంకొంతమంది ఆటోలు, బైకులపై సరఫరా చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. దుకాణదారులు ఒక్కో సీసాపై రూ.30 అదనంగా ధర నిర్ణయించగా మిగిలిన వారు రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. ఇస్కపల్లి, కాంచెరువు, గువ్వాడి, తూర్పుబోయమడగల, తిమ్మారెడ్డిపల్లి, తూర్పుకొండారెడ్డిపల్లి, తూర్పురొంపిదొడ్ల, గణేశ్వరాపురం, నారసింహాపురం, విరువూరు, పెద్దిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోనూ బెల్టు షాపులు విచ్చలవిడిగా వెలిశాయి.

- వరికుంటపాడు (ఆంధ్రజ్యోతి)

> 'బెల్టు షాపులు తెరిస్తే తాట తీస్తా!'
> ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన హెచ్చరిక ఇది. అయితే, ఈ హెచ్చరిక అటు అధికారులకు, ఇటు మద్యం వ్యాపారులకు చెవికెక్కినట్టులేదు. వైసీపీ పాలనలో కేవలం బెల్టుషాపులు మాత్రమే ఉంటే కూటమి పాలనలో బెల్టుకు బెల్టుషాపులు వెలుస్తున్నాయి. వెరసి జిల్లావ్యాప్తంగా కిరాణా కొట్లు, టీ దుకాణాలు, కూల్ డ్రింక్ షాపులు.. ఇలా ప్రతి దుకాణంలోనూ నిత్యావసరాలకన్నా మద్యం సీసాలు విచ్చలవిడిగా దొరుకుతున్నాయి. ఆంధ్రజ్యోతి బృందం జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో పరిశీలించగా ఈ విషయం వెలుగుచూసింది.
> - నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

మద్యం వ్యాపారంతో ప్రభుత్వాలు నడపడం అనైతికం. అని మహాత్మా గాంధీ అన్నారు. అయితే అధికారం కోసం లెక్కకు మించిన సంక్షేమ పథకాల వల్ల ప్రభుత్వాలు మందు ఆదాయం లేకపోతే ఒక్కరోజు కూడా తట్టుకోలేని స్థితికి చేరుకున్నాయి. ప్రభుత్వాల నిస్సహాయతను అలుసుగా తీసుకొని మద్యం వ్యాపారులు చెలరేగిపోతున్నారు. అధికార పార్టీ నాయకులు వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇంకేముంది బెల్టు తెరిస్తే తోలు తీస్తానన్న ముఖ్యమంత్రి హెచ్చరికలు పెద్ద జోక్‌గా మారిపోయాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా మద్యం వ్యాపారంలో అధికార పార్టీ నేతలు వేలు పెట్టడంతో ఊరికి దూరంగా ఉండాల్సిన మద్యం ఇళ్ల మధ్యలో ఉన్న కిరాణా షాపుల్లోకి చేరింది. మద్యం వ్యాపారులు, వీరి లాభాల్లో వాటాలు ఫిక్స్ చేసుకున్న రాజకీయ నాయకులు కరువున పడ్డట్టు మద్యం సీసాలను నట్టింటికి చేరుస్తున్నారు.

● **ఒకటికి 20 షాపులు**

మద్యం షాపు యజమాని తన షాపు పరిధిలో పదికి తక్కువ లేకుండా బెల్టుషాపులకు సరుకు సరఫరా చేస్తున్నాడు. గ్రామాల్లో ఎవరికి బెల్టు షాపు ఇవ్వాలో ఆ మండల రాజకీయ పార్టీ నాయకుడు నిర్ణయిస్తున్నాడు. నాయకులు చెప్పిన వారు మాత్రమే బెల్టుషాపులు తెరుస్తున్నారు. ఆ ఊరిలోని లైసెన్స్డ్ మద్యం షాపు యజమాని క్వార్టర్ మీద 10 నుంచి 20 రూపాయలు అధికంగా బెల్టు షాపునకు సప్లయ్ చేస్తున్నాడు. ఆ బెల్టు షాపు నిర్వాహకుడు తన పరిధిలోని మరో పది మందికి సరుకు సప్లయి చేసి మందు అమ్మిస్తున్నాడు. ఈ క్రమంలో టీ దుకాణాలు, కూల్‌డ్రింక్ షాపులు, కిరాణా షాపులు.. చివరికి మత్తు వ్యాపారంలో పోటీదారు అయిన కల్లు దుకాణాల్లోనూ మద్యం ఉంచి విక్రయిస్తున్నారు. ఇలా ఒక మద్యం షాపు యజమాని తన పరిధిలో బెల్టు పేరుతో 10 మందికి సరుకు సప్లయ్ చేస్తుంటే... ఆ బెల్టు నిర్వాహకుడు తన పరిధిలో మరో పది మందికి సరుకు ఇచ్చి మినీ బెల్టు షాపులు నడుపుతున్నాడు. అంటే ప్రభుత్వం ఒక మద్యం దుకాణానికి లైసెన్సు ఇస్తే, సదరు వ్యాపారి 20 దుకాణాల ద్వారా మద్యం విక్రయించుకొంటున్నాడు.

ఆంధ్రజ్యోతి పరిశీలన

వీటిపై చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు మామూళ్ల ఫిక్సేషన్‌లో బిజీగా ఉన్నారు. ఏ షాపు నుంచి ఎంత తీసుకోవాలి.. అన్ని షాపులు కలిపితే ఎంత వస్తుంది? అందులో ఏ స్థాయి అధికారి వాటా కింద ఎంత మిగులుతుంది! అని లెక్కలేసుకొంటున్నారు. మద్యం షాపు యజమానులతో మామూళ్ల విషయంలో బేరసారాలు సాగిస్తూ విధి నిర్వహణను బెల్టుషాపులకు వదిలేశారు.

ఆంధ్రజ్యోతి పరిశీలనలో..

● **ఏఎస్ పేట :** మండలంలో రెండు లైసెన్స్ దుకాణాలు ఉండగా, బెల్ట్‌షాపులు 20కిపైగా ఉన్నాయి. లైసెన్స్‌దారుల నుంచి ఒక్కో బాటిల్‌ను రూ.5-10 అదనంగా తీసుకుంటున్న బెల్టు నిర్వాహకులు రూ.20-50కి అదనంగా విక్రయిస్తున్నారు. ఇక డోర్ డెలివరీ అంటే అదనంగా వంద రూపాయల వరకు ఇచ్చుకోవాలి.

● **సంగం :** మండలంలో 20 పంచాయతీలు, 30 గ్రామాలు ఉండగా మూడు లైసెన్సు మద్యం దుకాణాలు ఉన్నాయి. బెల్టు దుకాణాలు మాత్రం గ్రామానికి 2, 3 లెక్కన సుమారు 70కిపైగా ఉన్నాయి. మండల కేంద్రమైన సంగంలో బస్టాండ్‌లో నాలుగు బెల్టుషాపులు ఉన్నాయి.

● **కలువాయి :** మండలంలో 2 మద్యం దుకాణాలు ఉండగా, అన్ని గ్రామాల్లో పోటాపోటీగా బెల్టుషాపులు ఏర్పాటు చేశారు. ఎమ్మార్పీ కంటే రూ.20 నుంచి 30 వరకు అదనంగా విక్రయిస్తున్నారు. మద్యం దుకాణ యజమానులకు అనుకూల వ్యక్తులకే బెల్టుషాపు నిర్వహణ బాధ్యతలు ఇచ్చారు.

● **కోవూరు :** మండలంలోని అన్ని గ్రామాల్లో లైసెన్స్‌దారులు బెల్టు దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి పది నుంచి ఉదయం పది గంటల వరకు క్వార్టర్ సీసాపై రూ.30 నుంచి 50లకు అదనంగా విక్రయిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్న వ్యక్తులకే బెల్టుషాపులు దక్కాయి. వీరి నుంచి లైసెన్స్‌దారులు రూ.25 వేలు వసూలు చేసినట్లు సమాచారం.

● **కావలి రూరల్ :** అధికార పార్టీ నేతల అండతో మండలంలో సుమారు 50 నుంచి 60 బెల్టు షాపులు వెలిశాయి. అంతేగాక సీసాపై అదనంగా రూ.50-70 వరకు విక్రయిస్తున్నారు.

కలిగిరి : మండలంలో మూడు అధికారిక మద్యం షాపులు ఉంటే ప్రతి గ్రామంలో 2, 3 బెల్టుషాపులు తెరుచుకున్నాయి. ఇవి లేకపోతే మద్యం విక్రయాలు అనుకున్నంత జరగవని వ్యాపారులు అంటున్నారు.

● **కొండాపురం :** మండలంలోని 19 పంచాయతీల్లో 50కిపైగా బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది.

● **జలదంకి :** గత ప్రభుత్వంలో గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయించనవారే ఇప్పుడూ అమ్ముతున్నారు. మండలవ్యాప్తంగా బెల్టు షాపులు వెలిశాయి.

● **అల్లూరు :** మండలంలో 23 బెల్టుషాపులు ఉండగా వాటికి మద్యం షాపుల నుంచి బాటిళ్లు అధిక మొత్తంలో సరఫరా అవుతున్నాయి. పల్లెల్లో సైతం మద్యం సులభతరంగా లభ్యమయ్యేలా వ్యాపారులు బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు.

● **బుచ్చిరెడ్డిపాళెం :** తలుపులు తెరిస్తే లైసెన్స్ దుకాణం, మూస్తే బెల్టు దుకాణం అన్న రీతిలో వ్యాపారులు మద్యం విక్రయాలు జరుపుతున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 10 నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం దుకాణాలు నిర్వహించాలి. అయితే కొంతమంది వ్యాపారులు దుకాణాల పక్కనే కూల్‌డ్రింక్ షాపులు ఏర్పాటు చేసి అర్ధరాత్రి తర్వాత కూడా మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఇందుకుగాను రూ.30-50 వరకు వసూలు చేస్తున్నారు.



కందుకూరులో పోటాపోటీగా..

కందుకూరు (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో మొత్తం 17 లైసెన్స్ మద్యం దుకాణాలు ఉన్నాయి. అయితే, ఆయా మండలాల పరిధిలోని వ్యాపారులు బెల్టుషాపులకు తమ దుకాణం నుంచి మద్యం సరఫరా చేస్తున్నారు. దీంతో లైసెన్స్ దుకాణదారుల మధ్య పోటీ కారణంగా ఒక్కో గ్రామంలో 3, 4 మద్యం బెల్ట్‌షాపులు కూడా వెలుస్తున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 200 వరకు బెల్ట్ దుకాణాలు ఏర్పాటైనట్లు సమాచారం. ప్రత్యేక వాహనాల్లో బెల్ట్‌షాపులకు మద్యం చేరవేసి క్వార్టర్‌కు రూ.10-15 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇక బెల్టుషాపుల్లో క్వార్టర్‌కు రూ.30 నుంచి రూ.50వరకు అదనంగా వసూలు చేస్తున్నారు.

● **తీరప్రాంతాల్లో వేలం**

తీరప్రాంత గ్రామాలలో బెల్ట్ నిర్వహణ హక్కుల కోసం గ్రామపెద్దలు వేలం నిర్వహించటం విశేషం. ఆ గ్రామాలలో బెల్ట్ దుకాణం నడిపే హక్కు ఒకరికే ఉంటుంది. ఆ హక్కును ఇద్దరు ముగ్గురు కలిసి పొందినా రెండు మూడుచోట్ల ఏర్పాటు చేసుకున్నా వారి ఆధీనంలోనే బెల్ట్‌ల నిర్వహణ జరిగాలే తప్ప మరొకరు ఏర్పాటు చేయడానికి వీల్లేదు. వేలంలో వచ్చిన సొమ్మును గ్రామపెద్దలు గ్రామాభివృద్ధికి ఉపయోగిస్తారు. ఈ నిబంధన ప్రకారం వేలంలో రూ.లక్షలకు లక్షలు వెచ్చించి బెల్ట్ హక్కులను పొందటం విశేషం. ఉలవపాడు మండలం అలగాయపాలెంలో బెల్ట్‌షాపు ఏర్పాటుకు నిర్వహించిన వేలం పాట రూ.8లక్షలు పలకగా మిగిలిన గ్రామాల్లోను ఈ మొత్తం రూ.లక్షల్లోనే ఉన్నట్లు సమాచారం.



కొనితెచ్చుకుంటున్న

కేన్సర్!!

నేటి సమాజంలో కేన్సర్ వ్యాధి మహమ్మారిలా మారుతోంది. ఎంతో మంది ప్రాణాలను కబళిస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవన శైలి, వంశపారపర్యం తదితర కారణాలతో కేన్సర్ వ్యాధి సోకుతోంది. ముఖ్యంగా ధూమపానం, మద్యంపానం, ఇన్‌స్టంట్, జంక్ ఫుడ్, కల్తీ నూనెలు, కాలుష్యం వంటి వల్ల కేన్సర్‌ను కొనితెచ్చు కుంటున్నారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశ లోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని వైద్య నిపుణులు చెబుతు న్నప్ప టికీ అవగాహన లోపంతో, సరైన వైద్యం అందక చాలా మంది వయసుతో సంబంధం లేకుండా మృత్యువుకు చేరువవుతున్నారు. ఈ నేపథ్యంలో ఏటా నవంబరు 7వ తేదీన జాతీయ కేన్సర్ అవగాహన దినం నిర్వహించాల ని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.


6

ఉచిత ఇసుకకు ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

ఇసుక తరలించే వాహనాల వద్ద రశీదు ఉండాల్సిందే

లేకుంటే ఇకపై కేసులు : కలెక్టర్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, తరలించే వాహనదారుల వద్ద కూడా రశీదు ఉండాలని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జీవో నెం.66లో మార్పులకు అనుగుణంగా నిబంధలు పాటించాలని సూచించారు. అలాగే, ఇసుక రవాణా వాహనానికి తప్పనిసరిగా జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో సైతం ఇసుక కోసం స్థానిక సచివాలయం వద్ద దరఖాస్తు చేసుకొని ఉచిత ఇసుక కూపన్‌ను పొందాలని తెలిపారు. గ్రామంలో జరిగే నిర్మాణాలకు మాత్రమే ఉచిత ఇసుక తరలించుకోవాలని, ఇతర ప్రాంతాలకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా అధిక మొత్తంలో ఇసుక కావాలన్న వారు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక స్టాక్ పాయింట్ వద్ద లోడింగ్ చార్జీలు చెల్లించి తీసుకెళ్లవచ్చని తెలిపారు.



మెగా ఇండస్ట్రియల్ హబ్ మ్యాప్

జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ హబ్

- రామాయపట్నం పోర్టుని అనుకొని ఏర్పాటు
- భూసేకరణకు మూడు గ్రామాల గుర్తింపు
- రెవెన్యూశాఖకు బాధ్యత అప్పగింత
- 2001 ఎకరాల్లో అంతర్జాతీయ పరిశ్రమలు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రామాయపట్నం పోర్టుని అనుకొని మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. ఆ పోర్టు పనులు ఇప్పటికే 80శాతం పూర్తి కావడంతో దానికి అనుసంధానంగా అనేక అంతర్జాతీయ పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తోంది. ఇందుకోసం రామాయపట్నాన్ని అనుకొని ఉన్న మూడు గ్రామాల భూముల్లో మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అంతర్జాతీయం గా పేరొందిన హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీ, ఇండోసోల్ సోలార్, జాన్సన్ ఇన్‌ఫ్రా, జేఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ వంటి అనేక సంస్థలు ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకొస్తున్నాయి.

రెవెన్యూకు ఏపీఐఐసీ ప్రతిపాదనలు

కావలి మండల పరిధిలోని చెన్నాయపాళెం, ఆనేమడుగు, తుమ్మలపెంట గ్రామాల పరిధిలో మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ఏపీఐఐసీ ప్రతిపాద నలు తయారు చేసి రెవెన్యూ శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ఈ హబ్ ఏర్పాటుకు దాదాపు 3వేల ఎకరాలు కావాల్సి ఉండగా ముందుస్తుగా 2001.78 ఎకరాల సేకరణకు

- మిగతా 6లో

మెగా ఇండస్ట్రియల్ హబ్‌కు ప్రతిపాదించిన భూముల వివరాలు

గ్రామం	పట్టాభూమి	అసైండ్	సీజేఎస్‌ఎఫ్
చెన్నాయపాళెం	986.24	445.28	163.67
ఆనేమడుగు	4.33	153.96	3.56
తుమ్మలపెంట	---	16.61	228.13
	990.57	615.85	395.36



టీటీడీ పాలకమండలి సభ్యురాలిగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. తిరుమలలోని శ్రీవారి ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులకు ఈవో శ్యామలారావు శ్రీవారి ప్రసాదాలను అందజేశారు.

మీ ప్రయాణానికి మా బహుమతి!



లక్కీ డిప్ విజేతకు బహుమతి ఇస్తున్న డీఎం షేక్ ఖరీమున్నీసా

'మా సంస్థ బస్సుల్లో ప్రయాణించండి. మేము ఇచ్చే బహుమతి అందుకోండి.' అంటున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ ఆర్టీసీ) అధికారులు. ఆత్మకూరు నుంచి సోమశిల రూట్‌లో పల్లెవాసులను ఆకర్షించేందుకు అధికారులు లక్కీడిప్ ఏర్పాటు చేశారు. బస్సులో ప్రయాణించిన ప్రజలు తమ టికెట్ మీద పేరు, చిరునామా, ఫోన్ నెంబరు రాసి ఓ బాక్సులో వేయాలి. ఇలా పదిహేను రోజులకోసారి బాక్సును తెరిచి, లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేస్తారు. ఇలా బుధవారం జరిగిన లక్కీడిప్‌లో ప్రదీప్ విజేతగా నిలిచారు. ఈయనకు ఆత్మకూరు డిపో మేనేజరు షేక్ ఖరీమున్నీసా బహుమతి అందజేశారు. ప్రయాణికులను ఆకర్షించేందుకే ఈ లక్కీ డిప్ ఏర్పాటు చేసినట్లు డీఎం చెప్పుకొచ్చారు.

- ఆత్మకూరు (ఆంధ్రజ్యోతి)

వానొస్తే మునకే!



వీఆర్సీ కూడలిలో..



హరనాథపురం రోడ్డుపై వర్షపునీటిలో కలిసిన మురుగు

మోస్తరు వర్షం కురిస్తే చాలు నెల్లూరు నగరరోడ్లు, లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రైల్వే అండర్ బ్రిడ్జిలలో నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. అలాగే గుంతల రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (నెల్లూరు, ఆంధ్రజ్యోతి)



ఆత్మకూరు బస్టాండు వద్దనున్న రైల్వే అండర్ బ్రిడ్జిలో నీరు ఉండటంతో వాహనదారుల అవస్థలు

మా గొప్ప టీచర్ !

- ఉపాధ్యాయుడిగా భీమేశ్వరరావు రాణింపు
- పేదలను ఆదుకుంటూ.. పలువురి నుంచి మన్ననలు
- సేవే ప్రవృత్తిగా సాగుతూ ఆదర్శ జీవితం

ఎంతోమంది ధనవంతులు ఉన్నా... సమాజంలో పేదలను ఆదుకునేందుకు ముందుకు వచ్చేవారు చాలా అరుదుగా చూస్తుంటాం. అలా వచ్చిన కూడా ఏడాదిలో ఓ సారి సాయంచేసి మమ అనిపించు కుంటారు. ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాత్రం కొన్నేళ్లుగా పాఠశాల విద్యార్థులను ఆదుకుంటూ, అటు తల్లిదండ్రులతోపాటు, ఇటు తోటి ఉపాధ్యాయుల మన్ననలు పొందుతున్నాడు. ఆయనే కొండాపురం మండలం కొమ్మి గ్రామానికి చెందిన కొండూరు భీమేశ్వరరావు. మండలంలోని అగ్రహారంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూనే పలువురికి ఆదర్శంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

-కొండాపురం, (ఆంధ్రజ్యోతి)



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న భీమేశ్వరరావు (ఫైల్)

సమాజంలోని ప్రజల్లో అజ్ఞానాన్ని తొలగించి, విజ్ఞానం నింపాలంటే అది ఒక్క ఉపాధ్యాయుడికే సాధ్యమవుతుంది. మానవసేవే మాధవసేవ.. అంటూ తాను ఎక్కడున్నా సేవామార్గంలోనే పయనించాలనే తలంపుతో వివిధ రకాల దాతృత్వ సేవలు కొనసాగిస్తున్నారు భీమేశ్వరరావు. గత 14 ఏళ్లుగా సొంత నగదు రూ లక్షల్లో ఖర్చుచేసి మండల పరిధిలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు అవసరమైన వసతులను సమకూర్చుతున్నారు.

● విద్యకు దూరం కారాదు..

విద్యాభ్యాస సమయంలో తన మిత్రులు పలువురు ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపివేశారు. అలా ఎవరికీ జరగకూడదని భీమేశ్వరరావు భావించారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యాభ్యాసంచేసి 2002లో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. అప్పటి నుంచి తన సొంత నగదుతో పేద విద్యార్థులకు పలు విధాలుగా సాయం చేయడం మొదలుపెట్టారు. మండలంలోని అగ్రహారం ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న భీమేశ్వరరావు విద్యకు దూరమయ్యే విద్యార్థులను గుర్తించి వారిని ఆదుకుంటున్నారు. వారికి అవసరమైన విద్యా ఉపకరణలు అందచేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.. పాఠశాలలకు అవసరమైన ప్యాన్లు, చిన్నపాటి మరమ్మతులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల కోరిక మేరకు సాయం చేస్తున్నారు. క్రీడలలో రాణిస్తున్న వారిని ప్రోత్సహించి, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో విజయం సాధించేందుకు తోడ్పడుతున్నారు. అలాగే కరోనా సమయంలోనూ క్వారంటైన్‌లో ఉన్న పేషంట్లకు పండ్లు, రొట్టెలు అందచేశారు.

● కల్యాణాలకు ప్రోత్సాహం

స్వగ్రామం కొమ్మిలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో జరిగే కల్యాణాలకు సొంత నిధులతో తాళి బొట్లు చేయించి అందచేస్తున్నారు. అంతేకాక పలు కార్పొరేట్ వైద్యశాలల్లో విధులు నిర్వహించే ప్రముఖ వైద్యులతో గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తున్నారు. పేదలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా 2016లో నెల్లూరులో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా బిందు మీనన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డు, సత్కారం పొందారు.



విద్యార్థులకు విద్యా ఉపకరణలు అందచేస్తున్న దాత భీమేశ్వరరావు

నిరంతరం సేవలు అందిస్తా...

ఉపాధ్యాయుడిగా పదవీ విరమణ పొందిన అనంతరం కూడా పేద విద్యార్థులకు సేవలందిస్తా. పేద పిల్లలను ఆదుకోవడం నాకు ఎంతో సంతోషాన్నిస్తుంది. వివిధ ఫౌండేషన్ల ద్వారా పేద విద్యార్థులకు సహాయం అందించేందుకు నా వంతు కృషిచేస్తా.

-కొండూరు భీమేశ్వరరావు



● విద్యార్థులపై కక్ష సాధింపా?



బుచ్చి ఎస్సీ హాస్టల్లో మధ్యాహ్నం 2 గంటలకు స్కూలు నుంచి వచ్చి నిద్రపోతున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్సీ హాస్టల్లో విద్యార్థులపై వాచ్‌మన్ కక్ష సాధింపులకు పాల్పడ్డారన్న ఆరోపణ ఆశ్చర్యపరుస్తోంది. ఈ హాస్టల్‌కు మంగళవారం సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జ్ డీడీ శ్రీనివాసరావు బుచ్చిలోని డీఎల్ఎన్ఆర్ హైస్కూలు పక్కనే ఉన్న ఎస్సీ హాస్టల్‌కు సాధారణ తనిఖీకి వచ్చినప్పుడు వాచ్‌మన్‌పై విద్యార్థులు ఫిర్యాదు చేశారు. గుడ్లు, పాలు సరిగా ఇవ్వడంలేదనీ చెప్పారు. ఈ క్రమంలో వార్డెన్‌తో పాటు నైట్‌డ్యూటీ వాచ్‌మన్‌ని డీడీ మందలించి వెళ్లారు. దీనితో ఆయన బుధవారం తెల్లవారుజామున 3గంటలకే విద్యార్థులను నిద్రలేపేసి ఇబ్బందిపెట్టాడని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. నిద్రమత్తులో ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు కొంతమంది నిద్రచాలక మధ్యాహ్నం 2 గంటలకే స్కూలు నుంచి హాస్టల్‌కు వచ్చి నిద్రపోయారు. వాచ్‌మన్ తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం(ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ రెసిడెన్షియల్ శిక్షణ రద్దు చేయాలి : బీటీఏ

నెల్లూరు(విద్య), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ రెసిడెన్షియల్ శిక్షణను వెంటనే రద్దు చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మణిసుబ్బు, మాసా ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయులు అనేక రకాల యాప్‌లతో సతమతమవుతూ మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాజాగా రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లో ఆపార్, యుడైస్‌ప్లస్, టెన్త్ ఫీజులు, నామినల్ రోల్స్ తదితర పనులతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతూ అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. వెంటనే స్పందించి ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అర్చకుల్లో ఆనందం

- రూ.15వేల వేతనం : 109 మందికి ప్రయోజనం
- ధూపదీప నైవేద్యం వారికి రూ.10వేలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనపై హర్షాతిరేకాలు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న అర్చక స్వాముల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలులోకి తెస్తోంది. రూ.50వేల నుంచి రూ.5లక్షలలోపు ఆదాయం కలిగిన ఆలయాల్లో పని చేసే అర్చకులకు కనీస వేతనం రూ.15వేలు చెల్లిస్తామని బుధవారం రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. దీంతో కూటమి ప్రభుత్వానికి జిల్లాలోని అర్చకులు కృతజ్ఞతలు చెబుతున్నారు. ధూపదీప నైవేద్యాలకు నోచుకొని దాదాపు 311 ఆలయాల అర్చకులకు గత ప్రభుత్వం రూ.5వేలు ఇస్తుండగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.10వేలకు పెంచింది. పెంచిన మొత్తాన్ని బకాయిలతో కలిసి బుధవారం నేరుగా అర్చకుల బ్యాంకు ఖాతాకు జమ చేసింది. దీంతో అర్చకులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 109 మంది అర్చకులకు ప్రయోజనం చేకూరనుంది.

అర్హుల గుర్తింపు : ఏసీ

దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు కనీస వేతనం రూ.15వేలు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా సర్వే చేసి అర్హులైన అర్చకులను గుర్తించడం జరుగుతుంది.



- కే జనార్దన్ రెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్

కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు

ధూపదీప నైవేద్యం కింద రూ.5వేలు పొందుతున్న అర్చకులకు ఆ మొత్తాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రూ.10వేలకు పెంచడం ఆనంద దాయకం. రూ.50వేల నుంచి రూ.5లక్షలలోపు వార్షికఆదాయం ఉన్న ఆలయాల అర్చకులకు ఇచ్చే జీతాన్ని రూ.15వేలకు పెంచడం హర్షణీయం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు. భగవంతుని ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం.



- ఉదయగిరి వెంకట శేషాచార్యులు, ప్రధాన కార్యదర్శి, జిల్లా అర్చక సమాఖ్య



వెలుగులు నింపారు

ధూపదీప నైవేద్యం కింద ఆలయాల అర్చకులకు ఇస్తున్న రూ.5వేలను రూ.10వేలకు పెం చడం అభినందనీయం. అలాగే తక్కువ ఆదాయం ఉన్న ఆల యాల అర్చకులకు రూ.15వేల జీతం ప్రకటించి అర్చక కుటుంబాల్లో దీపకాం తులు నింపారు.

- వేదగిరి రామకృష్ణమాచార్యులు, కట్టుబడిపాలెం ఆలయం అర్చకుడు



ప్రభుత్వానికి ఆశీస్సులు

నేను ఇందుకూరుపేట మండలం కొత్తూరులోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నా. మా ఆలయానికి ధూప దీప నైవేద్య పథకం కింద ప్రభుత్వం నెలకి రూ.5వేలు ఇస్తోంది. అంటే సంవత్సరానికి రూ.60వేలు. అందులో నా జీతం రూ.24వేలుపోగా మిగిలిన రూ.36 వేలను దేవాలయం, ఇతర ఖర్చులకు సర్దుకుంటున్నాం. నెలకు ఇచ్చే మొత్తాన్ని రూ.10వేలకు పెంచడం శుభపరిణామం. కూటమి ప్రభుత్వానికి చంద్రమౌళీశ్వరస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని వేడుకుంటున్నా.

- రామాయణం సురేష్, అర్చకుడు

జిల్లాలో మెగా ఇండస్ట్రియల్ హబ్

(5వ పేజీ తరువాయి)

ప్రతిపాదనలు పంపింది. దీంతో భూసేకరణ ప్రక్రియ ఊపందుకోనున్నట్లు సమాచారం.

ప్రతిపాదనలు పంపించాము



రామాయపట్నం అనుసంధానంగా మెగా ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు భూసేకరణ చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి, రెవెన్యూ శాఖకు ప్రతిపాదనలు పంపించాము. కావలి మండల పరిధిలోని మూడు గ్రామాల్లో భూములను గుర్తించాము. ఈ హబ్ ఏర్పాటు ద్వారా అనేక అంతర్జాతీయ పరిశ్రమలు జిల్లాకు రానున్నాయి.

- వీరశేఖర్‌రెడ్డి, ఏపీఐఐసీ జెడ్ఎం

అధికారులు వసూళ్లకు పాల్పడటం లేదు

● ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు

నెల్లూరు(క్రైం), నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైన్ షాపుల పర్మినెంట్ లైసెన్సులకు ఎక్సైజ్ అధికారులు ఎలాంటి వసూళ్లకు పాల్పడటం లేదని, కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తూ పత్రికలకు సమాచారం ఇస్తున్నారని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ పీ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నూతన మద్యం పాలసీని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉల్లంఘనకు తావు లేకుండా అమలు చేస్తున్నామని తెలిపారు. వైన్ షాపుల హద్దుల విషయంలో నియమ నిబంధనలు కఠినంగా పాటించడం వల్ల కొంత మంది వ్యక్తులు ఎక్సైజ్ అధికారుల మీద వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని, వారే తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

ప్రీస్కూల్ హాజరు పెంచండి

- ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీవో లక్ష్మీదేవి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 6 : అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ పిల్లల హాజరు తక్కువగా ఉందని, హాజరు శాతాన్ని పెంచాలని సూపర్‌వైజర్లను, అంగన్ వాడీ కార్యకర్తలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనా సుజన్ ఆదేశించారు. ఆమె బుధవారం నగరంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను నెల్లూరు సీడీపీవో లక్ష్మీదేవితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలాజీనగర్ సెక్టార్‌లోని చింతారెడ్డిపాళెం-జనరల్, చింతారెడ్డిపాళెం ఎస్సీ-2 అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ప్రీస్కూలు పిల్లలు నూరు శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని హెచ్చరించారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చిన్నారులకు కాచి చల్లార్చిన మంచి నీరు ఇవ్వాలని ఆదేశించారు. పిల్లలు భోజనానికి ముందు చేతులు పరిశుభ్రంగా కడు క్కునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎం నాగేశ్వరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనితెచ్చుకుంటున్న కేన్సర్ !!

- అలవాట్లే అసలు కారణం
- పొగాకు ఉత్పత్తుల వాడకంతో ప్రమాదం
- సర్వైకల్, బ్రెస్ట్ కేన్సర్లతో తస్మాత్ జాగ్రత్త
- జిల్లాలో 20 వేల మందికిపైగా నమోదు
- నేడు జాతీయ కేన్సర్ అవగాహన దినం



నెల్లూరు (వైద్యం), నవంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో కేన్సర్ వ్యాధి ప్రబలుతోంది. ప్రస్తుతం 20 వేల మందికిపైగా రోగులు నమోదయ్యారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. వీరిలో ఎక్కువ మంది వ్యాధి రెండోదశకు చేరుకున్న వారే. ఇంకా ఎంతో మంది వైద్య పరీక్షలు చేయించుకోక పోవటంతో వెలుగు లోకి రావడంలేదు. వ్యాధిగ్రస్తుల్లో ఎక్కువ శాతం గుట్కా, ఖైనీ, జరదా వంటి మత్తు పదార్థాలను నమిలేవారు ఉన్నారు. ఆ అలవాట్లతో నోటి కేన్సర్‌కు సంబంధించి దవడ, నాలుక, స్వరపేటిక కేన్సర్ బారినపడుతు న్నారు. ధూమపానంతో ఊపిరి తిత్తుల కేన్సర్‌కు గురవుతున్నారు. మహిళల విషయానికి వస్తే బ్రెస్ట్ కేన్సర్ బాధితుల సంఖ్య కూడా జిల్లాలో ఎక్కువగానే ఉంది. సురక్షితంకాని లైంగిక సంబంధాల వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్ ద్వారా మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ బాధితులు పెరుగుతున్నారు. ఇటువంటి వ్యాధిని నయం చేయవచ్చని, ఇతర అవయవాలకు సోకిన కేన్సర్ మాత్రం నివారణ కష్టతరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

చికిత్సలు ఇలా..

నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ వ్యాధికి కొంత వరకు చికిత్సలు అందుతున్నాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ విభాగం ప్రతి ఏటా 5 వేల మందికిపైగా కేన్సర్ బాధితులకు వైద్య సేవలు అందిస్తోంది. మెడికవర్ ఆసుపత్రిలోనూ కేన్సర్‌కు చికిత్స చేస్తున్నారు. కొంత మంది వ్యాధిగ్రస్తులు హైదరాబాద్‌లోని బసవతారకం కేన్సర్ ఆసుపత్రిని, తిరుపతి లోని స్విమ్స్ కేన్సర్ విభాగాన్ని, చెన్నైలోని ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ హెల్త్‌కేర్ ట్రస్ట్ కింద ఎంతో మంది వైద్యం చేయించుకుంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వాతావరణ కాలుష్యం లేకుండా చూసుకోవడం
- ధూమ, మద్యపానానికి దూరంగా ఉండడం
- 25 ఏళ్ల వయసు దాటిన మహిళలు తప్పనిసరిగా వక్షోజాల కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ పరీక్షలు చేయించుకోవడం
- వక్షోజాలలో గడ్డలు ఉన్నాయని అనుమానిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం.

రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రిలో సేవలు ఇలా..

సంవత్సరం	సర్జరీలు	రేడియేషన్	కీమో
2021	1114	547	4220
2022	886	536	6011
2023	834	547	7405
2024 (ఆగస్టు వరకు)	615	409	5240

ముందే గుర్తిస్తే నయం చేయవచ్చు



కేన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు. ప్రస్తుతం ఎన్నో వైద్య విధానాలు అందుబాటులో ఉన్నాయి. మహిళలు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించు కోవాలి. ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు తప్పనిసరి. నేడు ప్రధానంగా రొమ్ము కేన్సర్‌కు అనేక మంది గురవుతున్నారు. పొగాకు ఉత్పత్తులు, మద్యం వాడకం వల్ల నోటి, స్వరపేటిక కేన్సర్ బాధితులు ఎక్కువవుతున్నారు. రెడ్‌క్రాస్ ఆసుపత్రికి ఇతర జిల్లాల నుంచి కూడా రోగులు వస్తున్నారు.

- డాక్టర్ నాగేశ్వరరావు, రెడ్‌క్రాస్ కేన్సర్ ఆసుపత్రి సూపరింటెండెంట్



నిర్లక్ష్యం వద్దు

కేన్సర్ వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు. అనుమానం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కేన్సర్ విభాగం ఉంది. శస్త్రచికిత్సలు, కీమోథెరపీ చికిత్సలు అందిస్తున్నాం. ఆహారపు అలవాట్లు మార్చు కోవాలి. ఆకలి తగ్గిపోయినా, ఒక్కసారిగా బరువు తగ్గినా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం కేన్సర్ కేసులు పెరగటం బాధాకరం.. మహిళలు కనీసం ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. 13 నుంచి 14 ఏళ్ల వయసున్న యువతులు తప్పనిసరిగా వ్యాధి నిరోధక ఇంజక్షన్ వేయించుకోవాలి. ఈ విధంగా మూడు నెలలకు రెండు దఫాలుగా వేయించుకుంటే భవిష్యత్తులో గర్భాశయ కేన్సర్ రాదు.

- డాక్టర్ పద్మావతి, జీజీహెచ్ కేన్సర్ వైద్య నిపుణులు


ప్రజా, రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం : సీపీఎం


విలేకరులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేఖరులతో మాటాడుతూ మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో సాగు, తాగునీరు కరువై రైతులు, యువత వలసబాట పడుతున్నా టీడీపీ, వైసీపీ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్‌రోడ్డు, ఉదయగిరి-నందవరం రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేదన్నారు. ఉదయగిరి వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలు అందడం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 10న వరికుంటపాడు, ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించి ఉదయగిరిలో సీపీఎం ప్రాంతీయ మహాసభ, డిసెంబరు 7, 8వ తేదీల్లో జిల్లా మహాసభలు ఇందుకూరుపేట, ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో రాష్ట్ర మహాసభలు నెల్లూరులో జరుగుతాయని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, ఫరుద్దీన్‌బాషా, కోడె రమణయ్యతదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సదరన్ కాలువ వంతెన

- పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో గ్రామస్థులు


శిథిలస్థితిలో ఉన్న సదరన్ కాలువపై ఉన్న వంతెన


కుంగిన సదరన్ కాలువ వంతెన రహదారి

సంగం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెం వద్ద ఉన్న సదరన్ చానల్ మీద ఉన్న మూడవ వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని గ్రామస్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన మీదుగానే అన్నారెడ్డిపాళెం, పల్లిపాళెం గ్రామస్థులు బుచ్చిరెడ్డిపాళెం గ్రామానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఈ వంతెన నిర్మించి 130 సంవత్సరాలు కావడంతో కాంక్రీట్ కుంగి దెబ్బతింది. దీనిపై కంకర వేసి గ్రావెల్‌తో పూడ్చి ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు. అన్నారెడ్డిపాళెం గ్రామం సంగం మండల కేంద్రానికి 14 కిలోమీటర్లు, బుచ్చిరెడ్డిపాళెంకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో అన్నారెడ్డిపాళెం గ్రామస్థులు ఎక్కువగా దగ్గరలో ఉన్న బుచ్చిరెడ్డిపాళెం వైపు ప్రతి పనికి వెళ్లాతారు. సంగం మండల కేంద్రానికి రావాలన్నా బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లి అక్కడి నుండి బస్సులో వస్తారు.

పెరిగిన రాకపోకలు

అన్నారెడ్డిపాళెం గ్రామానికి ఏకైక రహదారిగా ఉన్న సదరన్ చానల్ వంతెన మీద రాకపోకలు పెరిగాయి. గ్రామంలో పండిన ధాన్యం ఈ రహదారి మీదగానే లారీలు, ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించాలి. దీంతో వంతెనపై భారం పడుతోంది. ఇంత ప్రాధాన్యత కలిగిన వంతెన శిథిల స్థితిలో ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలమైన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

బోగస్ మస్టర్లపై గట్టి చర్యలు

- కందుకూరు ఏపీడీ బాబూరావు



కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో బోగస్ మస్టర్ల నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఫీల్డ్‌లో రెగ్యులర్‌గా విజిట్ చేస్తున్నా. రెండు గ్రామాల్లో తనిఖీలు చేసి బోగస్ మస్టర్లు ఉంటే ఆఫ్‌సెంట్ వేయటమే గాక హెచ్చరికలు చేస్తున్నామని కందుకూరు ఏపీడీ జె బాబూరావు పేర్కొన్నారు.

ఇంటర్వ్యూ

? ఉపాధి హామీ పథకంలో బోగస్ మస్టర్ల నిరోధానికి ఏం చేస్తున్నారు

! బోగస్ మస్టర్ల నిర్మూలనకు గట్టి చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో ఇంట్లో ఒకరికి బదులు మరొకరు పనికి వెళ్లటం వల్ల సమస్య వస్తోంది.

? గ్రామంలో నివాసం లేని వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, విద్యార్థుల పేరుతో కూడా మస్టర్లు వేస్తున్నారట

! గ్రామంలో నివాసం లేని వారి జాబ్‌కార్డులు పరిశీలించి డిలీట్ చేయిస్తున్నాం. ఇప్పటికే 90 శాతం వరకు తొలగించాం. ఇంకా అలాంటి కార్డులు ఏమైనా ఉంటే తొలగిస్తాం.

? ఫీల్డ్ అసిస్టెంట్లపై ఏమైనా చర్యలు తీసుకున్నారా

! ప్రస్తుతానికి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరగలేదు. అందరూ మేట్‌లుగానే చేయిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరిగాక చర్యలు ప్రారంభిస్తాం.

? గోకులం షెడ్లు, పండ్ల తోటలకు ప్రోత్సాహం ఎలా

! కందుకూరు నియోజకవర్గానికి 106 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు పెంపకానికి ముందుకొచ్చేవారికి మూడేళ్లపాటు నిర్వహణకోసం ఎకరానికి లక్షన్నర వరకు లబ్ధి చేకూరుతుంది.

పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుడి చేయూత


భూమిపూజ చేస్తున్న అధికారులు, దాత

అనంతసాగరం, నవరంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో స్టేజి నిర్మాణం కోసం ఆ పాఠశాలలో పనిచేసే బయాలజీ ఉపాధ్యాయుడు మెట్టుకూరు సుబ్బారెడ్డి చేయూత నందించారు. బుధవారం తన సొంత నిధులు రూ. 3 లక్షలు వెచ్చించి పనులకు భూమి పూజ చేశారు. దీంతో ఎంఈవో 2 ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డిని అభినందించారు.

మర్రిపాడులో ప్రబలుతున్న విషజ్వరాలు

మర్రిపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో రోజురోజుకు విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ప్రతి ఇంటిలో ఒకరు జ్వరంతో బాధ పడుతూ రూ. వేలు ఖర్చు చేస్తున్నారు. కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే మిగతా వారందరికి ఆ వైరస్ వ్యాపించటంతో ఒక్కొక్కరుగా మంచాన పడుతున్నారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నా, అవగాహన లోపంతో అత్యధికులు ఆత్మకూరు, బద్వేలు ప్రాంతాల్లోని ప్రైవేటు వైద్యశాలలకు క్యూ కడుతున్నారు. అక్కడ ఒక్కొక్కరికి రూ. 2 నుంచి రూ. 3వేల వరకు ఖర్చు అవుతోంది. నెల్లూరు తదితర పట్టణాలకు వెళితే రూ. 5 వేల నుంచి రూ. 8వేలు వరకు ఖర్చు చేయక తప్పడం లేదు. గతంలో జ్వరం వస్తే పారాసెటమాల్, డోలో 600 వాడితే జ్వరం తగ్గేది. కానీ ఇప్పుడు మూడునాలుగు రోజులపాటు యాంటీబయాటిక్ వాడాల్సి వస్తున్నది. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణంలో మార్పులు వచ్చాయి. భూగర్భజలాలు కలుషితమయ్యాయి. అంతేకాక గ్రామాల్లో రోడ్ల వెంబడి ఎక్కడిబడితే అక్కడ చెత్త పేరుకుపోయింది. ఈ సీజన్‌లో బ్లీచింగ్ చల్లడం, శానిటేషన్ పనులపై సర్పంచులు శ్రద్ధ పెట్టడం లేదు.దీంతో ప్రతి గ్రామంలో జ్వర పీడితులు ఉంటున్నారు.


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

వాతావరణ మార్పులతో నీరు కలుషితమైంది. ఎంఎల్‌హెచ్‌పీల చేత ప్రతి గ్రామంలో తాగునీటికి శ్యాంపిల్ సేకరించి పరీక్షలు చేస్తున్నాం. జనవరి వరకు కాంచిన నీటిని తాగటంతో అనారోగ్యానికి దూరంగా ఉండవచ్చు. అలాగే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ గోపినాథ్, మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి

ఉపాధి కూలీలకు అవగాహన


కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీడీ

వలేటివారిపాలెం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కూలీలకు కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని ఉపాధి హామీ పథకం ఏపీడీ బాబూరావు తెలిపారు. మండలంలోని శింగమనేని పల్లెలో గల అంకన్నకుంటలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల హాజరు మస్టర్లను పరిశీలించారు. తనిఖీ సమయంలో ఫీల్డ్‌అసిస్టెంట్ జీ ప్రసాద్‌రావు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి : యూటీఎఫ్


ఎంఈవోను అభినందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

వరికుంటపాడు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయం ఆసన్న మవుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించకపోవడం దారుణమని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రావిళ్ల నాగార్జున అన్నారు. బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్క్ అడ్జస్ట్‌మెంట్ జరిగినప్పటికీ పెద్దిరెడ్డిపల్లి, కాకొల్లువారిపల్లి ఉన్నత పాఠశాలల్లో ప్రధానమైన గణిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులతో సహా తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే ఉపాధ్యాయుల కొరతతో పాటు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంఈవో-1గా నూతన బాధ్యతలు చేపట్టిన షేక్ మస్తానవలిని ప్రత్యేకంగా అభినందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వి సుబ్రమణ్యం, బాధ్యులు ఎం సుబ్బారావు, ఎం మనోహర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్


ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

కావలి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి) : దోమల నివారణకు కావలిలో మున్సిపల్ అధికారులు పాగింగ్ చేస్తున్నారు. బుధవారం పట్టణంలోని పాతూరులో పాగింగ్ చేపట్టారు. దోమలనివారణే లక్ష్యంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో నిత్యం పాగింగ్ కొనసాగుతోందని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు కూడా మురుగు కాలువల్లో చెత్తా చెదారం వేయకుండా ఉండాలన్నారు.

పెరమనలో వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సంగం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన గ్రామంలో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం అందడంతో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లార్వా, మురికినీటి నిల్వ, జ్వరాలపై సర్వే చేశారు. అనంతరం జ్వరాలు ఉన్నవారికి వైద్య శిబిరంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ అశోక్, ఎంపీహెచ్‌ఈవో మల్లెం కొండయ్య, హెల్త్ సూపర్‌వైజర్ ఆరోగ్య మేరీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన గురువారం ఉదయం మండల సరసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి


సబ్‌కలెక్టరు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టు పరిధిలోని సాలిపేట బీసీ కాలనీని నిర్వాసిత గ్రామంగా గుర్తించి, అక్కడ నివసిస్తున్న కుటుంబాలకు పరిహారం చెల్లించాలని సీపీఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు బుధవారం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోర్టు నిర్మాణం కోసం, పోర్టుకు రైల్వేలైను నిర్మాణం కోసం మా భూములు తీసుకున్నారని, పోర్టు నిర్మాణం ప్రారంభించే సమయంలో మా కాలనీలో సర్వే చేసి ఇంటినెంబర్లు ఇచ్చారు కానీ పరిహారం చెల్లించలేదన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. భూములన్నీ కోల్పోయాక తాము అక్కడ ఎలా జీవించాలో అధికారులు చెప్పాలని కోరారు. వాస్తవ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సబ్ కలెక్టరు మాట్లాడుతూ గ్రామాన్ని సందర్శించి వాస్తవ పరిస్థితులు ఉన్నతాధికారులకు నివేదిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ. వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకుడు జీవీబీ కుమార్, సాలిపేట గ్రామస్థులు అట్లా కోటయ్య, శ్రీరామమూర్తి, కే వాసుదేవరావు, ఎస్. కృష్ణ, చల్లా వేములస్వామి, బండారు రామారావు, నరేంద్ర, కే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యపై సబ్ కలెక్టర్ స్పందన

- ఉలవపాడు: మండలంలోని భీమవరం రైతులు డొంక పోరంబోకు ఆక్రమణపై చేసిన ఫిర్యాదుపై సబ్‌కలెక్టర్ శ్రీపూజ స్పందించారు. బుధవారం డొంక బాటను తహసీల్దార్ లావణ్యతో కలిసి పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు ఎండ్లబండ్లు వెళ్లేందుకు వీలులేకుండా ఆక్రమించుకొని, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని సబ్‌కలెక్టర్‌కు గ్రామస్థులు వివరించారు. వెంటనే సర్వే చేపట్టి హద్దు రాళ్లు వేయాలని, ఉపాధి పనుల ద్వారా బాటను పునరుద్ధంచాలని తహసీల్దార్, సర్వేయర్‌లను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

న్యూస్ బాక్స్

వీవోఏల నిరసన


వినతిపత్రం ఇస్తున్న వీవోఏలు

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అనంతసాగరం వెలుగు కార్యాలయం వద్ద బుధవారం వారు నిరసన తెలిపి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఏపీఎం రమణారావుకు అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాష, సౌబాగ్య పాల్గొన్నారు.

ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి

వింజమూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు హమీద్ సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గ్రామాల్లో ఈనెల 9, 10, వచ్చేనెల 23, 24 తేదీలలో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బీఎల్‌ఓలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఉప విద్యాశాఖాధికారి

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలమర్రి ఉన్నత పాఠశాలను ఆత్మకూరు ఉప విద్యాశాఖాధికారి గోపాల్ బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులు పరిశీలించి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్ పాల్గొన్నారు.

చోరీ కేసు విచారణ ముమ్మరం

లింగసముద్రం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద పవనిలో టీడీపీ నేత రామిశెట్టి మాలకొండయ్య ఇంట్లో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ముమ్మరంగా విచారిస్తున్నారు. గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్సై షేక్ మహబూబ్ సుభానిల ఆధ్వర్యంలో బుధవారం పెదపవనిలో మాలకొండయ్య ఇంటిని మరోసారి పరిశీలించారు. గుడ్లూరు మండలంలోని నరసాపురం చెక్‌పోస్టు వద్ద, కావలి రూరల్ మండలం కొత్తపల్లి వద్ద ఉన్న సీసీ కెమెరాలను సీఐ ఎస్సైలు పరిశీలించారు. బాధితుడితో కూడా ఈ కేసు విషయమై మాట్లాడారు. కాగా ఒక పాత నేరస్థుడు, మరో ముగ్గురు బయటి వ్యక్తులు మాలకొండయ్య ఇంటికి సమీపంలోని పాత హైస్కూల్ వద్ద మద్యం సేవించినట్లు పోలీసులకు కొందరు గ్రామస్థులు చెప్పినట్లు తెలిసింది. అయితే బాగా తెలిసిన వ్యక్తులే చోరీ చేసినట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. ఈ కేసు పోలీసు లకు సవాల్‌గా నిలిచింది.

ముమ్మరంగా టీడీపీ సభ్యత్వ నమోదు


మాట్లాడుతున్న సుబ్బానాయుడు

కావలి, నవంబరు6 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్‌ల ఆదేశాల మేరకు 60 శాతం లక్ష్యంగా టీడీపీ సభ్యత్వాలను ముమ్మరంగా చేపడుతున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. కావలిలోని తన నివాసంలో బుధవారం ఆయన విలే కరులతో మాట్లాడారు. తన సోదరుడు మాలేపాటి రవీంద్ర నాయుడు దగదర్తి మండలంలో ఇళ్లిళ్లు తిరుగుతూ, ఇప్పటికీ 5,500 సభ్యత్వాలు చేయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా రోడ్లపై తట్టెడు మట్టి, కాలువల్లో పూడిక తీసిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడా రోడ్లపై గుంటలు కనిపించకుండా మరమ్మతులు చేస్తున్నారని ఆయన తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ ద్వారా ప్రజలపై భారం పడకుండా ఇసుక అందిస్తున్నామని చెప్పారు. దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అమలు చేస్తున్నామని తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో

ఆత్మకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఆత్మకూరు ఆర్డీవో బి పావని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, బోధన అంశాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దువ్వూరు కాలువకు నీటి విడుదల


నీటిని విడుదల చేస్తున్న అధికారులు, రైతులు

సంగం, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): సంగం వద్ద పెన్నానది నుంచి కొత్త రెగ్యులేటర్లు ఎత్తి దువ్వూరు కాలువకు బుధవారం నీటిని విడుదల చేశారు. సంగం బ్యారేజీ నిర్మాణంలో భాగంగా దువ్వూరు కాలువకు నూతన రెగ్యులేటర్లు నిర్మించారు. దువ్వూరు కాలువ పూడికతీత పనులు పూర్తికావడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలు, ఆయకట్టు రైతుల కోరిక మేరకు డీఈ పెంచలయ్య ఆధ్వర్యంలో నూతన రెగ్యులేటర్లు ఎత్తి దువ్వూరు కాలువకు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినయ్ కుమార్, ఇరిగేషన్ సిబ్బంది, తరుణవాయి రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3 లక్షల విరాళం


ఇంటూరి సమక్షంలో విరాళం అందజేస్తున్న గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కందుకూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేసే చర్యల్లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ. 3 లక్షలు విరాళంగా అందజేశారు. బుధవారం వారు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన సమక్షంలో పోలీసు అధికారులకు విరాళాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గోల్డ్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, డీఎస్పీ పీ బాలసుబ్రహ్మణ్యం, సీఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

కందుకూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపాడు, ఆనందపురం గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి వీ రాము ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి షేక్ మాబాషా, వ్యవసాయ సహాయకులు సీహెచ్ బ్రహ్మయ్య, పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ఉదయగిరి రూరల్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి ఆంజనేయులనాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని అప్పసముద్రం, కొండాయపాళెం పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశం నిర్వమించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరిసాగులో మెలకువలు పాటించాలి

గుడ్లూరు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): వరి పైరు సాగుచేస్తున్న రైతులు, తగిన మెలకువలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రవికుమార్ అన్నారు. మండలంలోని సాలిపేట, మోచర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షారుక్‌ఖాన్, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఝాన్సీ, యానిమల్ అసిస్టెంట్ ఎం. గోపి, ఆయా గ్రామాల రైతులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి సస్యరక్షణపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఉలవపాడు, నవంబరు 6(ఆంధ్రజ్యోతి): మామిడిసాగులో పూత, పిందె, కాయ దశ వరకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు మండల వ్యవసాయ, ఉద్యాన అధికారులు బీ తిరుమల జ్యోతి, బీ జ్యోతి ఆధ్వర్యంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. భీమవరం ఆర్‌ఎస్‌కే కేంద్రంలో బుధవారం జరిగిన రైతు శిక్షణలో కందుకూరు కేవీకే ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త జీ ప్రసాద్ పాల్గొన్నారు. వరి, మామిడి పంటల సాగులో మెలకువలు, యాజమాన్య పద్ధతులు, జీవ రసాయన ఎరువుల వాడకంపై రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది వెంకట్రావు, శ్రీచరిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా

పట్టించుకోని అధికారులు


ప్రభుత్వ భూమిలో దున్నుతున్న ట్రాక్టర్

అనంతసాగరం, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి కబ్జా చేసి కంచె ఏర్పాటు చేయడంతో పాటు పంటసాగుకు పనులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని బొమ్మవరంలో చెరువు లోతట్టున సర్వే నెంబరు 211లో 5 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించి సాగుకు ఉపక్రమించారు. ఈ ఆక్రమణ గురించి రెండు నెలల క్రితం ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఆక్రమిత భూమిలో హెచ్చరిక బోర్డు పెట్టారు. అయితే ఆక్రమణదారులు బోర్డును తొలగించి బుధవారం ట్రాక్టరుతో దున్ని సాగు పనులు చేపట్టారు. ఈవిషయాన్ని అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని, చెరువు లోతట్టు ప్రాంతాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.